




ESTD: 1999 www.voodayam.com

# వుదయం








ఖమ్మం | 10-03-2026 మంగళవారం | సంపుటి : 13 | సంచిక : 241 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal | Follow us on


# లిక్కర్ కేసు రివర్స్!

## రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుపై ఢిల్లీ హైకోర్టు స్టే

- కేజ్రీవాల్, కవిత, మనీశ్ సిసోడియా సహా మొత్తం 23 మందికి నోటీసులు
- సిబీఐ తరపున వాదనలు వినిపించిన సోలిసిటర్ జనరల్ తుషార్
- విచారణ వారం రోజులు వాయిదా



**హైదరాబాద్, మార్చి 9 (వుదయం ప్రతినిధి) :** దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేజ్రీవాల్, కవిత, మనీశ్ సిసోడియా సహా మొత్తం 23 మందికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సీబీఐ కేసులో ప్రతివాదుల నుంచి సమాధానాలు కోరింది. ఈ కేసులో నిందితులకు రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సీబీఐ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం ఢిల్లీ హైకోర్టు విచారణ జరిపింది. సీబీఐ తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తు సంస్థపై తీర్పులో ప్రత్యేక కోర్టు వ్యాఖ్యలపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఈడీ కేసు విచారణ వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచిస్తూ తదుపరి విచారణ వారం రోజులు వాయిదా వేసింది. వచ్చే సోమవారం తదుపరి విచారణ చేపట్టనుంది. దీంతో మద్యం కేసులో క్లీన్ చిట్ పొందిన 23 మందికి మళ్లీ కేసు భయం పట్టుకున్నది. నిజానికి, కింది కోర్టు తీర్పు ఇచ్చిన రోజే.. సీబీఐ ఆఘమేఘాలపై హైకోర్టులో అప్పీల్ చేసింది. కేసు క్లోజ్ అవ్వకుండా.. ఇంకా ఉంది అని పించింది.

మిగతా 2లో

# హోర్ముజ్ సంక్షోభం

## 1973 నాటికన్నా భారీ చమురు షాక్‌ను ఇస్తుందా?




**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం) :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ప్రక్రియలు మరోసారి చుక్కలను అంటుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా ఉమ్మడిగా ఇరాన్‌పై దాడి చేసిన కొద్ది రోజుల్లోనే చమురు ధర బ్యారెల్‌కు 120 అమెరికన్ డాలర్లను చేరుకుంది. దీనితో పాటుగా ప్రపంచానికి చమురు సరఫరాను పూర్తిగా అడ్డుకుంటామని బెదిరింపులకు పాల్పడిన నేపథ్యంలో ధరలు అస్థిరతకు లోనవుతున్నాయి. మార్కెట్లు రోజుకు 100 మిలియన్ బారెళ్లు ఉపయోగిస్తుం దని అంచనా, ఈ క్రమంలో సరఫరా లంకెలకు అంతరాయం కలిగితే ప్రధాన సమస్య ఏర్పడుతుంది.

**హోర్ముజ్ జలసంధి ద్వారా 20 మిలియన్ బారెళ్ల రవాణా..** అమెరికా ఇంధన సమాచార ప్రాధికార సంస్థ అంచనా ప్రకారం, ప్రతి రోజూ హోర్ముజ్ జలసంధి ద్వారా దాదాపు 20 మిలియన్ బారెళ్ల ముడి చమురు, పెట్రోలియం రవాణా అవుతాయి. ఇది సముద్రమార్గం ద్వారా జరిగే చమురు వాణిజ్యంలో పావు వంతు, ప్రపంచ ముడి చమురు వినియోగంలో 20శాతం. హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అయ్యే చమురు ఆసియా, చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియాలకు వస్తుంది. హోర్ముజ్‌ను పూర్తిగా మూసి వేయడం అన్నది చరిత్రలో అతిపెద్ద చమురు సరఫరా షాక్ సంభవిస్తుందని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు.

మిగతా 2లో

యుద్ధం వల్ల ద్రవ్యోల్బణం పెరుగవచ్చు : ఐఎంఎఫ్ 3

# ఏకగ్రీవం

- తెలంగాణ నుంచి సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక
- స్క్రూటినిలో తిరస్కరణకు గురైన ఇండిపెండెంట్ నామినేషన్
- ఎమ్మెల్యేల మద్దతు లేకుండా నామినేషన్ దాఖలు చేసిన సాయి
- ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్

**హైదరాబాద్, మార్చి 9 (ఎఎంస్) :** ఊహించినట్టే జరిగింది. తెలంగాణలో రాజ్యసభ ఎన్నిక ఏకగ్రీవమైంది. రాష్ట్రం నుంచి

## సిరిమంతుడు సింఘ్వీ



కాంగ్రెస్ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక దాదాపు ఖరారైంది. వీరితో పాటు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి.. నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేల మద్దతు లేకుండా నామినేషన్ వేశారు. దీంతో అతని నామినేషన్ స్క్రూటినీ దశలోనే తిరస్కరణకు గురైంది.

మిగతా 2లో

# తిరిగొచ్చిన 67 వేల మంది

## పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులపై పార్లమెంట్‌లో మంత్రి జయ శంకర్



**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం):** పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న సంక్షోభం నడుమ పౌరులకు సహాయపడేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను కొనసాగిస్తోందని, మార్చి 8వ తేదీ నాటికి యుద్ధ ప్రభావిత దేశాల నుంచి 67వేల మంది భారత జాతీయులు తిరిగి వచ్చినట్టు విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్ సోమవారం రాజ్యసభకు వెల్లడించారు. పశ్చిమాసియాలో పరిణామం చెందుతున్న పరిస్థితిని ఎగువ సభకు వివరిస్తూ, ప్రాంతీయ గగనతలాన్ని స్వల్పంగా తెరిచిన ప్రతిసారీ భారత పౌరులు తిరిగి వచ్చేందుకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని ఆయన చెప్పారు. ఎప్పుడ గగనతలాన్ని పాక్షికంగా తెరిచినా, భారత పౌరులు తిరిగి రావడానికి వీలుగా షెడ్యూల్ చేయని విమానాలతో సహా వాణిజ్య విమానాలను వినియోగాన్ని ఆమోదించి, నిర్వహించామని ఆయన అన్నారు. మార్చి 8 నాటికి, 67,000 మంది భారత జాతీయులు తోడ్పాటునందుకున్నారని అంచనా, అని విదేశాంగ మంత్రి అన్నారు.

మిగతా 2లో

# కడుపు తరుక్కుపోతుంది

- వెలుగుమట్ల బాధిత మహిళల దుస్థితిపై కవిత
- బాధితులను పరామర్శించిన జాగృతి అధ్యక్షురాలు
- పోలీసులు, బాధితుల మధ్య తోపులాట, కవిత అరెస్ట్
- ఉసురు తీస్తోన్న కాంగ్రెస్ పాలన
- సర్కార్‌కు వెలుగుమట్ల బాధితుల ఉసురు తగులుతుంది
- రాత్రికి రాత్రే బుల్డోజర్లతో ఇళ్లను కూల్చడం దారుణం
- ఖమ్మంలో జాగృతి ఆధ్వర్యంలో ఆందోళన



**ఖమ్మం, మార్చి 9 (వుదయం ప్రతినిధి) :** వెలుగుమట్ల లో బుల్డోజర్లతో ఇళ్లను నేలమట్టం చేసిన ప్రభుత్వానికి, నాయకులకు బాధిత మహిళల ఉసురు తగులుతుందని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. సోమవారం ఖమ్మంలోని అంబేద్కర్ భవన్ లో వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. వెలుగుమట్లలో బాధితుల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందన్నారు. ఎగ్జామ్స్ సయమంలో పుస్తకాలతో సహా రాత్రికి రాత్రే బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేయటం ఆవేదన కలిగించిందన్నారు. బాధి తుల ఆవేదన కొంమంది రాజకీయ నాయకులకు ఎగ్జిబిషన్ మాదిరిగా తయారైందని ఆగ్రహం వ్య క్తం చేశారు. గతంలో మీ ఇళ్లను కూల్చేసే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ నాయ కులు ఇప్పుడు పాపాలు కడుక్కునే ప్రయత్నం లో బాధితులకు భోజ నం పెడుతున్నారన్నారు. తాను ఎక్క దున్న సరే మహిళలు, పేదల పక్షాన ఉంటా నని అన్నారు.

మిగతా 2లో

# పోలీసు బలోపేతం

## జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు • సమస్య ఏంటో తెలిస్తే.. 50 శాతం పరిష్కారమైనట్టే • అవసరమైన నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం

- పోలిసింగ్'బలోపేతానికి ప్రణాళికలు
- సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్‌లో అప్‌గ్రేడ్ అవసరం
- సమస్యల అధ్యయనం, పరిష్కారానికి సీఎస్ ఆధ్వర్యంలో కమిటీ
- నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటాం
- మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు
- తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ కార్యక్రమంలో సీఎం రేవంత్





**హైదరాబాద్, మార్చి 9 (వుదయం ప్రతినిధి) :** మారుతోన్న సమాజం... దానికి తగ్గట్టు పెరుగుతోన్న నేరాలను ఛేదించేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు తమను తాము అప్ గ్రేడ్ చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో పోలిసింగ్ వ్యవస్థనూ అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. అందుకోసం సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరాన్ని సీఎం ప్రస్తావించారు. పోలీస్ శాఖ బలోపేతానికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందన్న సీఎం.. పనితీరు ఆధారంగానే పోలీసులకు పోస్టింగులు కల్పిస్తామని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ లోని ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో "తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ – 2026" కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలందించడం ద్వారానే పోలీసుశాఖకు గౌరవం పెరుగుతుందనే విషయాన్ని ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలని సీఎం చెప్పారు. ప్రస్తుతం కొత్త కొత్త మార్గాల్లో నేరాలు జరుగుతున్నాయనీ దీంతో పోలీసులకు సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. మనకున్న రిసోర్సుల ద్వారా మాత్రమే సాంకేతిక సవాళ్లను అధిగమించగలమని చెప్పారు. ఎక్కడైనా శాంతి భద్రతలు సరిగ్గా ఉంటేనే పెట్టుబడులు వస్తాయనే విషయాన్ని గ్రహించాలన్నారు. లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేసే క్రమంలో పోలీసులు ఎన్నో సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. కానీ ఎంత బాగా పనిచేసినా ఈ వ్యవస్థలో మొదటగా నిందించబడేది పోలీసులేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే పోలీసులు ముందుగా సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు. సమస్య అర్థమైతే సగం సమస్యను పరిష్కారం లభించినట్లేనన్నారు. దేశ జనాభాలో 2.5శాతం ఉన్న తెలంగాణ.. దేశ జీడీపీకి 5శాతం వాటాను అందిస్తోందని చెప్పారు. దేశ జీడీపీకి తెలంగాణ వాటా 10శాతానికి చేరాలనేది తమ ఆశయమని చెప్పారు. దేశ రాజధాని దిల్లీ అత్యంత తీవ్రమైన కాలుష్యాన్ని ఎదుర్కొంటోందనీ బెంగళూరును ట్రాఫిక్ సమస్య వేధిస్తోందన్నారు. ముంబయి, చెన్నై నగరాలు వరద సమస్యను ఎదుర్కొంటున్నాయని వివరించారు. పాలకుల దూరదృష్టి లేకపోవడంతోనే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాలు నిర్దేశించుకొని పని చేయాలని పోలీసులకు సూచించారు. ఉన్నతాధికారులు తమ కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వారి కింద పని చేసే అధికారులతో టచ్‌లో ఉండాలన్నారు. వారితో స్నేహంగా మెలిగి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ**

సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల నుంచి కొన్ని ప్రతిపాదనలు తనకు అందాయని సీఎం చెప్పారు. ఆయా ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందు కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తానని సీఎం ప్రకటించారు. మీరు చేసిన ప్రతిపాదనలపై కమిటీలో చర్చించి.. చట్టం రూపంలో అమలు చేసుకుందామన్నారు. అయితే దాని సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలన్న రేవంత్ రెడ్డి.. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలన్నారు. పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్ కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరమని సీఎం అభిప్రాయపడ్డారు. ఇతర శాఖల్లా పోలీస్ శాఖలో ఆటో మోడ్.. ఆటో ప్రమోషన్ ఉండదని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్ లో కేటాయించుకోవచ్చని సీఎం తెలిపారు.

## గల్ఫ్ వ్యాప్తంగా ఇరాన్ దాడులు 2

క్షిపణులు, డ్రోన్లతో హోరెత్తిస్తున్న టెహ్రాన్



## మాటల మారాఠీ రేవంత్

- మాట మారుస్తూ సీఎం పబ్బం
- ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా స్కూటీలా..?
- పేదలు, దళిత, గిరిజనులకు లేకుండా జర్నలిస్టులకు భూములా..?
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి ఆగ్రహం



2



## ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి తెలంగాణ

- అందుకు అనుగుణంగా క్రీడా విధానం
- క్రీడాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



3

## ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా ఎందుకు విడిచిపెడుతోంది?

ఇరాన్ ఆయిల్ ఎగుమతి టెర్మినల్ ఖర్గ్ పై దాడిచేస్తే ప్రపంచ చమురు మార్కెట్లు భగ్గుమంటాయి

# పశ్చిమాసియాలో రాజీపడ్డ ప్రధాని : రాహుల్



**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అమెరికా, ఇజ్రాయెల్ తో ఎలా రాజీ పడ్డారో వెల్లడిస్తుంది కనుక పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం ఆరోపించారు. పశ్చిమాసియాలో పరిస్థితి ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని, అక్కడ జరిగే వివాదం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని కాంగ్రెస్ ఎంపీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ఎంత నష్టాన్ని కలిగిస్తుంది? ఒక ప్రధాన మార్పు దిశగా పోరాటం జరుగుతోంది. ఇది మన ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. మీరు స్టాక్ మార్కెట్‌ను చూశారు. ప్రధాని మోదీ అమెరికాతో ఒప్పందంపై సంతకం చేశారు. దేశం పెద్ద దెబ్బ తినబోతోంది. కాబట్టి, దాని గురించి చర్చించడంలో వారికి సమస్య ఏమిటి? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా ముఖ్యం కాదా? ఇంధన ధర, ఆర్థిక విధ్వంసం ముఖ్యమైన చర్చనీయాంశాలు కాదా? ఇవి ప్రజా సమస్యలు, అని రాయ్ బరేలి ఎంపీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభంపై ఉభయ సభలలో చర్చ జరిగితే ప్రధానమంత్రి పార్లమెంటును ఎదుర్కోలేరని గాంధీ అన్నారు. మేము వీటిని ముఖ్యమైనవిగా భావిస్తున్నాం, చర్చను కోరుకుంటున్నాం. కానీ వారు చర్చను కోరుకోవడం లేదు ఎందుకంటే దాని నుండి ఇతర విషయాలు బయటకు వస్తాయి, ఎందుకంటే ప్రధానమంత్రి గురించి బయటకు వస్తుంది. ఆయన విషయం బట్టబయలు అవుతుంది. ఆయన ఎలా రాజీ పడ్డారు.

మిగతా 2లో

## పేరు మార్పుడి

నేను సుభాన్‌పురాన్ ప్రభాకర్ రెడ్డి తండ్రి పాత పేరు సత్య నారాయణ్ రెడ్డి హౌస్ నంబర్ 4-1-143, అత్తాపూర్, రాజేంద్రనగర్ (మండలం) రంగారెడ్డి (జిల్లా), తెలంగాణ రాష్ట్రం. నా తండ్రి పాత పేరు సత్య నారాయణ్ రెడ్డి శుభన్‌పురాన్ (కొత్త పేరు) సత్తి రెడ్డి గా మార్చుకున్నారు.

# లిక్కర్ కేసు రివర్స్!

**మొదటి పేజీ తరువాయి..**

ఈ కేసులో ఇంత సీరియస్‌గా ఉన్న సీబీఐ.. కింది కోర్టును ఎందుకు సంతృప్తి పరచలేకపోయింది? ఈ కేసు తీర్పు తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపబోతోంది?.. అసలు ఈ కేసుతో కల్వకుంట్ల కుటుంబం కొంత రాజకీయ ఉపశమనానికి గురవుతుందా.. తదుపరి కవిత.. కేటీఆర్ అడుగులు ఎటువైపు అనేది ఇప్పుడు చర్చ జరుగుతున్నది. గత నెల 28న ఢిల్లీ లిక్కర్ కేసులో ఢిల్లీ రౌస్ అవెన్యూ స్పెషల్ సీబీఐ కోర్టు జడ్జి జస్టిస్ జితేంద్ర సింగ్ కీలక తీర్పు ఇచ్చారు. మాజీ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మంది నిందితులపై సీబీఐ నమోదు చేసిన అన్ని ఆరోపణలను కోర్టు కొట్టిశారు. "ప్రైమా ఫేసీ కేసు లేదు, ఆరోపణలు ఊహాగానాలు మాత్రమే, డబ్బు మార్గం లేదు, సాక్ష్యాలు లేవు" అని స్పష్టం చేశారు. సీబీఐ దర్యాప్తును "ప్రీమెడిటేటెడ్ అండ్ కొరియోగ్రాఫ్డ్" (ముందుగా ప్లాన్ చేసిన, నాటకీయం) అని తీవ్రంగా విమర్శించి, దర్యాప్తు అధికారిని.. దీనిపై ప్రశ్నించాలని కూడా ఆదేశించారు. దాంతో ఆరోపణలు ఎదుర్కొంటోన్న నేతలందరూ ఆ కేసు నుంచి బయటపడ్డామని భావించారు. కానీ ఈ తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే సీబీఐ దీనిపై ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. "ట్రయల్ కోర్టు తీర్పులో దర్యాప్తు లోని అనేక అంశాల్ని లెక్కలోకి తీసుకోలేదు, సరిగ్గా పరిగణించలేదని ఆరోపించిన సీబీఐ కాబట్టి వెంటనే హైకోర్టులో అప్పీల్ చేసింది.

# పశ్చిమాసియాలో రాజీపడ్డ ప్రధాని

రాహుల్‌గాంధీ

**మొదటి పేజీ తరువాయి..**

ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారో బయటకు వస్తుంది. కాబట్టి, వారు చర్చించడానికి ఇష్టపడరు. ప్రధాని పార్లమెంటు నుండి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఆయన రాలేరని నేను మీకు చెప్తున్నాను, అని ఆయన అన్నారు. పశ్చిమాసియా పరిస్థితిపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేసిన నిరసనల మధ్య లోక్‌సభ సోమవారం వాయిదా పడింది. తిరిగి మార్చి 10వ తేదీ ఉదయం 11 గంటలకు సమావేశం అవుతుంది. సోమవారం బడ్జెట్ సమావేశాల రెండవ విడత తీవ్ర ఘర్షణతో ప్రారంభమైంది. పశ్చిమాసియా వివాదంపై నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తోందని బిజెపి ఎంపీలు ఆరోపించారు. అంతకు ముందు, ఇండి కూటమి ఎంపీలు పార్లమెంటులోని మకర ద్వారం వద్ద నిరసన తెలిపారు. పశ్చిమాసియా వివాదంపై కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్లమెంటు వెలుపల నిరసన తెలిపిన ఎంపీలలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ఎల్‌ఓపీ మల్లికార్జున్ ఖర్గే కూడా ఉన్నారు. పశ్చిమాసియాలో సంఘర్షణ పరిస్థితి గురించి విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రాజ్యసభలో ప్రకటన చేసిన తర్వాత, ప్రతిపక్షం కేంద్రాన్ని ప్రశ్నించడానికి చర్చకు డిమాండ్ చేసిన క్రమంలో ఇది జరిగింది.



## నిజామాబాద్‌లో రంజాన్ తోఫా పంపిణీ

### ఘనంగా ప్రభుత్వ అధికారిక ఇఫ్తార్ విందు

**వుదయం, నిజామాబాద్:**

నిజామాబాద్ నగరంలోని ఖిలా రోడ్‌లో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన అధికారిక ఇఫ్తార్ విందు సోమవారం సాయంత్రం అత్యంత భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరఫున అందజేస్తున్న 'రంజాన్ తోఫా' దుస్తుల కిట్లను అతిథులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్, పీసీసీ అధ్యక్షులు మరియు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మరియు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ హాజరయ్యారు. ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు మాట్లాడుతూ.. గంగా–జమునా తెహజీబ్‌కు నిజామాబాద్ ప్రతీక అని కొనియాడారు. రంజాన్ పవిత్ర మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని, ముస్లిం సోదరులందరూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. పేద మైనారిటీలకు అండగా ఉండటానికే ప్రభుత్వం ఈ తోఫా కార్యక్రమాన్ని చేపట్టిందని ఆయన తెలిపారు. మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందనిస్పష్టం చేశారు.ప్రభుత్వం మైనారిటీల కోసం విద్య, ఉపాధి రంగాల్లో అనేక పథకాలను అమలు చేస్తోంది. మైనారిటీ విద్యార్థుల కోసం ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యానిధి వంటి సదుపాయాలను మెరుగుపరిచాం. పేద ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం 'షాదీ ముబారక్' పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. వక్ఫ్ భూముల రక్షణ మరియు ఉర్దూ భాషా వికాసానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనారిటీ సంస్థలను బలోపేతం చేస్తోందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఇఫ్తార్ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దేశ శాంతి సౌభాగ్యాల కోసం ప్రార్థన చేశారు.

# గల్ఫ్ వ్యాప్తంగా ఇరాన్ దాడులు




**వుదయం డెస్క్, మార్చి 9 :** అనేక గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు కొనసాగిస్తూనే ఉంది. చమురు మౌలిక సదుపాయాలకు అంతరాయం కలిగించడమే కాదు, ప్రాంతీయ గగనతలాన్ని మూసివేసే పరిస్థితిని కల్పిస్తోంది. తాజా దాడులలో తమ శుద్ధి కర్మాగారం ధ్వంసమైన తర్వాత బహ్రెయిన్ ప్రభుత్వ యాజమాన్యంలోని ఇంధన సంస్థ బాప్కో ఫోర్స్ మేజర్ ప్రకటించింది. ఇరాన్‌పై ఫిబ్రవరి చివరి నుండి అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్య తర్వాత ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. చమురు ఉత్పత్తి, షిప్పింగ్ కార్యకలాపాలు ప్రభావితమవుతున్నాయి. అయితే గల్ఫ్ దేశాలలోకి వస్తున్న క్షిపణులు, డ్రోన్‌లను బహుళంగా అడ్డుకున్నట్లు అవి ప్రకటించాయి. పౌర ప్రాంతాలు కూడా దెబ్బతిన్నాయి, ఈ వివాదం విస్తృత మధ్యప్రాచ్యాన్ని మరింత అస్థిరపరిచే అవకాశం ఉందనే భయాలను పెంచుతోంది.

**చమురు మౌలిక సదుపాయాలే లక్ష్యం...**

గల్ఫ్ అంతటా ఇరానియన్ క్షిపణి, డ్రోన్ దాడులు తీవ్రతరం అయ్యాయి. ఇంధన సౌకర్యాలను దెబ్బతీశాయి, ప్రాంతీయ చమురు సరఫరా మార్గాలను ముప్పుగా పరిణమించాయి. ఇరాన్ దాడి తర్వాత కర్మాగారంలో మంటలు చెలరేగడంతో బహ్రెయిన్ ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు సంస్థ బాప్కో సోమవారం తన కార్యకలాపాలను నిలిపివేసినట్లు ప్రకటించింది. పెరుగుతున్న సంఘర్షణ నడుమ పరిస్థితిని సమీక్షిస్తున్నట్టు ఆ ప్రభుత్వం ఒకప్రకటనలో తెలిపింది. గల్ఫ్ దేశాలలో ఉన్న అమెరికా ఆస్తులపై ఇరాన్ ప్రతీకారం తీర్చుకునే విస్తృత యత్నాలలో ఈ దాడి భాగం. ఫిబ్రవరి 28 నుండి ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేపట్టిన దాడులకు ప్రతిస్పందనగా ఈ దాడులు చేసినట్లు తెహ్రాన్ తెలిపింది. ఈ ప్రాంతంలోని చమురు మౌలిక సదుపాయాలను హై అలర్ట్‌లో ఉంచారు. సౌదీ అరేబియాలోని కీలక ఇంధన కేంద్రాలలో ఒకటైన షైబా చమురు క్షేత్రం వైపు వెళుతున్న నాలుగు డ్రోన్‌లను అడ్డుకున్నట్లు ప్రభుత్వం చెప్పినట్టు వార్తలు వచ్చాయి. భద్రతా ముప్పుకు స్పందిస్తూ అధికారులు అనేక ప్రాంతాలలో గల్ఫ్ గగనతలాన్ని కూడా తాత్కాలికంగా మూసివేసారు. దాడులు కొనసాగితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఉత్పత్తి, షిప్పింగ్‌కు అంతరాయాలు నేపథ్యంలో ఆందోళన వ్యక్తం అవుతున్నాయి.

**గల్ఫ్ అంతటా క్షిపణులు అడ్డగింపు...**

ఈ ప్రాంతం అంతటా వైమానిక రక్షణ వ్యవస్థలు సక్రియం అయినప్పటికీ అనేక గల్ఫ్ దేశాలలో రాత్రివేళ క్షిపణి, డ్రోన్ దాడులు జరిగినట్టు పేర్కొన్నారు.కొద్దిసేపటికే, ఇరాన్ నుండి ప్రయోగించిన ప్రొజెక్టైళ్లను ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తాకడంతో బహుళ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. నివేదికల ప్రకారం, ఈ క్షిపణులను తటస్థీకరించడానికి ప్రయత్నించినప్పుడు దాదాపు 12 నుండి 13 పేలుళ్లు వినిపించాయి. బహ్రెయిన్‌లో, రాజధాని మనామాకు దక్షిణంగా ఉన్న సిత్రా ప్రాంతాన్ని ఇరానియన్ డ్రోన్ ఢీకొట్టడంతో పిల్లలతో సహా కనీసం 32 మంది గాయపడ్డారని రాష్ట్ర మీడియా నివేదించింది. మిగతా చోట్ల, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్ , కువైట్ కూడా క్షిపణి లేదా డ్రోన్ల ప్రయోగాన్ని నిర్ధారించాయి. వైమానిక రక్షణ వ్యవస్థలు రాత్రిపూట వచ్చే లక్ష్యాలకు ప్రతిస్పందిస్తున్నాయని యుఎఇ రక్షణ అధికారులు తెలిపారు. సౌదీ అరేబియాలో, అల్–ఖార్జ్ గవర్నరేట్‌లోని నివాస ప్రాంతంలో ఒక ప్రొజెక్టైల్ పడటంతో కనీసం ఇద్దరు వ్యక్తులు మరణించారు, 12 మంది గాయపడ్డారు. యుఎఇలోని ఫుజైరా చమురు పరిశ్రమ జోన్‌లో అడ్డగించిన డ్రోన్‌ల శిథిలాలు మంటలకు కారణమయ్యాయి. ఇది గల్ఫ్ అంతటా పెరుగుతున్న దాడుల వల్ల కలిగే ప్రమాదాన్ని మరింత పట్టి చూపుతుంది.

# ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం

- ఆ మేరకు క్రీడా పాలసీకి రూపకల్పన
- అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా క్రీడా మైదానాలు
- క్రీడాకారులకు మెరుగైన శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి 9 (వుదయం ప్రతినిధి) :**

ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి తెలంగాణ ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆ మేరకు క్రీడా ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణలోని క్రీడాకారులకు ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో క్రీడా శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంబంధించిన నిర్మాణాల డిజైన్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన.. అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు అనువుగా మైదానాల ఏర్పాటుపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు ప్రతిభ చూపించేలా వారికి సరైన శిక్షణ ఇవ్వాలన్నారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ డిజైన్లను పరిశీలించిన ఆయన ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేలా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు ఉన్న మైదానాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా వారిని తీర్చిదిద్దాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాల కోసం కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం.. ఎల్‌బీ స్టేడియం.. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలను ఆధునీకరించాలని పేర్కొన్నారు. ఈ క్రీడాశాఖ సమీక్షలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతికి, సామాజిక సమానత్వానికి

# బుద్ధ, గురునానక్, వివేకానందుల బోధనలే మార్గదర్శకం

### సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యామ్ ప్రసాద్

### 'ఐకాన్స్ ఫర్ ఈక్వాలిటీ' పుస్తకంపై ప్రత్యేక చర్చ



**న్యూ ఢిల్లీ, మార్చి 09 (వుదయం ప్రతినిధి):**

నేటి ఆధునిక కాలంలో భారతదేశానికే కాకుండా, ప్రపంచం మొత్తానికి శాంతి, సామాజిక సమానత్వం చేకూరాలంటే గౌతమ బుద్ధుడు, గురునానక్ దేవ్, స్వామి వివేకానందల వంటి మహనీయుల బోధనలు అత్యంత ఆవశ్యకమని సామాజిక సమరసత జాతీయ కన్వీనర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ఇటీవల ఇంగ్లీష్, పంజాబీ భాషలలో విడుదలైన 'ఐకాన్స్ ఫర్ ఈక్వాలిటీ' అనే పుస్తకంపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ ముగ్గురు మహనీయులు వేర్వేరు కాలాల్లో జన్మించినప్పటికీ, వారి లక్ష్యం మాత్రం ఒక్కటేనని చెప్పారు. ఈ ముగ్గురి బోధనలు భారతీయ సమాజంలో సామాజిక సమానత్వం తీసుకురావడంలో 'త్రివేణి సంగమం' లాంటివని ఆయన అభివర్ణించారు.అశాంతితో రగులుతున్న ప్రస్తుత ప్రపంచానికి వీరి శాంతి సందేశాలు దిక్సూచిలా పనిచేస్తాయని చర్చలో పాల్గొన్న మేధావులు అభిప్రాయపడ్డారు.

సామాజిక వివక్షను తొలగించి, ఐక్యతను చాటడంలో ఈ పుస్తకంలోని అంశాలు నేటి పరిశోధక విద్యార్థులకు, యువతకు ఎంతో స్ఫూర్తినిస్తాయని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇగ్నోటా అధ్యక్షులు ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ గుర్మీత్ కౌర్ పాల్గొని పుస్తక ప్రాముఖ్యతను వివరించారు. ఈ చర్చా వేదికలో ఇగ్నోటా జాయింట్ సెక్రటరీ డాక్టర్ కొండే లింగస్వామి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ వీరమల్లు శ్రీశైలం, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ సీమా రాణి, సోషల్ వర్క్ ఫ్యాకల్టీ డాక్టర్ బినోద్ కుమార్, డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రవణ్, 30 మందికి పైగా బోధనా సిబ్బంది, పరిశోధక విద్యార్థులు వినోద్ హిందుస్తానీ, కత్తుల ఉపేందర్ తదితరులు పాల్గొని చర్చను విజయవంతం చేశారు.

# కడుపు తరుక్కపోతుంది

**మొదటి పేజీ తరువాయి..**

ముఖ్యమంత్రి సహా జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బాధితుల ఇళ్లు కూల్చిన చోటే వారికి కొత్త ఇళ్లు కట్టించాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రం లో పేదల మీద జులుం నడుస్తోందని.. వారి ఇళ్ల మీదకు బుల్డోజర్లు పంపుతూ అన్యా యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఓ వైపు రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టు కొని ప్రజాస్వా మ్యం గురించి మాట్లాడతుంటే.. ఆ రాజ్యాం గాన్ని కూనీ చేసేలా పేదల మీదకు బుల్డోజర్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి చర్యలకు వ్యతిరేకంగా పోరాటం చేద్దామన్నారు.

**జెడ్పీ సెంటర్‌లో ఆందోళన...**

అంతకుముందు వెలుగుమట్ల బాధితులను కవిత పరామర్శించారు. ఆ తర్వాత వెలుగుమట్ల బాధితులతో కలిసి కలెక్టరేట్ కు ర్యాలీగా వెళ్తూ జెడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. కలెక్టర్ వచ్చి వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఖమ్మం ఆర్ డీవో చర్చలు జరిపినప్పటికీ స్పష్టమైన హామీ రాకపోవటంతో ఆందోళన కొనసాగించారు. దీంతో పోలీసులు ఓవరాక్షన్ కు దిగారు. జాగృతి నాయకులు, వెలుగుమట్ల బాధితులు, ధర్మ సమాజ్ పార్టీ నాయకులను దుర్భాషలాడుతూ తోసేశారు. విచక్షణరహితంగా వ్యవహరిస్తూ వారిపై బలప్రయోగం చేసిన పోలీసులు కవితతో పాటు ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ సహా జాగృతి నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో పలువురు గాయపడగా...మరికొందరు సొమ్మసిల్లిపడిపోయారు. గాయపడిన వారిని వెంటనే హాస్పిటల్ కు తరలించాలని కవిత డిమాండ్ చేశారు. అరెస్టు సమయంలో నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారు. దీంతో పోలీసుల తీరుపై జాగృతి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ కానిస్టేబుళ్లు లేకుండా మహిళలను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మహిళల పట్ల అమానుషంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని జాగృతి నాయకులు మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

# ఏకగ్రీవం

**మొదటి పేజీ తరువాయి..**

దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఎన్నికకు మార్గం సుగమమైంది. మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల విత్ డ్రా ముగియగా సాయంత్రం 4 గంటలకు అసెంబ్లీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ ఎన్నికపై అధికారిక ప్రకటన చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పోటీలో లేకపోవటం, అసెంబ్లీలో ఉన్న బలాబలాల దృష్ట్యా సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి సునాయాసంగా ఎన్నికయ్యారు. కాగా రాజస్థాన్‌కు చెందిన సింఘ్వీ తెలంగాణ నుంచి సిట్టింగ్ మెంబర్ గా కొనసాగుతున్నారు.

**అత్యంత ధనికుడు సింఘ్వీ...**

సింఘ్వీ తన కుటుంబ ఆస్తుల విలువ రూ.2,558 కోట్లుగా వెల్లడించారు. వ్యక్తిగతంగా తనకు ఒక్క రూపాయి కూడా అప్పులేదని ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వ్యక్తిగత చరాస్తుల విలువ రూ.1,536 కోట్లుగా వెల్లడించారు. తన భార్య అనిత పేరిట ఉన్న చరాస్తుల విలువ రూ.568 కోట్లు, హెచ్‌యూఎఫ్ పేరుట ఉన్న ఆస్తుల విలువ రూ.51 లక్షలుగా చూపించారు. అభిషేక్ తన చేతిలో రూ.69.99 లక్షలు నగదు ఉందని చెప్పారు. ఇక ఢిల్లీలో రెండు గృహాలు, మహారాష్ట్ర అలీబాగ్ నగావ్‌బీచ్‌లో ఎకరా స్థలం విలువ కలిపి మొత్తం రూ.60 కోట్లు అని పేర్కొన్నారు. భార్య పేరిట స్థిరాస్తుల విలువ రూ.333.50 కోట్లుగా ఉందని వెల్లడించారు. హెచ్‌యూఎఫ్ పేరిట ఢిల్లీలో రూ.60 కోట్ల విలువైన 2.5 ఎకరాల స్థలం ఉన్నట్లు తెలిపారు. 2024–25 ఏడాదికి ఆదాయపన్ను శాఖకు సమర్పించిన ఐటీ రిటర్నులో వ్యక్తిగత ఆదాయం రూ.374.05 కోట్లు అని అఫిడవిట్‌లో చూపించారు.

**వేం నరేందర్‌రెడ్డి ఆస్తి రూ. 41.5 కోట్లే...**

వేం నరేందర్‌రెడ్డి తన కుటుంబ ఆస్తుల మొత్తం విలువ రూ.41.5 కోట్లుగా వెల్లడించారు. మొత్తం అప్పులు రూ.1.62 కోట్లు ఉన్నాయని తెలిపారు. తన భార్య పేరుతో కేసముద్రంలో 7.33 ఎకరాలు, కుటుంబ ఆస్తి కింద అర్పణపల్లిలో మరో 15.17 ఎకరాల భూమి, తన పేరిట కేసముద్రంలో 1,050 గజాల వ్యవసాయేతర స్థలం ఉందన్నారు. దాంతో పాటు హైదరాబాద్, వరంగల్, కేసముద్రంలలో మూడు కమర్షియల్ బిల్డింగ్‌లు ఉన్నట్లు వివరించారు. 2024–25లో తన సంపాదన రూ.22.02 లక్షలుగా.. భార్య సంపాదన రూ.12.79 లక్షలుగా వెల్లడించారు. తన చేతిలో నగదు రూ.4.99 లక్షలు మాత్రమే ఉందన్నారు.

తెలంగాణ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన కాంగ్రెస్ అభ్యర్థులు వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీ ఎన్నికకు సంబంధించిన అధికారిక ధృవీకరణ పత్రాలు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా వారు ఈ సర్టిఫికేట్లను స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులకు కాంగ్రెస్ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

# హొర్ముజ్ సంక్షోభం

**మొదటి పేజీ తరువాయి..**

ప్రస్తుతానికి జలమార్గాన్ని మూసివేశారు, దాదాపు 20 మిలియన్ బారెల్ల చమురు అలాగే నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతల కారణంగా చమురు రవాణా ప్రభావిత మైన గత పరిస్థితులతో పోల్చినప్పుడు ఒకింత భయం కలిగకపోదు. 1973లో యోమ్ కిప్పర్ యుద్ధ సమయంలో ఈ జలసంధి ద్వారా రవాణా అయ్యే 4 నుంచి 5.5 మిలియన్ బారెల్ల చమురుకు కూడా అంతరాయం కలిగింది. ఇదిలా ఉండగా, 1978–79లో చోటు చేసుకున్న ఇరాన్ విప్లవం వల్ల 5–6 మిలియన్ బారెల్ల రవాణాకు అంతరాయం కలగగా, 1980లో ప్రారంభమైన ఇరాన్–ఇరాక్ యుద్ధం కారణంగా రోజుకు 4 మిలియన్ బారెల్ల చమురు సరఫరా నిలిచిపోయింది. ఒకవేళ జలసంధిని నేడు పూర్తిగా మూసివేస్తే, చమురు రవాణా అంతరాయం గతంలో కన్నా అత్యధికంగా ఉండవచ్చు. ఇది 1973నాటి చమురు షాక్ కన్నా అతి భారీ షాక్ కానుంది.

**అందుబాటులో ప్రత్యామ్నాయాలు...**

అయితే, చమురు సరఫరా ప్రవాహం ఇంత తీవ్రంగా ప్రభావితమవుతుందని ఎవరూ ఆందోళన చెందనవసరం లేదు. ఎందుకంటే, 20 మిలియన్ బ్యారెల్ల చమురు అకస్మాత్తుగా నిలిచిపోయే పరిస్థితి వాస్తవ స్థితికాదు. సౌదీ అరేబియా, యుఎఇ సహా పశ్చిమాసియాలోని చమురు ఉత్పత్తి చేసే దేశాలు, ప్రపంచంలోని వివిధ దేశాలకు చమురును దారి మళ్లించి సరఫరా చేయగలవు. జలసంధిని పూర్తిగా నివారించి, పైప్‌లైన్ల ద్వారా దానిని సరఫరా చేయగలవు. దేశాలలో చమురు నిల్వలు ఉన్నాయి. అవి యుద్ధం ముగిసి, సరఫరాలు యధాతథ స్థితికి వచ్చే వరకూ ఉంటాయి. కానీ, పాక్షిక అంతరాయాలు కూడా ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగేందుకు దారి తీయవచ్చు. భారతదేశానికి ప్రాథమిక సమస్య ధరల పెరుగుదలే అవుతుంది తప్ప భౌతిక కొరత కాదు.తాను వినియోగించే ముడిచమురులో 85శాతం భారత్ దిగుమతి చేసుకుంటుంది. ప్రపంచ మార్కెట్లలో చమురు ధరలు మారినప్పుడు, దేశ ఆర్థిక వ్యవస్థ యాంత్రికంగా బలహీనమవుతుంది.

# ఉగాది వేడుకలను విజయవంతం చేయాలి

**అధికారులు నిబద్ధతతో కలిసి పని చేయాలి.**

**ఈ నెల 19న రవీంద్రభారతిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు**

**దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్**



**హైదరాబాద్, మార్చి 9 (వుదయం ప్రతినిధి) :**

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ఈ నెల 19న రవీంద్రభారతిలో నిర్వహించతలపెట్టిన వేడుకలను విజయవంతం చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాంపల్లి చేనేత భవన్ సమావేశ మందిరంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల నిర్వహణ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తో కలిసి ఆమె పాల్గొన్నారు. వేడుకల నిర్వహణ పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ ఉగాది వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని శాఖల వారీగా కేటాయించిన బాధ్యతలను సంబంధిత అధికారులు సమర్థంగా నిర్వర్తించాలన్నారు. ఈ వేడుకలకు సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులు హాజరవుతోన్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ప్రాధాన్యత క్రమంలో ఏర్పాట్లను చేపట్టాలన్నారు. ఎక్కడ కూడా ఇబ్బందులు సమస్యలు ఉత్పన్నం కాకుండా నిబద్ధతతో వ్యవహరించాలన్న ఆమె ప్రతి శాఖ చేపట్టాల్సిన బాధ్యతలు, కార్యాచరణపై ఆమె సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా రవీంద్రభారతి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపు, శాంతిభద్రతలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ మొదటి చికిత్సా సదుపాయాలు, అత్యవసర వైద్య సామగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు రవీంద్రభారతి ప్రాంగణంలో పరిశుభ్రత, పారిశుధ్యాన్ని కచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా అతిథులకు పండుగ సందర్భంగా ముందుగా ఇన్విటేషన్ కార్డులు అందించాలని , ప్రోటోకాల్ తప్పక పాటించాలని అలాగే సీటింగ్ కెపాసిటీ పరిశీలన చేసుకోవాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. వేడుకల్లో భాగంగా సాయంత్రం పూట కవి సమ్మేళనం, సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన సౌండ్ ప్రూఫ్ జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

మెట్రో వాటర్ బోర్డు తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో స్టేజ్ పూల తో సుందరీకరణ , ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక యంత్రాలు, ఫైర్ టెండర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యుత్ వైరింగ్ లోపాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తూ భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. సమాచార శాఖ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ నెల 12న అన్ని శాఖలతో కలిసి రవీంద్రభారతి ప్రాంగణంలో రిక్కీ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, విద్యుత్, జిహెచ్ఎంసి, పోలీస్, జిఏడి ఉద్యానవన, దేవాదాయ, అగ్నిమాపక సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరిగొచ్చిన 67 వేల మంది

**మొదటి పేజీ తరువాయి..**

సభలో ప్రతిపక్ష సభ్యుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై పూర్తి చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ, వారు నినాదాలు కొనసాగించారు. ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరగడంతో భారతీయ విద్యార్థులు, ఇతర జాతీయులకు తోడ్పడేందుకు తెహ్రాన్‌లోని భారతీయ ఎంబసీ చర్యలు తీసుకుందని జయశంకర్ సభకు తెలిపారు. అనేకమంది భారతీయ విద్యార్థులను తెహ్రాన్ నుంచి బయటకు పంపేందుకు భారతీయ ఎంబసీ చర్యలు చేపట్టిందని ఆయన అన్నారు. వాణిజ్య ప్రయోజనాల కోసం ఇరాన్‌లో ఉన్న భారతీయులకు కూడా భారత్‌కు తిరిగి వచ్చేందుకు పొరుగున ఉన్న అర్మేనియా ప్రయాణించేందుకు సహాయం చేసిందన్నారు.

ఇరాన్‌లో భద్రతా పరిస్థితి క్షీణించడంతో భారత పౌరులకు అనేక సూచనలను ప్రభుత్వం జారీ చేసిందని ఆయన చెప్పారు. యుద్ధానికి సంబంధించిన పరిణామాలను, సంక్షోభానికి భారత స్పందనలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిత్యం సమీక్షిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రధాని మోడీ యుఎఇ, ఖతార్, సౌదీ అరేబియా, ఒమన్, జోర్డాన్, ఇజ్రాయెల్, బహ్రెయిన్ అధిపతులతో మాట్లాడరని, ఉద్రిక్తతలు సడలించమని మేం విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ దేశాల నాయకుల నుంచి అక్కడ నివసిస్తున్న భారతీయుల భద్రత గురించి సానుకూల హామీలను పొందామని ఆయన అన్నారు. ప్రతి సందర్భంలోనూ, భారతీయ సమాజ శ్రేయస్సు ఆతిథ్య దేశాల ప్రాధాన్యత అని తమకు హామీ లభించిందని, అదేవిధంగా, తాను ఈ దేశాలలోని తన సహచరులతో సంప్రదింపులలో ఉన్నాని, యునైటెడ్ స్టేట్స్ విషయానికొస్తే, మేము దౌత్య మార్గాల ద్వారా క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతున్నాము, అని విదేశాంగ మంత్రి జయశంకర్ వివరించారు.



# జాతీయం-అంతర్జాతీయం



### యుద్ధ నేపథ్యంలో ప్రపంచ చమురు షాక్‌ను నిర్వహణకు

# జి7 అత్యవసర సమావేశం



**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం) :**

సోమవారం గ్రూప్ ఆఫ్ సెవెన్ (జి7) ఆర్థిక మంత్రుల అత్యవసర సమావేశం జరగనుంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెరుగుతున్న గందరగోళం మధ్య ప్రపంచ ముడి చమురు మార్కెట్లలో ఉద్రిక్తతను తగ్గించే ప్రయత్నంలో భాగంగా, వ్యూహాత్మక చమురు నిల్వలను ఉమ్మడిగా విడుదల చేసే అవకాశాన్ని ఈ సమావేశం పరిశీలిస్తుంది. యుద్ధ ప్రభావాన్ని, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై దాని ప్రభావాన్ని అంచనా వేసేందుకు అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ (ఐఇఎ_ ఇడి ఫతీహ్ బీరొల్‌కు ఆర్థిక మంత్రులు కాల్ చేసి చర్చించనున్నారు. ఈ వార్త తర్వాత, బ్రెంట్ ముడి చమురు ధరలు బ్యారెల్ 110 డాలర్లకి తగ్గాయి, అయితే డబ్ల్యుటిఐ ముడి చమురు సోమవారం ఉదయం బ్యారెల్‌కు వరుసగా 116.71 116.45 డాలర్ల నుండి దాదాపు 107 డాలర్లకి తగ్గింది.ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేయడంతో, ప్రాంతీయ ఇంధన చమురు ప్రవాహాలలో అంతరాయాలను కలిగించిన విషయం తెలిసిందే.

**ప్రతిపాదన ఏమిటి?**

వార్తల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో అంతరాయాలకు ప్రతిస్పందించడానికి ఉద్దేశించిన ఐఇఎ అత్యవసర యంత్రాంగం కింద సభ్య దేశాలు వద్ద గల పెట్రోలియం నిల్వలను సమన్వయంతో విడుదల చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు.

యునైటెడ్ స్టేట్స్ సహా మూడు జి7 దేశాలు ఈ ప్రతిపాదిత చర్యకు మద్దతు ఇస్తున్నాయని అక్కడి వర్గాలు వెల్లించాయి. దాదాపు 300 నుంచి 400 మిలియన్ బారెళ్లను సమన్వయంతో విడుదల చేయడం సముచితమని కొందరు అమెరికన్ అధికారులు వాదిస్తున్నారు. ఇది ప్రస్తుతం ఐఇఎ సభ్య దేశాల వ్యూహాత్మక నిల్వలలో ఉన్న దాదాపు 1.2 బిలియన్ బ్యారెళ్లలో 25 30% ప్రతిబింబిస్తుంది.అరబ్ చమురు ఆంక్షలు తీవ్రమైన ఇంధన కొరతకు దారితీసి, పశ్చిమ దేశాలలో చమురు ధరలు విపరీతంగా పెరిగిన తర్వాత 1974లో ఏర్పాటు చేసిన ఉమ్మడి అత్యవసర వ్యవస్థలో ఈ నిల్వలు భాగం.

**ముడి చమురు ధరలు ఎలా పెరిగాయి**

పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రతరం అయిన తర్వాత ముడి చమురు ధరలు పెరిగాయి. ఈ ఆకస్మిక పెరుగుదల ద్రవ్యోల్బణం పెరుగుదల, ప్రపంచ ఆర్థిక వృద్ధికి ముప్పు గురించి ఆందోళనను రేకెత్తించింది. బ్రెంట్ క్రూడ్ అంతర్జాతీయ బెంచ్‌మార్క్ 24% నుండి పెరిగి ఆసియా ట్రేడింగ్‌లో బ్యారెల్‌కు 116.71 డాలర్లకి పెరిగింది, అయితే యుఎస్ బెంచ్‌మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ బ్యారెల్‌కు 28% పెరిగి 116.45 డాలర్లకి చేరుకుంది. చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక మార్కెట్లను అస్థిరంగా మార్చింది, సోమవారం ఆసియా ఈక్విటీలు పడిపోయాయి, యుఎస్ ఫ్యూచర్స్ కూడా తీవ్ర క్షీణతను సూచిస్తున్నాయి.

**ఎవరు ఎక్కువగా నష్టపోనున్నారు?**

భారతదేశం, చైనా, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, స్పెయిన్, ఇటలీ దేశాలు నిరంతర చమురు ధరల షాక్‌లకు గురవుతాయి. ఎందుకంటే ఈ దేశాలు భారీ స్థాయిలో ముడి చమురు దిగుమతి చేసుకునే ఆర్థిక వ్యవస్థలు. పెరుగుతున్న చమురు ధరల కారణంగా, ఇన్‌పుట్ ఖర్చులు పెరుగుతాయి. ఇది వాణిజ్య సమతుల్యతను మరింత తీవ్రంగా ప్రభావితం చేసి, ఈ ఆర్థిక వ్యవస్థలలో మరింత ద్రవ్యోల్బణ ఒత్తిడిని కలిగిస్తుంది.

**ఐఇఎ నిల్వలు ఎలా తోడ్పడతాయి**

ముందస్తు అత్యవసర సమావేశం కోసం తయారు చేసిన రహస్య పత్రం ప్రకారం, ఐఇఎ సభ్య దేశాలు సంయుక్తంగా 1.24 బిలియన్ బారెళ్ల పబ్లిక్ ఎమర్జెన్సీ నిల్వలను కలిగి ఉన్నాయి. దీనితో పాటు, పరిశ్రమ ఆధీనంలో ఉన్న నిల్వలు దాదాపు 600 మిలియన్ బారెళ్లని అంచనా, సరఫరా అంతరాయాలు మరింత తీవ్రమైతే వీటిని ఉపయోగించుకోవచ్చు. ఈ మొత్తం నిల్వలు కలిసి ఐఇఎ దేశాలలో దాదాపు ఒక నెల పూర్తి చమురు డిమాండ్‌ను, 140 రోజులకు పైగా నికర దిగుమతులను కవర్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని పత్రం పేర్కొంది. అమెరికా, జపాన్ కలిసి దాదాపు 700 మిలియన్ బారెళ్ల ప్రభుత్వ నిల్వలను కలిగి ఉన్నాయి. ఏర్పడినప్పటి నుంచి ఐఇఎ ఐదుసార్లు అత్యవసర చమురు స్టాక్‌లను ఉమ్మడిగా విడుదల చేసింది. తాజాగా, 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసినప్పుడు ఈ విడుదల జరిగింది.

### పశ్చిమాసియా సంక్షోభం

# ప్రపంచ ద్రవ్యోల్బణాన్ని పెంచవచ్చు

## ఐఎంఎఫ్ అధిపతి హెచ్చరిక



**వుదయం డెస్క్, మార్చి 9 :**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా చమురు ధరలు సుదీర్ఘకాలం పాటు ఎక్కువగా కొనసాగితే, అంతర్జాతీయ ద్రవ్యోల్బణం పెరిగే ముప్పు ఉందని అంతర్జాతీయ విత్తనిధి (ఐఎంఎఫ్) అధిపతి క్రిస్టలీనా జార్జీవా సోమవారం హెచ్చరించారు.

జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక సింపోసియంలో మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక బలాన్ని ఇప్పటికే పరీక్షిస్తున్నాయని అన్నారు. మధ్య ప్రాచ్యంలో నూతన సంఘర్షణ ఈ బలాన్ని మళ్లీ పరీక్షిస్తోందని జార్జీవా అన్నారని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది.ఈ ఘర్షణ చమురు మార్కెట్లకు నిరంతర అంతరాయాలకు దారి తీస్తే, ఇందన ధరలు ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని ఆమె హెచ్చరించారు. ఏడాదిలో ఎక్కువ కాలంపాటు చమురు ధరలు 10శాతం పెరిగితే, అది ప్రపంచ ద్రవ్యోల్బణాన్ని సుమారు 40 బేసిస్ పాయింట్లకు పెంచుతుందని ఆమె హెచ్చరించారు.

ఈ నూతన అంతర్జాతీయ వాతావరణంలో అనూహ్యమైనదాని గురించి ఆలోచించి, దానికి సిద్ధంగా ఉండాలన్నది తన సూచన అని ఆమె అన్నారు. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ ఇంధన మార్కెట్లు అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో ఆమె హెచ్చరిక వచ్చింది. ఇది కీలకమైన చమురు సరఫరా మార్గాలకు అంతరాయం కలిగించడం గురించి ఆందోళనలను లేవనెత్తుతోంది.

**దీర్ఘకాలిక సంక్షోభం ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయవచ్చు: ఆర్థిక మంత్రిత్వ శాఖ**

భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ నివేదిక కూడా పశ్చిమాసియాలో దీర్ఘకాలిక సంక్షోభం విస్తృత ఆర్థిక ప్రభావాలను కలిగిస్తుందని హెచ్చరించింది, వీటిలో అధిక పెట్రోలియం ధరల కారణంగా విదేశీ మారకం రేటు, పెరుగుతున్న ద్రవ్యోల్బణంపై ఒత్తిడి కూడా ఉంటుందనిపేర్కొన్నట్టు వార్తా సంస్థ పిటిఐ నివేదించింది. మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఫిబ్రవరి నెల నెలాఖరు ఆర్థిక సమీక్ష ప్రకారం, ఈ వివాదం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలలో 20 శాతాన్ని నిర్వహించే అత్యంత కీలకమైన చమురు నాడి అయిన హొర్ముజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయం కలిగించింది.

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులు ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీని హత్య చేయడంతో, అది ప్రతీకార దాడులకు దారితీసిందని, ఇది ప్రపంచ ఇంధనం, భౌగోళిక రాజకీయాలకు దీర్ఘకాలిక పరిణామాల గణనీయమైన పెరుగుదలను సూచిస్తుందని నివేదిక పేర్కొంది.

బ్రెంట్ ముడి చమురు ధరలు ఇప్పటికే బ్యారెల్‌కు దాదాపు 9 శాతం పెరిగి దాదాపు 80డాలర్లకు చేరుకున్నాయని, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ ఎన్‌జి) ధరలు దాదాపు 50 శాతం పెరిగాయని పేర్కొంది. అయితే, సంక్షోభం కొనసాగితే, అది మారకపు రేటు, కరెంట్ ఖాతా లోటుపై గణనీయమైన ప్రభావాలను చూపుతుందని, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను రేకెత్తిస్తుంది అని నివేదిక పేర్కొంది.

ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడులు భద్రమైన మార్కెట్లకు ఎగిరిపోవడంతో పాటు మూలధన ప్రవాహాలు కరెన్సీలపై ఒత్తిడిని కలిగిస్తాయని మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. అదే సమయంలో భారతదేశ స్థూల ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని, తగినంత విదేశీ మారక నిల్వలు, సాపేక్షంగా తక్కువ కరెంటు ఖాతా లోటు, స్థిరమైన ఆర్థిక వృద్ధిని సూచిస్తున్నాయని పేర్కొంది. ఈ నివేదిక భారతదేశ వాస్తవ జిడిపి వృద్ధిని 2026 కి 7.6 శాతంగా అంచనా వేసింది మరియు ఆర్థిక సంవత్సరం 27 కి వృద్ధి అంచనాలను 7 నుంచి 7.4 శాతం మధ్యకు పెంచింది.

**పాకిస్తాన్‌లో ఆందోళనలను రేకెత్తిస్తున్న ఇంధన ధరల షాక్**

కాగా, పెరుగుతున్న ప్రపంచ చమురు ధరలు ఇప్పటికే ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేయడం ప్రారంభించాయి. పాకిస్తాన్ ఇంధన ధరలను భారీగా పెంచుతున్నట్లు ప్రకటించింది, పెట్రోల్, హైస్పీడ్ డీజిల్ రేట్లను లీటరుకు 55 పాకిస్తానీ రూపాయలు పెంచింది, ఇది దాదాపు 20 శాతం పెరుగుదల. మార్చి 7 నాటికి, పెట్రోల్ ధరలు లీటరుకు రూ. 321.17కి పెరిగాయి, అయితే హైస్పీడ్ డీజిల్ ఇప్పుడు లీటరుకు రూ. 335.86కి పెరిగింది. చమురు సరఫరా మార్గాలకు అంతరాయం కలిగి, ఇంధన మార్కెట్లపై తీవ్ర వత్తిడి పెట్టిన పశ్చిమాసియాలో పెరుగుతున్న సంఘర్షణల నడుమ ఈ ధరల సవరణ వచ్చింది. పెట్రోల్ ధర ఇంత తీవ్రంగా పెరగడంతో ఇప్పటికే ధరల పెరుగుదలతో పోరాడుతున్న పౌరులలో ఆందోళన రేకెత్తించింది. చమురు ధరల పెరుగుదల మరొకసారి ద్రవ్యోల్బణ తరంగాన్ని సృష్టించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే, అధి రవాణా, లాజిస్టిక్స్ ధరలు ఆహార, నిత్యావసర ధరలను తీవ్రంగా పెంచవచ్చు. జాతీయ ఇంధన ఆర్థిక పరిస్థితులను స్థిరీకరించడానికి, ఐఎంఎఫ్ సంప్రదింపులకు సంబంధించిన అవసరాలను తీర్చడానికి ప్రయత్నిస్తున్నందున, అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరల ప్రభావాన్ని వినియోగదారులకు బదిలీ చేయడం తప్ప వేరే మార్గం లేదని పాక్ ప్రభుత్వం తెలిపింది.

# సభ అంతరాయాలపై కేంద్ర మంత్రి మండి పాటు



**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం) :**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన నేపథ్యంలో సభా కార్యకలాపాలకు అంతరాయాలను కలిగించడంపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ సోమవారం విరుచుకుపడ్డారు. వారికి పార్లమెంటరీ నిబంధనల గురించి అవగాహన ఉందా అని ప్రశ్నించారు.విలేకరులతో మాట్లాడుతూ, సోమవారం అజెండాలో అవిశ్వాస తీర్మానంపై చర్చ జాబితాలో చేర్చారని, తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్షం సరైన ప్రక్రియను అనుసరించాలని ఆయన అన్నారు.

నేడు మనం చర్చించబోయే అంశాల జాబితాలో దీని గురించి స్పష్టంగా ప్రస్తావించారు. వారు తీర్మానాన్ని ప్రతిపాదించాలి. విధానం ఏమిటి? తీర్మానాన్ని ప్రతిపాదించినప్పుడు, 50 మంది దానికి మద్దతుగా నిలబడాలి...మీరు తీర్మానాన్ని ప్రతిపాదించాలనుకుంటే, నేను చర్చకు అనుమతిస్తాను అని పదే పదే నేడు స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్, చెప్పారని ప్రహ్లాద్ జోషి అన్నారు. స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం అజెండాలో ఉన్నప్పుడు, మధ్యలో మరో తీర్మానాన్ని, మరో వాయిదా తీర్మానాన్ని ఎలా తీసుకువస్తారు? ఏదైనా నియమం ఉందా లేదా? రాజ్యాంగం లేదా? రాహుల్ గాంధీ చెప్పినట్లుగా మనం సభను నడపవలసి వస్తే, ఇక నియమాలు ఎందుకు? ఈ వ్యక్తులు ముందుగా డిమాండ్ చేసి, తరువాత అంతరాయం కలిగించడం ఎలాంటి సిద్ధాంతం? నేను పార్లమెంట్ వ్యవహారాల మంత్రిగా ఉన్నప్పుడు ఇది చాలాసార్లు జరిగేది... వారు చెప్పేదే నియమమని వారు నమ్ముతారు. చర్చించాల్సినది ముందుగా బిఎసిలో నిర్ణయం కావాలి, అని ఆయన అన్నారు.

### సిఇసి గ్యానేష్‌కుమార్‌కు

# వ్యతిరేకంగా నిరసనలు




**కోల్‌కత, మార్చి 9 (వుదయం) :**

దక్షిణ కోలకతలోని కాళీఘాట్ ఆలయ సందర్శన సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ సోమవారం నిరసనలను ఎదుర్కొన్నారు. సిఇసి కుమార్ ఆలయానికి విచ్చేయడంతోనే నిరసనకారులు నల్ల జెండాలు ఊపుతూ, గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అక్కడ ఉన్న పోలీసు సిబ్బంది జోక్యం చేసుకుని, పరిస్థితిని నియంత్రణలోకి తీసుకువచ్చి, ఆయన సందర్శన కొనసాగేందుకు మార్గం సుగమం చేశారు.

**విమానాశ్రయంలో కూడా అటువంటి ప్రదర్శనలే**

ఆదివారం రాత్రి గ్యానేష్ కుమార్ నగరానికి విచ్చేయగానే ఇటువంటి నిరసనలే చోటు చేసుకున్నాయి. ఆయన కాన్వాయ్ విమానాశ్రయం నుంచి బయటకు రాగానే తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అలాగే, విఐపి రోడ్డులో గల కాయిఖాలి ప్రాంతం నుంచి ఆయన కాన్వాయ్ వెడుతుండగా కార్యకర్తలు నల్లజెండాలు ఊపారు. వామపక్షాలకు చెందిన కార్యకర్తలు కూడా విమానాశ్రయం బయట ప్రదర్శన చేసి, ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పెంచారు. పరిస్థితిని తక్షణమే అదుపులోకి తెచ్చి, మరింత తీవ్రం కాకుండా అడ్డుకున్నట్టు పోలీసులు తెలిపారు.

**బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సిఇసి కోల్‌కత పర్యటన**

రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుమార్ మూడు రోజుల పర్యటన కోసం తగిన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లైన ఎస్‌ఎస్ సంధు, వివేక్ జోషిలతో కలిసి ఎన్నికల సంసిద్ధతను సమీక్షించేందుకు వచ్చారు.అనంతరం, గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలతో సమావేశమై, ఎన్నికల నిర్వహణకు సంబంధించి వారి ఆందోళనలు, సూచనలను భారత ఎన్నికల కమిషన్ పూర్తి స్థాయి బెంచి విననుంది. ఈ బృందం ఎన్‌ఫోర్స్ మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులతో కూడా సంభాషణలు నిర్వహించనుంది. సీనియర్ పోలీసు, పరిపాలనా అధికారులతో వివరణాత్మక సమీక్ష సమావేశాన్ని నిర్వహించనుంది.

**చివరి రోజు సమావేశాల షెడ్యూల్**

సందర్శన చివరి రోజు మంగళవారం, ఇసి ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్, సిపిఎఫ్ నోడల్ అధికారిని కలవనుంది. కుమార్ , కమిషన్ బృందం బూత్‌స్థాయి అధికారులతో కూడా సంభాషించి, విలేకరుల సమావేశం నిర్వహించి పర్యటనను ముగించనున్నారు.

# భారతీయులను తీసుకురావడానికి ప్రయత్నాలు

**న్యూఢిల్లీ, మార్చి 9 (వుదయం) :**



యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో చిక్కుకుపోయిన భారతీయులను వెనక్కి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రయత్నిస్తోందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జయశంకర్ పార్లమెంటుకు వెల్లడించారు. ఇరాన్ యుద్ధ నేపథ్యంలో ఆయన పార్లమెంటుకు పరిస్థితిని వివరిస్తూ, ఉద్రిక్తతలను తగ్గించడం, సంయమనం, పౌరుల భద్రతను సమర్థిస్తూ.భారత్ శాంతికి కట్టుబడి ఉందని, చర్చలు, దౌత్యానికి మద్దతు ఇస్తోందని వివరించారు. పశ్చిమాసియాలో వివాదం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నిరంతరం పరిస్థితిని అంచనా వేస్తోందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారని జైశంకర్ అన్నారు. ప్రధానమంత్రి ఉద్భవిస్తున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నారని, సంబంధిత మంత్రిత్వ శాఖలు సమర్థవంతమైన ప్రతిస్పందనలను నిర్ధారించడానికి సమన్వయం చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు.కొనసాగుతున్న వివాదం భారతదేశానికి ప్రత్యేక ఆందోళన కలిగిస్తోంది.గల్ఫ్‌లో కొనసాగుతున్న వివాదం భారతదేశానికి ప్రత్యేక ఆందోళన కలిగిస్తుందని జైశంకర్ పార్లమెంటుకు తెలిపారు.

పొరుగు ప్రాంతం, పశ్చిమాసియా స్థిరంగా ఉండేలా చూసుకోవడంలో మాకు స్పష్టమైన బాధ్యత ఉంది. గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న, పనిచేసే భారతీయులు దాదాపు కోటి మంది ఉన్నారు. ఇరాన్‌లో కూడా, చదువు లేదా ఉపాధి కోసం కొన్ని వేల మంది భారతీయులు ఉన్నారని ఆయన అన్నారు.

ఈ ప్రాంతం మన ఇంధన భద్రతకు కీలకమైనది. చమురు, గ్యాస్ ముఖ్య సరఫరాదారులను కలిగి ఉంది. తీవ్రమైన సరఫరా గొలుసు అంతరాయాలు, అస్థిర వాతావరణం ప్రధాన ఆందోళనగా పరిణమించాయని ఆయన అన్నారు. ఈ సమయంలో నాయకత్వ స్థాయిలో ఇరాన్‌తో సంబంధాలు కష్టంగా ఉన్నాయని, అయితే తాను ఇరాన్ విదేశాంగ మంత్రితో మాట్లాడానని జైశంకర్ అన్నారు. ఐఆర్ఐఎస్ లవణ్ విషయంలో భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఇరా న్ యుద్ధనౌక ఐఆర్ ఎస్ లవణ్‌ను కొచ్చి ఓడరేవులో నిలపడానికి అనుమతించిన మానవతావాద చర్యకు ఇరాన్ విదేశాంగ మంత్రి భారతదేశానికి కృతజ్ఞతలు తెలిపారు అని ఆయన అన్నారు.సంఘర్షణ మరింత తీవ్రమైంది, ఈ ప్రాంతంలో భద్రతా పరిస్థితి గణనీయంగా క్షీణించింది. ఈ వివాదం ఇతర దేశాలకు వ్యాపించి విధ్వంసం పెరుగుతోంది. ఈ ప్రాంతంలో సాధారణ జీవితం, కార్యకలాపాలు స్పష్టంగా ప్రభావితమవుతున్నాయి అని ఆయన అన్నారు.ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులను ప్రారంభించడంతో పశ్చిమాసియాలో పరిస్థితి తీవ్రమైందని అన్నారు. ఇరాన్ అధ్యక్షుడు ఒక టెలివిజన్ ప్రసంగంలో, దాడులకు సంబంధించి పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పినప్పటికీ, ఈ దాడులు జరిగాయి.

# భారత్‌లో 53కు పెరిగిన చిరుతలు

### భారత్‌లో పుట్టిన కూనల సంఖ్య 33కు చేరిక



**న్యూఢిల్లీ, మార్చి 9 (పిఐబి) :**

నమీబియా నుంచి రప్పించిన చీతా, 'జ్వాల' మధ్యప్రదేశ్‌లోని కూనో అభయారణ్యంలో అయిదు కూనలకు జన్మనిచ్చిందనీ, ఇది 'జ్వాల' విజయవంతంగా మూడోసారి తల్లి అయిన సందర్భమనీ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ సోమవారం ప్రకటించారు. సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ లో మంత్రి ఒక సందేశాన్ని పోస్ట్ చేస్తూ, ప్రస్తుతం భారత్‌లో పుట్టి పెరుగుతున్న చిరుతల కూనల సంఖ్య 33కు పెరిగినట్లు పేర్కొన్నారు. భారత్ గడ్డ మీద ఇప్పటి వరకు 10 చిరుత కూనలు పుట్టాయనీ, ఇది భారత్ చిరుతల సంరక్షణ ప్రస్థానంలో కీలక పురోగతిని సూచిస్తోందనీ ఆయన తెలిపారు.

'ప్రాజెక్ట్ చీతా'లో ఇది ఓ గర్వకారణ ఘట్టమని శ్రీ యాదవ్ వర్ణించారు. పశు వైద్యులు, క్షేత్ర ఉద్యోగులతో పాటు అవిశ్రాంతంగా పనిచేస్తున్న ఇతర సిబ్బంది ఎంతో అంకిత భావంతో చేస్తున్న కృషికీ, వారి నేర్పరితనానికీ, నిబద్ధతకీ ఇది అద్దం పడుతోందని ఆయన అన్నారు. ఈ కూనల రాకతో, భారత్‌లో మొత్తం చిరుతల సంతతి 53కు చేరుకొందని మంత్రి వివరించారు.

వన్యప్రాణి సంరక్షణలో ఇది చరిత్రాత్మక క్షణమే కాక ఆనందదాయక క్షణం కూడా అని మంత్రి వర్ణించారు. తల్లి చిరుతతో పాటు కూనలు కూడా ఆరోగ్యంగా ఉన్నాయనీ, సంతతిని వృద్ధి చేసుకుంటాయనీ, భారత్ చిరుత గాథలో మరిన్ని విజయాలకు బాట వేయగలవన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

దక్షిణాఫ్రికా చిరుత 'గామిని' ఇటీవల రెండోసారి కాన్పులో నాలుగు కూనలకు జన్మనిచ్చింది. 2026 ఫిబ్రవరి 28న, బోట్స్‌వానా నుంచి అందుకున్న తొమ్మిది చిరుతలను కూనో నేషనల్ పార్కులో కంచెలున్న ఆవరణాల్లోకి విడిచిపెట్టారు. వాటిలో ఆడ చిరుతలు 6, మగ చిరుతలు 3 ఉన్నాయి. అవి మారిన పరిస్థితులకు మెల్ల మెల్లగా అలవాటు పడుతున్నాయి. వాటి స్వస్థతను పర్యవేక్షించే దశ సమాప్తమైన తరువాత క్రమంగా ప్రాకృతిక వాతావరణంలోకి వదలిపెడతారు

# ఖర్గ్ ద్వీపాన్ని ఎందుకు టచ్ చేయడం లేదు?

**(వుదయం డెస్క్) :**



తీవ్రత తగ్గే సూచనలు లేకుండా మధ్య ప్రాచ్యంలో యుద్ధం కొనసాగుతోంది. ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులు చేసింది. దాని అణు స్థావరాలు, చమురు కేంద్రాలు, ఇతర వ్యూహాత్మక ఆస్తులను లక్ష్యంగా చేసుకుంది. కానీ, ఆసక్తికరంగా, ఉత్తర గల్ఫ్‌లోని ఒక చిన్న ద్వీపంపై ఇప్పటి వరకు అమెరికన్ దళాలు దాడి చేయలేదు. వివాదం పెరిగే కొద్దీ ఖర్గ్ ద్వీపం అత్యంత సున్నితమైన, దుర్బలమైన లక్ష్యాలలో ఒకటిగా పరిగణిస్తున్నారు.

**ఖర్గ్ ద్వీపం ఏమిటి?**

ఇరాన్ తీరానికి 25 కి.మీ దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ ప్రధాన ముడి చమురు ఎగుమతి టెర్మినల్. ఇది 1960ల నుండి అత్యధిక స్థాయిలో చమురు రవాణాను నిర్వహిస్తోంది. ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక ప్రకారం, ఇరాన్ వైమానిక దాడులకు గురైనప్పటికీ, ద్వీపం సౌకర్యాలు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది..విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఖర్గ్ దెబ్బతింటే, ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది, కానీ అదే సమయంలో ఘర్షణ భారీగా పెరగడానికి దారితీసి ప్రపంచ చమురు మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.

ఖర్గ్ ద్వీపం కొన్ని కిలోమీటర్ల పొడవు మాత్రమే ఉంది. ఈ చమురు ఎగుమతి కేంద్రాన్ని యుఎస్ చమురు కంపెనీ అమోకో సహాయంతో అభివృద్ధి చేశారు. ఇది 1960ల నుండి ఇరాన్ ప్రధాన ఎగుమతి కేంద్రంగా పనిచేస్తోంది. ప్రస్తుతం, ఖర్గ్ రోజుకు 7 మిలియన్ బ్యారెళ్ల చమురును లోడ్ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది, అందువల్ల, ఇది ఇరాన్ ముడి ఎగుమతులకు వెన్నెముకగా నిలిచింది. సబ్‌సీ పైప్‌లైన్‌లు ద్వీపాన్ని దక్షిణ ఇరాన్‌లోని చమురు క్షేత్రాలకు అనుసంధానిస్తాయి. సూపర్ ట్యాంకర్లు ముడి చమురును లోడ్ చేయడానికి వీలుగా పొడవైన జెట్టీలు లోతైన నీటిలోకి విస్తరించి ఉన్నాయి, అయితే పెద్ద నిల్వ ట్యాంకులు, కార్మికుల గృహాలు ద్వీపం దక్షిణ ప్రాంతంలో ఎక్కువ భాగాన్ని కవర్ చేస్తాయి. ఇరాన్ తీరప్రాంతంలో ఎక్కువ భాగం ప్రపంచంలోని అతిపెద్ద చమురు ట్యాంకర్లకు సౌకర్యవంతమైన లోతును కలిగి ఉండదు. అందువల్ల, ఖర్గ్ ద్వీపం ఒక కీలకమైన ఎగుమతి కేంద్రంగా మారింది. విదేశాలలో విక్రయించే ప్రతి 10 బ్యారెళ్ల ఇరానియన్ చమురులో తొమ్మిది బ్యారెళ్లు ఈ ద్వీపంలోనే లోడ్ అవుతున్నాయి. ఇరాన్ వైమానిక దాడులను ఎదుర్కొన్నప్పటికీ టెర్మినల్ పనిచేస్తుందని ఉపగ్రహ చిత్రాలు సూచిస్తున్నాయి.

**ఆ ద్వీపంపై ఎందుకు దాడి జరగలేదు?**

ఇరాన్ సైనిక సౌకర్యాలు, ఇంధన గిడ్డంగులపై అమెరికా దాడి చేసినప్పటికీ, ఖార్గ్ ద్వీపాన్ని ఇంకా తాకలేదు. అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై వైమానిక దాడులు ప్రారంభించిన రెండు రోజుల తర్వాత ఇరాన్ తన ఖర్గ్ ద్వీపం ఎగుమతి టెర్మినల్‌లో ముడి చమురును లోడ్ చేస్తోందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక ఉపగ్రహ చిత్రాలను చూపుతూ తెలిపింది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఖర్గ్ ద్వీపంపై దాడి చేయడం యుద్ధం దిశను మార్చవచ్చని, గల్ఫ్ దేశాల చమురు మౌలిక సదుపాయాలపై ఇరాన్ ప్రతీకార దాడులకు పాల్పడవచ్చని అమెరికా, ఇజ్రాయెల్‌లకు తెలుసు.

ఖర్గ్ దీవిని తాకకుండా వదిలేయడం వెనుక ఉన్న మరో అంశం ఏమిటంటే, అటువంటి దాడి ప్రపంచ చమురు మార్కెట్లపై కలిగించే పరిణామాలు. యుద్ధ తీవ్రత చమురు ధరలు విపరీతంగా పెరగడానికి, ప్రపంచ ఇంధన సరఫరా గొలుసులలో అంతరాయాలకు దారి తీయవచ్చు. అందువల్ల, ఖర్గ్ ద్వీపం అమెరికాకు ఒక రెడ్ లైన్ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.





" భారతదేశం శాంతివైపు దృఢంగా నిలబడి ఉంది. యుద్ధాన్ని వీడి చర్చలు, దౌత్యం దిశగా మళ్లాలని కోరుకుంటున్నది. ఉద్రిక్తతల సడలింపు, నిగ్రహం పాటింపు, పౌరుల రక్షణకు హామీ ఇవ్వడం అనేవి ఇండియా ఇష్టపడే అంశాలు. ప్రధాని మోడీ యుద్ధ పరిస్థితిని, పరిణామాలను శ్రద్ధగా పరిశీలిస్తున్నారు. పశ్చిమాసియా సుస్థిరంగా ఉండాలని కోరుకుంటున్నాం. గల్ఫ్ దేశాలలో గల లక్షలాది మంది భారతీయుల గురించి ఆందోళన చెందుతున్నాం. యుద్ధం ఇరాన్ నాయకులు సహా అనేకమంది ప్రాణాలను బలితీసుకున్నది. ఈ ప్రాంతంలోని అన్ని దేశాల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాలను గౌరవించడం అవసరం. ప్రాంతీయ భద్రత, ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలకు కలిగే హాని గురించి, భారత సంతతి, భద్రత గురించి ఈనెల 1న సమావేశమైన భద్రత వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. గల్ఫ్ ప్రాంతం భారతదేశానికి అతి ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి ఆ ప్రాంతంతో ఇండియా యేటా 200 బిలియన్ అమెరికన్ డాలర్ల కిమ్మత్తు వ్యాపారం చేస్తుంది. ( – పార్లమెంట్‌లో విదేశాంగ మంత్రి జయశంకర్) "

## వే'మన'పద్యం

**పూజకన్న నెంచ బుద్ధి ప్రధానంబు**
**మాటకన్న నెంచ మనసు దృఢము**
**కులముకన్న మిగుల గుణము ప్రధానంబు**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# ముర్ము ప్రోటోకాల్ వివాదం

ఎన్నిల వేళ ఈనిపుల్ల కూడా మహాస్త్రం రూపెత్తుతుంది. గులక రాయి సైతం శత్రువుపై సంధించ దగిన మహాయుధంగా మారిపోతుంది. త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న బెంగాల్ లో ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ కార్యక్రమం ఎంత అభాసపాలవుతున్నదో చూస్తూనే ఉన్నాము. బెంగాల్ లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సంతాల్ సదస్సు కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెళ్లారు. ఆ సందర్భంలో ప్రోటోకాల్ విధివిధానాల ప్రకారం ఆమె కు ఇవ్వాల్సిన గౌరవాన్ని ఇవ్వకుండా ముఖ్యమంత్రి మమత బెనర్జీ నిర్లక్ష్యం వహించారనే విమర్శ వినవస్తున్నది. ప్రధాని నరేంద్రమోడీ సహా అనేక మంది బిజెపి పెద్దలు, చిన్నలు మమత మీద విరుచుకుపడుతున్నారు. కారాలు మిరియాలు నూరుతున్నారు. కొందరైతే ఆమె రాజీనామా ను డిమాండ్ చేశారు. మమత ప్రభుత్వం తీరును రాష్ట్రపతి ముర్ము స్వయంగా నిరశించారు.మొన్న శనివారం నాడు డార్జి lలింగులో తనకు స్వాగతం చెప్పడానికి గవర్నర్ గాని ముఖ్యమంత్రి గాని మంత్రి గాని రాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.మమత బెనిర్జీని సోదరి అంటూనే ముర్ము తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.ఇందులో తన తప్పు ఏమీ లేదన్న బెనర్జీ అది ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహించిన కార్యక్రమం అని అన్నారు. బిజెపి మాటలు విని రాజకీయం చేయొద్దని రాష్ట్రపతికి మమత హితవు చెప్పే వరకు వ్యవహారం వెళ్ళింది. ఈ విషయంలో నరేంద్ర మోడీ స్వయంగా అగ్గి మీద గుగ్గిలమైపోవడం లో ప్రధానిగా తనపై గల విధ్యుక్త ధర్మం వల్ల కొంత, ఎన్నికల అవసరం వల్ల మరికొంత కావచ్చు.అయితే గతంలోకి వెళ్ళి చూస్తే ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విషయంలో ఎన్ డి ఎ ప్రభుత్వం కూడా నియమబద్ధంగా వ్యవహరించ లేదనే విమర్శ ముందుకు వస్తుంది.పార్లమెంట్ నూతన భవనాల ప్రారంభోత్సవం సమయంలో ప్రధాని మోడీ ప్రభుత్వం రాష్ట్రపతి ముర్మును అవమానించలేదా అనే ప్రశ్నను పూర్తి నిరాధారమైనదని కొట్టిపారేయలేము.ఆమె ఆదివాసీ కావడం వల్లనే ఆమె చేత పార్లమెంట్ నూతన భవనాల ప్రారంభోత్సవాన్ని జరిపించలేదని ప్రతిపక్షాలు విమర్శించాయి.రాజ్యాంగం 79వ ఆర్టికల్ ప్రకారం పార్లమెంటుకు అధిప తి రాష్ట్రపతి అని అవి గుర్తుచేశాయి. దేశ జనాభాలో అత్యధికులుగా గల శ్రామిక, సేవక వృత్తుల మహాజ నం, ఎస్ టి,ఎస్ సి, బి సి లు, మైనారి టీలు నిరక్ష రాస్యులుగా, ప్రజాస్వామ్య చైతన్యం బొత్తిగా కొరవడి కొనసాగుతున్న నేపథ్యంలో దేశాధికా రం వారికి అందడంలేదు. ఈ విషయాన్ని కప్పి పుచ్చడాని కే వారి ప్రతినిధులకు రాష్ట్రపతులుగా ఉపారాష్ట్రపతులు గాను తదితర నామమాత్రపు పదవుల్లో నియ మించే కం టి తుడుపు కార్యక్రమం సాగుతున్నది.ఈ నేప థ్యంలోనే బిజెపి అయినా, కాంగ్రెస్ అయినా, తృణమూల్ కాంగ్రెస్ అయినా వారిని ఉత్సవ విగ్రహాలుగా చూసి అవమానిస్తున్నాయి .

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1–7–25/5, Risalagadda, RTC X Roads, Hyderabad – 500020

# అమెరికా ఎత్తుగడలను చిత్తుచేస్తున్న ఇరాన్

ఓ దేశాధినేతను ఏదో విధంగా తమ చేతుల్లోకి తెచ్చుకుంటే లేదా బంధిస్తే లేదా పదవి నుండి తొలగిస్తే లేదా చంపివేస్తే ఇక ఆ దేశంలోని నాయకత్వం, ప్రభుత్వం తమ ఆధీనంలోకి వచ్చినట్లే అనే అభిప్రాయంలో అమెరికా ఇప్పటివరకు ప్రపంచాధిపత్యం వహిస్తూ వచ్చింది. అయితే, బహుశా మొదటిసారిగా ఇరాన్ లో ఆ దేశం ఎత్తుగడలు చిత్తవుతున్నాయి. మొదటిరోజునే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలి ఖమేనీతో పాటు కీలకమైన 40 మందికి పైగా నాయకులను, సైన్యాధికారులు చంపివేసినా ఈ దేశం ఏమాత్రం జంకిన్నట్లు కనిపించడం లేదు. డొనాల్డ్ ట్రంప్ ఆశించినట్లు అమెరికా ముందు దాసోహం అనడం లేదు. ఇజ్రాయిల్, అమెరికా కలిసి ముప్పేట దాడులు జరుపుతున్నా, అత్యాధునిక ఆయుధాలను ప్రయోగిస్తున్న తాము తయారుచేసుకున్న చిన్నపాటి ఆయుధాలతో తీవ్ర ప్రతిఘటన ఇస్తున్నాయి. పది రోజుల తర్వాత భూతాల దాడుల గురించి ట్రంప్ సమాలోచనలు జరుపుతున్నట్లు వార్తలు వస్తుండటం గమనిస్తే క్షిపణి దాడులను ఇరాన్ ను దారిలోకి తెచ్చుకోలేమని గ్రహించినట్లు స్పష్టం అవుతుంది. నాలుగైదు రోజుల పాటు యుద్ధం చేస్తే ఇరాన్ లొంగిపోతుందని ట్రంప్ అనుకున్నారు. కానీ ఆ దేశం రెండేళ్లవరకు యుద్ధం సాగించగల సామర్థ్యం తమకు ఉన్నట్లు సంకేతాలు ఇస్తున్నది. అయితే, అటు అమెరికాకు గాని, ఇటు ఇజ్రాయిల్ కు గాని అంత సుదీర్ఘకాలం యుద్ధం చేసే శక్తిసామర్థ్యాలు లేవని వారి మాటలు వెల్లడి చేస్తున్నాయి. 30 వేల అడుగుల ఎత్తులో ఆకాశం నుండి క్షిపణులు ప్రయోగించి ఇరాన్ అగ్రనాయకత్వాన్ని చంపివేసినంత తేలికగా అక్కడి ప్రభుత్వాన్ని స్వాధీనంలోకి తెచ్చుకోలేమని, తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేమని ఇప్పుడు గ్రహిస్తున్నారు. గత 20 ఏళ్లుగా అమెరికాతో యుద్ధానికి ఇరాన్ సిద్ధపడుతోంది. అమెరికా కేవలం ఆర్థిక ఆంక్షలతో, బెదిరింపులతో స్వాధీనంలోకి తెచ్చుకొనే విఫల ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. ముఖ్యంగా గత ఏడాది జూన్ లో 12 రోజులపాటు జరిగిన యుద్ధం ద్వారా అమెరికా, ఇజ్రాయిల్ బలాలు, బలహీనతలపై ఇరాన్ ఓ అంచనాకు వచ్చింది. అప్పటి నుండే యుద్ధంకు సన్నాహాలు ప్రారంభించింది. తనను చంపటమే అమెరికా మొదటి లక్ష్యం అని ఖమేనీ ముందే గ్రహించారు. తాను చనిపోయినా అమెరికా వత్తిడులకు లొంగని నాయకత్వాన్ని ఆయన నిర్మించుకుంటూ వచ్చారు. అటువంటి ప్రణాళికలు, సన్నాహాలు అమెరికా, ఇజ్రాయిల్ లలో కనిపించడం లేదు. పైగా, అమెరికా సైన్యం 'ప్రచ్ఛన్న శీతల యుద్ధం' కాలంలో పోరాడే విధంగా, ఆధిపత్యం కోసం, కందరాలను వంచడానికి, తమ ఆర్థిక–సైనిక బాలలను చూపి బెదిరింపులతో లొంగదీసుకోవడానికి పేరొందింది. అమెరికన్ సైన్యం 21వ శతాబ్దపు ఆధునిక యుద్ధంతో పోరాడటానికి సిద్ధంగా లేదని పలువురు నిపుణులు భావిస్తున్నారు. అదీగాక, భారీ అమెరికా యుద్ధ యంత్రాంగం ఖరీదైనది. అది నిదానంగా, నెమ్మదిగా కదిలేది. వేగంగా, ప్రత్యర్థుల ఎత్తుగడలను తిప్పికొట్టే విధంగా తిరగబడే స్వభావం దానికి లేదు. బలప్రదర్శనతో విర్రవీగడమే గాని వ్యూహాత్మకంగా అడుగులు వేసే అలవాటు లేదు. వీటన్నిటితో పాటు, అమెరికా సైన్యం అవినీతికి పేరొందింది. పెంటగాన్, జనరల్స్ ముడుపులు తీసుకొని ఆయుధాలు, యుద్ధ పరికరాలను అప్పగించడంపై ఎక్కువగా ఆసక్తి చూపుతూ ఉంటారు. ప్రస్తుత యుద్ధంలో అమెరికా కన్నా ఇరాన్ వ్యూహాత్మకంగా ముందంజలో ఉందని ట్రంప్ వ్యవహారాలపై నిశితంగా అధ్యయనం జరుపుతున్న ప్రొఫెసర్ జియాంగ్ జోక్విన్ తెలిపారు.



"వాస్తవం ఏమిటంటే, ప్రస్తుతం ఇది అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం. ఇరానియన్లు ఈ సంఘర్షణకు 20 సంవత్సరాలుగా సిద్ధమవుతున్నారు. వారి మతంలో, ఇది గొప్ప సాతానుకు వ్యతిరేకంగా జరుపుతున్న యుద్ధం. అందుకు చాలాకాలంగా సిద్ధమవుతున్నారు. గత జూన్‌లో 12 రోజుల యుద్ధం సమయంలో ఇరానియన్లు ఇజ్రాయెల్, అమెరికన్ల సామర్థ్యాలను పరిశీలించి విశ్లేషించగలిగారు. ఈ కొత్త దాడికి పూర్తిగా సిద్ధం కావడానికి వారికి చాలా ఎక్కువగా ఎనిమిది నెలల సమయం లభించింది" అని ఆయన వివరించారు. సైనిక వ్యూహకర్తలు భూతల దాడులు జరిపితే వినాశకరమైనదని చెప్పినప్పటికీ, అమెరికా అధ్యక్షుడు ఇప్పటికీ అందుకు ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. ఇరాన్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, దేశ సైనిక వనరులను విస్తరించేందుకు, వాయువ్య ఇరాన్‌లోకి భూ దాడిని ప్రారంభించమని వాషింగ్టన్ ఇరాన్ బహిష్కరించిన కుర్దిష్ మిలీషియాలను ప్రోత్సహిస్తుంది. ఉత్తర ఇరాక్‌లోని సెమీ–అటానమస్ కుర్దిష్ ప్రాంతంలో ఉన్న ఇరానియన్ కుర్దిష్ జాతీయవాద సమూహం నాయకుడు ఒకరు ఇరానియన్ కుర్దులు ఇరాన్‌లోకి సరిహద్దు భూ ఆపరేషన్ నిర్వహించే "అవకాశం" ఉందని చెప్పారు. వాస్తవానికి వారు అటువంటి అవకాశం కోసం చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. అయితే, ట్రంప్ ను నమ్ముకొని నేరుగా ఇరాన్ దళాలతో పోరాడేందుకు వచ్చేందుకు కుర్దిష్ నాయకులు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తున్నది. అవసరమైన ఆధునిక ఆయుధాలు లేకపోవడమే కాకుండా, ట్రంప్ ఏమేరకు పూర్తిగా అండగా ఉంటారనే సందేహాలు వారిలో వ్యక్తం అవుతున్నాయి.అమెరికా ప్రజలలో సహితం భూతల దాడుల పట్ల తీవ్ర వ్యతిరేకత వెల్లడవుతుంది. ఒక పరిశీలకుడు చెప్పినట్లు ఇరాన్ సైనికులు, నేతలు దేశంకోసం మరణానికి సిద్ధంగా ఉన్నారు. కానీ, అమెరికా, ఇజ్రాయిల్ సిద్ధంగా లేవు. ఒక సైనికుడు, ఒక పౌరుడు మరణించినా ఆయా ప్రభుత్వాలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. ఇప్పటికే భారీ సంఖ్యలో అమెరికా సైనికులను చంపివేశామని, అనేకమందిని తమ నిర్బంధంలోనికి తీసుకున్నామని ఇరాన్ నేతలు చెబుతున్నారు. కేవలం ఆరుగురు మాత్రమే చనిపోయారని అమెరికా వాదిస్తున్నది. మరణాల సంఖ్య బైటకు వస్తే అక్కడి ప్రభుత్వాలే కూలిపోయే ప్రమాదం ఉందని వారికి తెలుసు.

### గల్ఫ్ దేశాల ఉనికికే ముప్పు

దాడులను వ్యూహాత్మకంగా గల్ఫ్ దేశాలకు ఇరాన్ విస్తరింపచేయడంతో అమెరికా ఊహించని కుదుపుకు గురయింది. ఆ దేశాలపై ఎందుకు దాడులు చేస్తున్నారో అర్థం కావడం లేదంటూ ట్రంప్ విస్మయం వ్యక్తం చేశారు. తమ రక్షణకు అమెరికా భరోసా అని గుడ్డినమ్మకంతో ఉన్న గల్ఫ్ దేశాలు ఇప్పుడు తమ విధానాలను సమీక్షించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. వందల బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టి అమెరికాతో ఏర్పర్చుకున్న భద్రతా వ్యవస్థ తమకు నిజమైన భద్రత కల్పించలేదని ఆయా దేశాలు ఇప్పుడు తెలుసుకున్నాయి. అమెరికా నుంచి కొనుగోలు చేసిన వందల బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలు వారి పౌరులకు, వ్యాపారాలకు, మౌలిక సదుపాయాలకు రక్షణ కల్పించలేక పోతున్నాయి. వైమానిక దాడుల నుండి రక్షణ కల్పించే అమెరికా ఆయుధ వ్యవస్థలను తట్టుకొని ఇరాన్ ప్రయోగించే తేలికపాటి వ్యయంతో కూడిన డ్రోన్లు ఏ విధంగా తమ దేశాలలో నష్టాలు కలిగించగలుగుతున్నాయో వారికి అర్థం కావడం లేదు. వేల మైళ్ల దూరంలోని అమెరికాను నమ్ముకోవడం కన్నా పొరుగు దేశాలతో దౌత్యపర సంబంధాలను మెరుగుపరచు కోవడమే తమకు కొండంత భరోసా ఇవ్వగలదని గ్రహిస్తున్నారు. దానితో, గల్ఫ్ దేశాలు భవిష్యత్ పొత్తుల గురించి తీవ్రంగా ఆలోచించబోతున్నాయి. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ సౌదీ అరేబియా రక్షణ మంత్రిని కలిసి 'ఇస్లామిక్ నాటో' గురించి చర్చలు జరపడం గమనార్హం. గల్ఫ్ దేశాలకు సమస్యలు చిన్న జనాభా, నిత్యావసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం, భారీగా విదేశీ కార్మికులు, పర్యాటకులపై ఆర్థిక కార్యకలాపాలు ఆధారపడటం, నీటి కోసం డీశాలినేషన్‌పై ఆధారపడటం. హార్ముజ్ ద్వారా సురక్షితంగా చమురు ఎగుమతులు జరపడం వారికి చాలా కీలకం. ఇప్పుడు జిసిసిని సైనిక కూటమిగా బలోపేతం చేయడం వంటి కొన్ని అంశాలు పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. జిసిసి దేశాలు తమ ఆహారంలో 90 శాతం హార్ముజ్ జలసంధి నుండి పొందుతాయి. ప్రస్తుత యుద్ధం కొనసాగితే ఇరానియన్ల నుండి సౌదీ అరేబియా, యుఎఇ, బహ్రెయిన్, ఖతార్ ఉనికి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. ఈ గల్ఫ్ దేశాలు నిజంగా అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన కేంద్రంగా ఉండటం గమనార్హం. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ మొత్తం కృత్రిమ మేధ పెట్టుబడులు, డేటా సెంటర్ల చుట్టూ తిరుగుతున్నది. వాటిల్లో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుండి వస్తుంది. కాబట్టి, గల్ఫ్ దేశాలు ఇకపై చమురును అమ్మలేకపోతే, అమెరికాలో ఈ పెట్టుబడులు పెట్టలేక పోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ కూడా కుప్పకూలే ప్రమాదం ఉంది. అందుకనే యుద్ధం ఆపేయమని గల్ఫ్ దేశాల నుండి అమెరికా వత్తిడులు ఎదుర్కొనే విధంగా ఇరాన్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తున్నది. మరోవంక, అమెరికా యుద్ధంలో భారీ వ్యయం ఎదుర్కోవలసి రావడం ఆ దేశం ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నది. రోజుకు 100 కోట్ల డాలర్లను (రూ. 9,000 కోట్లు) అమెరికా ఖర్చు చేసినట్లు కొన్ని అంచనాలు తెలుపుతున్నాయి. గత జూన్ లో జరిపిన యుద్ధం నుండి, తాజా యుద్ధ సన్నాహాలు వరకు అమెరికా, ఇజ్రాయిల్ రూ 3 లక్షల కోట్లకు మించి ఖర్చు చేసినట్లు భావిస్తున్నారు. ఇరాన్ చవకైన డ్రోన్లను అడ్డుకునేందుకు అమెరికా ఖరీదైన క్షిపణులను ప్రయోగిస్తున్నది. యుద్ధం ప్రారంభమైన తొలి నాలుగు రోజుల్లో ఇరాన్ దాదాపు 2,000 డ్రోన్లను ఇజ్రాయెల్‌పై ప్రయోగించినట్లు అమెరికా తెలిపింది. ఇరాన్ వద్ద అంత భారీ సంఖ్యలో డ్రోన్ల నిల్వలు ఉన్నట్లు అమెరికా, ఇజ్రాయిల్ అసలు అంచనా వేయలేకపోయారు. షహీద్ వంటి రూ.20 నుండి రూ. 30 లక్షలు ఖరీదైన ఇరాన్ డ్రోన్‌ను కూల్చివేసేందుకు అమెరికా రూ.30 నుండి రూ 50 కోట్లు విలువైన పాట్రియాట్ పీఏసీ–3 క్షిపణిని ఉపయోగిస్తున్నదని చెబుతున్నారు. ఇప్పటికే వాడిన ఆయుధాల స్థానంలో కొత్తవి రూపొందించేందుకు భారీగా ఖర్చవుతుంది. అదనంగా 3.1 బిలియన్ డాలర్లు అవసరం. రోజుకు 758 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాల్ని యుద్ధంలో వినియోగిస్తున్నారు. ఫైటర్ విమానాల కోసం కూడా భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఏది ఏమైనా భారీ నష్టాలకు అధైర్యపడకుండా, అలసట లేకుండా ఎదురు దాడులకు ఇరాన్ సిద్ధపడుతూ ఉండగా, ఒకొక్క రోజు అమెరికా, ఇజ్రాయిల్ లకు చాలా భారంగా గడుస్తుంది.



చలసాని నరేంద్ర
9849569050

## నెయ్యం - కయ్యం

నిమ్మరసానికి పాలకు వైరం
ఎండతో చీకటికి శత్రుత్వం
మానవత్వంతో హింసకు గొడవ
దురలవాట్లతో ఆరోగ్యానికి కక్ష
మాటలకు నిశ్శబ్దానికి ద్వేషం
భావదారిద్ర్యానికి వివేకానికి పగ
రాజకీయాలకు నీతికి పడదు
తల్లి పాలకు కల్తీకి కుదరదు
మనిషికి మంచికీ పోరాట కుస్తీ
భూమాతకు కాలుష్యంతో కయ్యం
మానవత్వం అంటే మనిషికి కోపం !



పాటతో సరిగమపదనిలకు స్నేహం
నీడతో నాకు విడదీయరాని చెలిమి
జైలుతో నేరగాండ్లకు చుట్టరికం
కాలానికి గడియారానికి మిత్రుత్వం
పుస్తకానికి అక్షరాలతో అవిభాజ్య దోస్తీ
కవనానికి కవితా వస్తువుకు
సాన్నిహిత్యం
చెమటతో విజయానికి అనుబంధం
ఆల్కహాల్‌తో మత్తుకు గమ్మత్తు మైత్రీ
రైతుకు పాడిపంటలతో గాఢ ప్రేమ
ఆలుమగల మధ్య బేషరతు అనుబంధం
తల్లికి బిడ్డకు అద్వితీయ పేగు బంధం !

మధుపాళీ
9949700037

# భీష్ముడి మౌనం ఒక సామాజిక మచ్చ

*తన మౌనాన్ని సమర్థించుకుంటూ భీష్ముడు రెండు ప్రధాన కారణాలు చెప్పాడు. మొదటిది, నేను హస్తినాపురం ఉప్పు తింటున్నాను, వారి ఆజ్ఞకు వ్యతిరేకంగా వెళ్లలేను అన్నాడు. రెండోది, ధర్మం అనేది చాలా సూక్ష్మమైనది. యుధిష్ఠిరుడు తనను తాను ఓడిపోయిన తర్వాత నిన్ను పణంగా పెట్టాడా లేదా అనేది ధర్మ సూక్ష్మంగా తేలడం లేదు అన్నాడు. నిజానికి, భీష్ముడు చెప్పిన ఈ వాదనలు ఎంతవరకు సమంజసం? ఒక స్త్రీని బహిరంగంగా వివస్త్రను చేయాలని ప్రయత్నిస్తున్నప్పుడు, అక్కడ ధర్మం సూక్ష్మంగా ఎలా ఉంటుంది? అది పచ్చి అన్యాయం, కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్న అధర్మం. అన్నదానం తీసుకున్నంత మాత్రాన అన్యాయానికి వంత పాడటం రాజధర్మం ఎలా అవుతుంది? భీష్ముడు తన వ్యక్తిగత ప్రతిజ్ఞా ధర్మం లో చిక్కుకుపోయి, విశ్వవ్యాప్తమైన మానవత్వ ధర్మాన్ని విస్మరించాడు. భీష్ముడి జీవితమంతా త్యాగాలమయం. తండ్రి సుఖం కోసం రాజ్యం వదులుకున్నాడు, వంశం కోసం బ్రహ్మచర్యం స్వీకరించాడు. కానీ, ఈ వ్యక్తిగత నిష్ఠలు సామాజిక న్యాయం కంటే గొప్పవా? కృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లు ధర్మ సంస్థాపన అంటే కేవలం అక్షరాలను పాటించడం కాదు, సత్యాన్ని కాపాడటం. భీష్ముడు తన ప్రతిజ్ఞను కాపాడుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చాడే తప్ప, ఆ క్షణంలో తన కళ్లముందు అన్యాయానికి గురవుతున్న ఒక స్త్రీ గౌరవాన్ని కాపాడలేకపోయాడు.*

మహాభారతం కేవలం ఒక పురాణ గాథ మాత్రమే కాదు, అది మానవ మనస్తత్వ శాస్త్రానికి, నైతిక విలువల సంఘర్షణకు ఒక నిలువుటద్దం. ఆ మహాకావ్యంలో ఎన్నో మలుపులు, ఎన్నో వీరగాథలు ఉన్నప్పటికీ, వాటన్నింటినీ వెనక్కి నెట్టి నేటికీ మనల్ని కలచివేసే ఘట్టం ద్రౌపది వస్త్రాపహరణం . నిండు సభలో, కురువృద్ధుల సమక్షంలో ఒక స్త్రీకి జరిగిన పరాభవం అది. ఆ సమయంలో గంగాపుత్రుడు, ధర్మ స్వరూపుడిగా కీర్తించబడే భీష్ముడు మౌనంగా ఉండిపోవడం చరిత్రలో అతిపెద్ద ప్రశ్నార్థకం. ఆ మౌనం సరైనదేనా? అది ధర్మబద్ధమేనా? ఈ ప్రశ్నలను నేటి ఆధునిక సామాజిక దృక్పథంతో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. మాయా ద్యూతంలో ధర్మరాజు తన సర్వస్వాన్ని కోల్పోయాడు. చివరకు తనను తాను, తన తమ్ముళ్లను, తన అర్ధాంగి ద్రౌపదిని కూడా పణంగా పెట్టి ఓడిపోయాడు. దుర్యోధనుడి ఆజ్ఞ మేరకు దుశ్శాసనుడు ఏకవస్త్ర అయి ఉన్న ద్రౌపదిని కేశాలు పట్టుకుని సభలోకి ఈడ్చుకొచ్చాడు. ఆ సభలో సామాన్యులు లేరు. సత్యవ్రతుడైన భీష్ముడు, శస్త్రశాస్త్ర కోవిదుడైన ద్రోణుడు, కులగురువు కృపాచార్యుడు, ధృతరాష్ట్ర మహారాజు వంటి ఉద్దండులు ఉన్నారు. ద్రౌపది ఆక్రందన ఆకాశాన్ని తాకింది. ఆమె వేసిన ప్రశ్న చాలా తార్కికమైనది. తనను తాను ఓడిపోయిన వ్యక్తికి, నన్ను పణంగా పెట్టే హక్కు ఎక్కడిది? అని ఆమె సభను నిలదీసింది. కానీ ఆ నిశ్శబ్దం భయంకరంగా ఉంది. విదురుడు తప్ప మిగిలిన వారందరూ తలలు దించుకున్నారు. ఆ సమయంలో భీష్ముడి మౌనం కేవలం నిశ్శబ్దం కాదు, అది అన్యాయానికి లభించిన పరోక్ష అంగీకారం. తన మౌనాన్ని సమర్థించుకుంటూ భీష్ముడు రెండు ప్రధాన కారణాలు చెప్పాడు. మొదటిది, నేను హస్తినాపురం ఉప్పు తింటున్నాను, వారి ఆజ్ఞకు వ్యతిరేకంగా వెళ్లలేను అన్నాడు. రెండోది, ధర్మం అనేది చాలా సూక్ష్మమైనది. యుధిష్ఠిరుడు తనను తాను ఓడిపోయిన తర్వాత నిన్ను పణంగా పెట్టాడా లేదా అనేది ధర్మ సూక్ష్మంగా తేలడం లేదు అన్నాడు. నిజానికి, భీష్ముడు చెప్పిన ఈ వాదనలు ఎంతవరకు సమంజసం? ఒక స్త్రీని బహిరంగంగా వివస్త్రను చేయాలని ప్రయత్నిస్తున్నప్పుడు, అక్కడ ధర్మం సూక్ష్మంగా ఎలా ఉంటుంది? అది పచ్చి అన్యాయం, కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్న అధర్మం. అన్నదానం తీసుకున్నంత మాత్రాన అన్యాయానికి వంత పాడటం రాజధర్మం ఎలా అవుతుంది? భీష్ముడు తన వ్యక్తిగత ప్రతిజ్ఞా ధర్మం లో చిక్కుకుపోయి, విశ్వవ్యాప్తమైన మానవత్వ ధర్మాన్ని విస్మరించాడు. భీష్ముడి జీవితమంతా త్యాగాలమయం. తండ్రి సుఖం కోసం రాజ్యం వదులుకున్నాడు, వంశం కోసం బ్రహ్మచర్యం స్వీకరించాడు. కానీ, ఈ వ్యక్తిగత నిష్ఠలు సామాజిక న్యాయం కంటే గొప్పవా? కృష్ణుడు భ గ వ ద్గీత లో చెప్పినట్లు ధర్మ సంస్థాపన అంటే కేవలం అక్షరాలను పాటించడం కాదు, సత్యాన్ని కాపాడటం. భీష్ముడు తన ప్రతిజ్ఞను కాపాడుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చాడే తప్ప, ఆ క్షణంలో తన కళ్లముందు అన్యాయానికి గురవుతున్న ఒక స్త్రీ గౌరవాన్ని కాపాడలేకపోయాడు. ఏ ప్రతిజ్ఞ అయినా ధర్మానికి లోబడి ఉండాలి. ధర్మాన్నే మింగేసే ప్రతిజ్ఞలు ఉంటే, వాటిని విడిచిపెట్టడమే నిజమైన వీరత్వం. కానీ భీష్ముడు ఆ వీరత్వాన్ని ప్రదర్శించలేకపోయాడు. భీష్ముడు కేవలం ఒక తాతగానో, యోధుడిగానే కాకుండా, హస్తినాపురం రాజ్యానికి రక్షకుడిగా ఉన్నాడు. ఆయన ఒక్క మాట అంటే దుర్యోధనుడు కాదు కదా, యమధర్మరాజు కూడా గడగడలాడతాడు. కానీ, ఆయన తన నైతిక అధికారాన్ని ప్రయోగించలేదు. ప్రఖ్యాత రాజనీతిజ్ఞుడు ఎడ్మండ్ బర్క్ అన్నట్లు, చెడు గెలవడానికి మంచి మనుషులు ఏమీ చేయకుండా ఊరకనే ఉండటం చాలు. భీష్ముడు ఏమీ చేయకపోవడమే కౌరవులకు కొండంత బలాన్ని ఇచ్చింది. అధికారం ఉన్నవారు మౌనంగా ఉంటే, అది నేరస్తులకు ఇచ్చే లైసెన్స్ లాంటిది. అదే సభలో విదురుడు కూడా ఉన్నాడు. భీష్ముడితో పోలిస్తే విదురుడికి ఉన్న అధికారం తక్కువ, సామాజిక హోదా కూడా తక్కువే. కానీ, విదురుడు భయపడలేదు. నిలబడి గర్జించాడు. దుర్యోధనా! ఈ పని మానుకో, ఇది నీ వంశ నాశనానికి దారి తీస్తుంది అని హెచ్చరించాడు. విదురుడికి లేని ధర్మ సూక్ష్మం భీష్ముడికి ఎందుకు అడ్డొచ్చింది? అంటే, ఇక్కడ సమస్య ధర్మం తెలియకపోవడం కాదు, ధర్మాన్ని నిలబెట్టే నైతిక



ధైర్యం లేకపోవడం ఈ పురాణ గాథ నేటికీ సజీవంగా ఉంది. మన చుట్టూ రోజూ ఎన్నో వస్త్రాపహరణాలు జరుగుతూనే ఉన్నాయి. కార్యాలయాల్లో, ఒక ఉన్నతాధికారి తన కింద పనిచేసే మహిళను లేదా అణగారిన ఉద్యోగిని వేధిస్తుంటే, తోటి సహోద్యోగులు మాకెందుకు వచ్చిన గొడవ, మా ఉద్యోగాలు పోతాయి అని మౌనంగా ఉంటారు. ఇది భీష్ముడి మౌనానికి ప్రతీక. రాజకీయాల్లో ,ఒక నేత తప్పు చేస్తుంటే, ఆ పార్టీలోని పెద్దలు పార్టీ ప్రతిష్ట దెబ్బ తింటుంది అని మౌనంగా ఉంటారు. ఇది కూడా అదే నిశ్శబ్దం వీధుల్లో, ఒక ప్రమాదం జరిగినా, ఒక స్త్రీపై దాడి జరిగినా ఫోన్లలో వీడియోలు తీస్తారే తప్ప, అడ్డుకోవడానికి ఎవరూ ముందుకు రారు. మనందరిలోనూ ఒక భీష్ముడు ఉన్నాడు. తన వ్యక్తిగత ప్రయోజనాలు, భయాలు, కట్టుబాట్ల కోసం సత్యాన్ని బలి ఇచ్చే భీష్ముడు. కురుక్షేత్ర యుద్ధం చివరలో శరశయ్యపై పడుకున్నప్పుడు భీష్ముడు తన తప్పును అంగీకరించాడు. అధర్ముడి పక్కన కూర్చుని భోజనం చేయడం వల్ల నా బుద్ధి మందగించింది అని వ్యాఖ్యానించాడు. కానీ, ఆ పశ్చాత్తాపం ద్రౌపది పడిన అవమానాన్ని తుడిచివేయలేదు కదా! చరిత్రలో భీష్ముడు గొప్ప జ్ఞానిగా మిగిలినా, ద్రౌపది సభలో మౌనంగా ఉన్నవాడనే మచ్చ ఆయన కీర్తికి తీరని లోటు. ఈ ఘట్టంలో అసలైన హీరో ద్రౌపది. ఆమె ఎవరి కోసమో వేచి చూడలేదు. భర్తలు తలదించుకున్నారు, కురువృద్ధులు మౌనంగా ఉన్నారు. అప్పుడు ఆమె తన ఆత్మగౌరవం కోసం తానే గళమెత్తింది. ఆమె ప్రశ్నలు సభను ఉలిక్కిపడేలా చేశాయి. చివరకు పురుషుల సహాయం అందకపోవడంతో, విశ్వశక్తి అయిన కృష్ణుడిని ప్రార్థించి తనను తాను రక్షించుకుంది. స్త్రీలు తమ రక్షణ కోసం ఇతరులపై ఆధారపడకూడదని, అన్యాయం జరిగినప్పుడు గొంతు విప్పాలని ద్రౌపది నేర్పింది. నేటి మహిళలకు ద్రౌపది ఒక గొప్ప స్ఫూర్తి. భీష్ముడి మౌనం మనకు నేర్పే అతిపెద్ద పాఠం ఏమిటంటే,అన్యాయం జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండటం తటస్థత కాదు, అది కూడా ఒక నేరమే. మనం ఎంత గొప్ప మేధావులమైనా, ఎంతటి పదవుల్లో ఉన్నా, సామాజిక న్యాయం పట్ల మనకు బాధ్యత ఉండాలి. అది నా సమస్య కాదు అని మనం అనుకున్న ప్రతిసారీ, మనం ఒక అన్యాయానికి మద్దతు ఇస్తున్నట్లే లెక్క. భీష్ముడి లాంటి మహానుభావుడే తన మౌనం వల్ల చరిత్రలో విమర్శలకు గురైనప్పుడు, సామాన్యులమైన మన పరిస్థితి ఏమిటి? సమాజంలో మార్పు రావాలంటే విదురుడి లాంటి నైతిక ధైర్యం ఉండాలి. తప్పును తప్పు అని చెప్పే తెగువ ఉండాలి. భీష్ముడి మౌనం పునరావృతం కాకూడదంటే, ప్రతి ఒక్కరూ తమలోని నైతికతను నిద్రలేపాలి. మౌనం ఎప్పుడూ సమాధానం కాదు, అది కేవలం అధర్మానికి పెట్టే పెట్టుబడి మాత్రమే. గుర్తుంచుకోండి, ధర్మం అంటే కేవలం పూజలు, పునస్కారాలు కాదు. ఎదుటి వ్యక్తికి అన్యాయం జరుగుతున్నప్పుడు అండగా నిలబడటమే అసలైన ధర్మం. భీష్ముడి మౌనం నుంచి మనం నేర్చుకోవాల్సిన పాఠం ఇదే,నిశ్శబ్దం ఎప్పుడూ శాంతిని ఇవ్వదు, కొన్నిసార్లు అది విధ్వంసానికి నాంది పలుకుతుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169



# గ్రేటర్ హైదరాబాద్



## 5కే రన్ ప్రారంభం




**షాద్ నగర్ మార్చి 09 (వుదయం):** మున్సిపాలిటీ ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా 99రోజుల కార్యాచరణంగా మున్సిపల్ కార్యాలయం నుండి పట్టణ ముఖ్యకుడలి వరకు 5కె రన్ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, పురపాలక కమిషనర్ సునీత రెడ్డి కౌన్సిలర్లు పెంటయ్య మురళీ మోహన్, అశోక్, కొప్పునూరి ప్రవీణ్, సుధీర్, శివ, గోపాల్, దిలీప్, శిరీష, సంతోషిబాయి, అరిఫ్ బేగం, అనిత, రాజు నాయక్, ముబారక్ అలీ ఖాన్, మధువలు యాదవ్, చందులాల్, జిటి శ్రీనివాస్, కరుణాకర్, అగ్గనూర్ నందు, జయ ప్రకాష్, శ్రీకాంత్, ప్రదీప్ ముదిరాజ్, గంగమోని సత్తయ్య,స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ టర్మ్ టెక్నికల్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోండి

**వికారాబాద్, మార్చి 09 (వుదయం ప్రతినిధి):**



వికారాబాద్ లోని ప్రభుత్వ ఐ.టి.ఐ/ ఏ.టి.సి లో 99 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా పలు షార్ట్ టర్మ్ టెక్నికల్ కోర్సులకు అరుహులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆర్ నరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు, ఈ కార్యక్రమంలో భాగంగా సి.ఎన్.సి లేత్ మిషన్ ఆపరేషన్ అండ్ ప్రోగ్రామింగ్, సి.ఎన్.సి మిల్లింగ్ మిషన్ ఆపరేషన్ అండ్ ప్రోగ్రామింగ్, ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ పై అవగాహన కోర్సు, జూనియర్ రోబోట్ ఆపరేటర్ ప్రోగ్రామర్ (ఆర్క్ వెల్డింగ్), ఎలక్ట్రికల్ వెహికల్ పై బేసిక్ కోర్స్ , క్యాడ్ 2డి మరియు 3డి ఫీచర్స్ ఉపయోగించి జూనియర్ ప్రోడక్ట్ డిజైనర్ వంటి కోర్సులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. స్వల్పకాలిక శిక్షణ ద్వారా, అభ్యర్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో, నైపుణ్యాన్ని సంపాదించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కోర్సులకు 10వ తరగతి ,ఐటిఐ , డిప్లొమా, ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు పూర్తి వివరాల కోసం ప్రభుత్వ ఎ.టి.సి/ ఐటిఐ వికారాబాద్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని అలాగే ఈ 9177472488, 9550112364 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ ఆర్ నరేంద్రబాబు తెలియజేయడం జరిగింది ఈ కోర్సులకు 7 బ్యాచ్ లలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

## సంగారెడ్డిలో 13న జాబ్ మేళా

### 800కు పైగా ఉద్యోగ అవకాశాలు




**సంగారెడ్డి, మార్చి 09 (వుదయం):** తెలంగాణ రాష్ట్ర డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ (డిఈఈటి) ఆధ్వర్యంలో ప్రముఖ సంస్థ మహీంద్రా & మహీంద్రా ట్రాక్టర్ తయారీ యూనిట్, జహీరాబాద్ లో ఉద్యోగాల భర్తీ కోసం ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 13, 2026 (శుక్రవారం) ఉదయం 09.00 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హనుమాన్ నగర్, ఇస్మాయిల్ ఖాన్‌పేట్ లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా 800కు పైగా ఖాళీలను ట్రెయినీ మరియు అప్రెంటిస్ పోస్టుల ద్వారా భర్తీ చేయనున్నారని వెల్లడించారు.ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన యువత తమ విద్యా ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు,బయోడేటా,ఇతర అవసరమైన ధ్రువ పత్రాలతో జాబ్ మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాన్ని పొందాలని ఆయన కోరారు.

## ప్రజావాణికి 52 ఆర్జీలు



**జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 52 విన్నపాలు, ఫిర్యాదులు ప్రజల నుంచి అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు సత్యనారాయణ, రవి కిరణ్, సీఈ సహదేవ్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.**

- హైదరాబాద్, (వుదయం)

## గీతంకు వన మహోత్సవ అవార్డు

### మంత్రి వివేక్ చేతుల మీదుగా అందుకున్న గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ



**పటాన్చెరు, మార్చి 09 ( వుదయం):** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గత ఏడాది (2025లో) చేపట్టిన పర్యావరణ స్థిరత్వం, హరిత కార్యక్రమాల నిరంతర నిబద్ధతకు గుర్తింపుగా వన మహోత్సవ అవార్డు - 2026తో సత్కరించారు. హైదరాబాదులో జరిగిన కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ యొక్క 202526 వార్షిక సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.

తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖల మంత్రి జి.వివేక్ వెంకట స్వామి చేతుల మీదుగా గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఈ అవార్డును అందుకున్నారు.

పెద్దయెత్తున మొక్కలు పెంచడం, ప్రాంగణంలో పర్యావరణ హిత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించి, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తున్న సంస్థలకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు.

గీతం హైదరాబాదు ప్రాంగణం నిరంతరం మొక్కల పెంపకం, పర్యావరణ అవగాహనా సదస్సులు, సమాజాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. తద్వారా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనడానికి, ప్రాంగణంలో ఆ సంస్కృతిని నిరంతరం కొనసాగించేలా ప్రోత్సహిస్తోంది.

గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, వివిధ స్కూళ్ల డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, పలు విభాగాల అధిపతులు తదితరులు ప్రతిష్ఠాత్మక వన మహోత్సవ అవార్డును అందుకున్నందుకు హర్షం వెలిబుచ్చారు. పర్యావరణ బాధ్యత, స్థిరమైన అభివృద్ధికి విశ్వవిద్యాలయం యొక్క నిరంతర నిబద్ధతకు గుర్తింపుగా వారు అభివర్ణించారు.

## మహిళ కార్మికులకు చీరలు పంపిణీ



**మేడిపల్లి, మార్చి 09 (వుదయం ప్రతినిధి):** అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జిహెచ్ఎంసి పరిధి బోడుప్పల్ సర్కిల్ లోని పీర్జాదిగూడ డివిజన్లో సోమవారం రాష్ట్ర భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఉపాధ్యక్షుడు మద్దూరు చిత్తరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పీర్జాదిగూడ డివిజన్ లోని మహిళా పారిశుధ్య కార్మికులకు తమ సొంత ఖర్చుతో చీరలను పంపిణీ చేశారు, ఈ సందర్భంగా చిత్తరంజన్ రెడ్డి మాట్లాడుతూ.... మహిళా సాధికారతే దేశాభివృద్ధికి పునాది అని చెప్పిన భారత ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో తాను ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు, నిత్యం ఉదయాన్నే లేచి మనకోసం వీధులను శుభ్రం చేసి మనకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా పాటుపడుతున్న మహిళా పారిశుధ్య కార్మికులకు తమ బాధ్యతగా భావించి వారికి ఒక చిరు కానుకగా చీరలను పంపిణీ చేయడం జరిగిందన్నారు, అనంతరం మహిళా పారిశుధ్య కార్మికులు చిత్తరంజన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, నమిలికొండ అనిల్ రెడ్డి, సుగుణ రెడ్డి, పద్మ మహేశ్వరి రెడ్డి, యాదగిరి గౌడ్ ,సుజాత, గీతా రామ్ వాసుదేవ రెడ్డి,,నవ్య పుష్పలత, ప్రవీణ్ రెడ్డి, సురేష్ శ్రీనివాస్ రెడ్డి, సంకీర్త్ రావు ,తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడి ఎన్నిక



**బీరంగూడ, మార్చి 09 (వుదయం) :** బీరంగూడ గ్రామ అభివృద్ధి కోసం నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ అభివృద్ధి కమిటీకి సభ్యులను గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు బీరంగూడ కమ్యూనిటీ భవనంలో గ్రామస్తుల సమావేశం నిర్వహించగా, సమావేశంలో గ్రామ ప్రజలంతా కలిసి అదెల్లి రవీందర్ ను గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఉపాధ్యక్షులుగా పిర్జపతి సత్యనారాయణ, నక్కల కిష్టయ్య ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చిన్న వీరేష్, కోశాధికారిగా బంటు శివ బాధ్యతలు స్వీకరించగా, కార్యదర్శులుగా బంటు రమేష్, దండు జ్ఞానేశ్వర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బంటు ప్రవీణ్, పెద్దవీరేష్, సారా నరేష్, ఐ. జ్ఞానేశ్వర్, ఆగమయ్య, సతీష్ గౌడ్, మహేష్, ఎడ్ల అశోక్ తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అదెల్లి రవీందర్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు మరియు పెద్దలు తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో కలిసి పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ కౌన్సిలర్ ఎడ్ల రమేష్, ప్రకాష్ రెడ్డి, ఇంద్రేషం ప్రకాష్, సత్యనారాయణ, చిన్న వీరేశం, మాకం మల్లేష్, నక్కల కిష్టయ్య, గండయ్య, బిక్షపతి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం





### జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి, మార్చి 9 (వుదయం ప్రతినిధి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పారిశుధ్యం, విద్యార్థులకు అందే సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇస్నాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్ మరియు డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించాలని సూచించారు. హాల్ టికెట్లు అందాయా, అందులో వివరాలు సరిగ్గా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు రివిజన్ చేస్తున్నారా అని ప్రశ్నిస్తూ ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్యూల్ సరిగా అమలు కావడం లేదని గుర్తించిన కలెక్టర్, సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గుడ్లు అందించడం లేదని గమనించి, వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ అనుమతి లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహించిన కలెక్టర్ హెచ్ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, అదేవిధంగా కొంతమంది ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం పై ఎంఈఓ వివరణ ఇవ్వాలని, పర్యవేక్షణ లోపించినందుకు ఎంఈఓకు కూడా షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ స్పష్టం చేసారు. శానిటేషన్ గ్రాంట్ కింద ఎంత మందిని ఎంగేజ్ చేసుకుంటున్నారో, వారి పేర్లు, ఎప్పటి వరకు పేమెంట్ చేశారన్న వివరాలను అందించాలని సూచించారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం , డైనింగ్ హాల్ సరిగా శుభ్రం చేయకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

అనంతరం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్, అక్కడ మంటలు చెలరేగిన ప్రాంతాన్ని 24 గంటల్లో వాటర్ ట్యాంకర్ల సహాయంతో పూర్తిగా ఆర్పివేయాలని ఆదేశించారు. సెగ్రిగేషన్ ప్రాంతంలో ఉన్న లెగసీ వ్యర్థాలను 48 గంటల్లో పూర్తిగా తరలించి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని సూచించారు.

డంపింగ్ యార్డ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమంగా చెత్త వేయకుండా 24 గంటల పర్యవేక్షణ ఉండేలా ఒక కార్మికుడిని నియమించాలని ఆదేశించారు. అలాగే వ్యర్థాలను సేకరించే మున్సిపల్ ఆటోలు, ప్రైవేట్ వాహనాల ద్వారా చెత్తను ఎక్కడ ప్రాసెస్ చేస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆయా అంశాలపై వెంటనే చర్యలు తీసుకొని యాక్షన్ టేకన్ రిపోర్ట్ ను సమర్పించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ కు సూచించారు.

ఈ సందర్భనలో కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్, మార్చి 9 (వుదయం):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఘనంగా మహిళ దినోత్సవ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మల్లారెడ్డి విశ్వవిద్యాపీట్ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతి రెడ్డి మహిళలను ఈ సందర్భంగా సత్కరించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఉచితంగా మల్లారెడ్డి, నారాయణ హృదయాలయం చికిత్సలయాల్లో వైద్యం నిమిత్తం హెల్త్ కార్డులను ఇస్తామని వెల్లడించారు. ఇంటా బయట మహిళలు ఎంతో కష్టపడుతున్నారని మహిళలకు అన్నిటికన్నా ఉత్తమ గుణమే ప్రధానమని ప్రీతి రెడ్డి సూచించారు. మహిళా జర్నలిస్టుల తెగువను ప్రతి ఒక్కరూ అభినందించాల్సిందేనని ప్రీతి రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి ప్రత్యేకతగా హాజరై మాట్లాడుతూ మహిళల పట్ల డిజిటల్ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు రాతలు రాస్తున్న వాటిని కఠినంగా అదుపు చేసేందుకు అవసరమైన చట్టాలు లేవని అన్నారు. ఇందుకోసం మరింత కఠినమైన చట్టాలను చేయాల్సిన అవసరం ఉందని శిల్పవల్లి అభిప్రాయపడ్డారు.

తెలంగాణ క్రీడ ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలదేవి మాట్లాడుతూ ఆడపిల్లలను అన్ని రంగాలతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని చెప్పారు. పాప్ సింగర్ స్మిత మాట్లాడుతూ ఆధునిక సమాజంలో పురుషుల కన్నా దీటుగా మహిళలు ముందుకు వెళ్తున్నారని ఈ సందర్భంగా చెప్పారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రటరీ చిలుకూరి హరిప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఉమాదేవి, రమాదేవి, రాజేశ్వరి కళ్యాణం, రచన ,వనం నాగరాజు, అమిత్ బట్టు, ఐ.ఆర్.బి. ఇన్ఫ్రా ప్రాజెక్టు హెడ్ కల్నల్ గిరీశ్వర్ సీనియర్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు ఎల్. వేణుగోపాల నాయుడు, మహిళ జర్నలిస్టులు ఈ వేడుకకు హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు డప్పు వాయిద్య కళాకార బృందం సభ్యులను ముఖ్య అతిథులు సత్కరించారు. అదేవిధంగా ప్రెస్ క్లబ్ కమిటీ మహిళా సభ్యులను అతిథులు ప్రీతి రెడ్డి శిల్పవల్లి సోని బాల దేవి, స్మిత ఈ సందర్భంగా శాలువులతో సత్కరించారు. మహిళా జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ హెల్త్ క్యాంపులు వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల ఈ సందర్భంగా వివరించారు.

## జమ్ములమ్మ సన్నిధిలో జె.సి దంపతులు



**గద్వాల, మార్చి 09 (వుదయం ప్రతినిధి) :** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలోని జమ్మిచేడు గ్రామందగ్గర జములమ్మ అమ్మవారిని సోమవారం కర్ణాటక రాష్ట్రం గదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ దుర్గేష్ దంపతులు జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ముందుగా వేద పండితులు జాయిన్ కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికి వారికి ఆలయ కమిటీ తరపున శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ దుర్గేష్ మాట్లాడుతూ జములమ్మ తల్లి మా ఇంటి దేవత మా తాత ముత్తాతల నుండి కొలుస్తున్నాం ప్రతి సంవత్సరంలో రెండు మూడు సార్లు జమ్ములమ్మ తల్లిని దర్శించుకుంటామన్నారు అదేవిధంగా ఎంత పేరు ప్రత్యర్థులు ఉన్న దేవత ఈ తల్లిని కొలుచుకున్న వారికి కొంగు బంగారం అవుతుందన్నారు.

## పారిశుధ్యంపై ఫోకస్ పెట్టండి

### గ్రూప్-1 ట్రైనీ మున్సిపల్ కమిషనర్ లకు కమిషనర్ సూచన



**హైదరాబాద్, మార్చి 09 (వుదయం):** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జీహెచ్ఎంసీ లో వచ్చే 6 రోజులు పారిశుధ్యం పై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని గ్రూప్-1 ట్రైనీ మున్సిపల్ కమిషనర్ లకు కమిషనర్ సూచించారు. సోమవారం సాయంత్రం జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో పారిశుధ్యం కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు నియామకమైన 18 మంది గ్రూప్-1 ట్రైనీ మున్సిపల్ కమిషనర్ లతో కమిషనర్ సమావేశమయ్యారు. తమకు కేటాయించిన ప్రాంతంలో ఎంతమంది సానిటేషన్ వర్కర్స్, సూపర్ వైజర్ లీ ఉన్నారు ? క్షేత్రస్థాయిలో విధులకు ఎంతమంది హాజరయ్యారు అనే డేటాను ట్రైనీ మున్సిపల్ కమిషనర్ లు సేకరించాలన్నారు. ఎన్ని సాట్ వాహనాలు, ఎన్ని రాంకీ వాహనాలు సానిటేషన్ కోసం ఉపయోగిస్తున్నారో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఇతర కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్న వాహనాల వివరాలను సేకరించాలన్నారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో తాము గమనించిన అంశాలకు సంబంధించి ఒక పేజీ నోట్ ను తనకు సమర్పించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. అలాగే వచ్చే ఆరు రోజులు ప్రతి రోజు సాయంత్రం గ్రూప్-1 ట్రైనీ మున్సిపల్ కమిషనర్ లతో వెబ్ ఎక్స్ మీటింగ్ నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. ఇక్కడ పనిచేసిన అనుభవం క్షేత్రస్థాయిలో గ్రూప్-1 ట్రైనీ మున్సిపల్ కమిషనర్ లకు రానున్న రోజుల్లో ఉద్యోగ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంలో ఉపకరిస్తుందని కమిషనర్ తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ లు మందా మకరందు, రవికిరణ్ లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు, చెరువులను రక్షించండి

**కుత్బుల్లాపూర్, మార్చి 9 (వుదయం ప్రతినిధి ):**



మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిజాంపేట్ గ్రామంలో ప్రభుత్వ భూములు, మేడ్చల్ పెద్ద చెరువులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని వినతి పత్రము అందించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్ గ్రామంలోని సర్వే నెంబర్ 233/22, 23, 24, 25, 26, 27 లో దాదాపు 13 ఎకరాల లావణ్య పట్టా ప్రభుత్వ ఖాళీభూమిని అక్రమంగా వినియోగిస్తూ చిన్నచిన్న షాపులు నిర్మించడంతో పాటు, ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లు చేసి అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. సుమారు 200 కోట్ల విలువైన ఈ భూమిని అధికార పార్టీ నేతల సహకారంతో ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిజాంపేట్ లోని సర్వే నెంబర్ 109, శ్రీనివాస్ నగర్ కాలనీలో దాదాపు 7.30 ఎకరాల ప్రభుత్వ ఖాళీ భూమిని 2003లో తప్పుడు రాజకీయ సఫర్ కోటా కింద ఎన్ఓసీ పొందినట్లు చూపించి కొంతమంది అక్రమంగా కబ్జా చేసి ప్లాట్లు చేసి అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ గ్రామంలోని పెద్ద చెరువులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై,సర్వే నెంబర్ 879, 881 పరిధిలో బఫర్ జోన్‌లో విల్లాలు, కాంపౌండ్ వాల్, షెడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు.

## ఇసుక ఫిల్టర్లపై అధికారుల చర్యలు



**కంది మార్చి 09 (వుదయం):** సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని బ్యాతోల్, ఆరుట్ల, లక్డారం గ్రామాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక ఫిల్టర్లపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో ఈ గ్రామాల పరిసర ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఇసుక ఫిల్టర్లు ఏర్పాటు చేసి ఇసుక వడపోత నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు వాటిని ధ్వంసం చేశారు.

ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది జేసీబీల సహాయంతో అక్రమ ఫిల్టర్లను తొలగించి, అక్కడ నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వానికి నష్టం కలిగించే విధంగా అక్రమంగా ఇసుక వడపోత చేపట్టడం చట్టవిరుద్ధమని అధికారులు హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అయితే స్థానిక గ్రామస్తులు మాత్రం అధికారుల చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేయడం తరచుగా జరుగుతున్నప్పటికీ, కొంతకాలం తరువాత మళ్లీ అదే స్థలాల్లో కార్యకలాపాలు ప్రారంభమవుతున్నాయని వారు అంటున్నారు. ఇది దాదాపు



ఆనవాయితీగా మారిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.అక్రమ ఇసుక దందాను పూర్తిగా అరికట్టాలంటే కేవలం ఫిల్టర్లను ధ్వంసం చేయడం సరిపోదని, వాటిని నిర్వహిస్తున్న వారిపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ముఖ్యంగా వోల్టా చట్టం కింద కేసులు నమోదు చేసి గట్టి చర్యలు తీసుకుంటేనే అక్రమార్కుల్లో భయం ఏర్పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

ఇలాంటి అక్రమ కార్యకలాపాల వల్ల ప్రభుత్వానికి ఆదాయం నష్టం కలగడమే కాకుండా, పర్యావరణానికి కూడా హాని కలుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి అక్రమ ఇసుక దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను
# పటిష్టంగా అమలుచేయాలి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**
**ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీల స్వీకరణ**

**హనుమకొండ, మార్చి 09 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని పటిష్టంగా క్షేత్రస్థాయిలో అమలు కావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ ఎన్.రవి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. ప్రజలు అందించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు, తహసిల్దారులను పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల వివరాలను ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటల్లోగా జడ్పీ సీఈఓకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా మరుసటి రోజు ప్రజాపాలన ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమంలో పాల్గొనే ప్రజా ప్రతినిధులు, అధికారుల వివరాలను ముందస్తుగా అందజేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీ పై చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు 200 అర్జీలను కలెక్టర్, అదనపు కలెక్టర్లకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, డిఆర్డిఓ మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, పలు శాఖల జిల్లా అధికారులు తహసిల్దార్లు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యంపై 5కే రన్



'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించడమేలక్ష్యంగా హనుమకొండలో5కే రన్ నిర్వహించారు. ఇందులో 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సందేశం ఇచ్చారు. సోమవారం పోచమ్మ మైదాన్ జంక్షన్ నుంచి హనుమకొండ వెయ్యిస్తంభాల గుడి వరకు జిడబ్ల్యుఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్ చేపట్టారు. ఇందులో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్లు డా.సత్య శారద, చాహత్ బాజ్ పాయ్, కార్పొరేటర్లు, అధికారులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో అవగాహన కలిగిఉండాలని సూచించారు.

**- వరంగల్ టౌన్, మార్చి 09 (వుదయం ప్రతినిధి):**

# దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

- **కలెక్టర్ స్నేహ శబరీష్**

**మహబూబాబాద్, మార్చి 09 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వర గా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో ,(రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా అధికారులు, సంబంధిత మండలాల నుంచి గూగుల్ మీట్ ద్వారా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇనుగుర్తి మండలం లాలుతండ కు చెందిన గుగులోతు సత్తి గత 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న ఇనుగుర్తి శివారులోని తమ భూమికి ఆర్.ఓ.ఎఫ్.ఆర్. కింద సర్వే చేయించి పట్టా చేపించి ఇప్పించగలరని కోరారు. కేసముద్రం మండలం గాంధీనగర్ కు చెందిన భూక్య హుస్సేనీ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా అట్టి ఇల్లును బేస్ మెంట్ వరకు నిర్మించుకున్నానని, అట్టి బేస్ మెంట్ ను పరిశీలించి తనకు బిల్లును మంజూరు చేయాలని కోరారు. బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన భారతి తాము భార్య భర్తలము ఇద్దరము దివ్యాంగులమని ఇందిరమ్మ ఇల్లు కొరకు దరఖాస్తు చేసుకోగా తమకున్న దివ్యాగుల వాహనము నాలుగు చక్రాల వాహనముగా నమోదై ఇందిరమ్మ ఇల్లు మంజూరు విషయంలో తమరి వద్ద పెండింగ్ లో ఉందని విచారించి సమస్య పరిష్కరించాలని కోరారు. నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన రాగిపల్లి వెంకటేశ్వర్లు నెల్లికుదురు గ్రామ శివారులో తమ తండ్రి గారికి చెందిన సర్వే నెంబర్ 201516 సంవత్సరం వరకు తమ తండ్రి గారి పేరు మీద రికార్డులో ఉండి 201624 సంవత్సరం ఇతరుల పేరుపై రికార్డు చూపిస్తుందని అట్టి రికార్డును సరిచేయగలరని కోరారు.

జిల్లా వ్యాప్తంగా (136 ) దరఖాస్తులు వచ్చాయని వాటి పరిష్కారం నిమిత్తం తగు సూచనలు ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. లీగల్ సెల్ ద్వారా న్యాయ సలహాలు సూచనలు సమస్యల పరిష్కారం కోసం (5) దరఖాస్తులను పరిష్కారించామని ప్యార లీగల్ వాలంటరీ విజయ్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తొర్రూరు రెవిన్యూ డివిజనల్ అధికారి గణేష్, జెడ్పి సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గూగుల్ మీ ద్వారా తహసిల్దారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- **కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి, మార్చి 09 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రజలకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 19, 20 వార్డుల్లో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. భూపాలపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు



**మహబూబాబాద్ జిల్లా మార్చి 9 జిల్లా ప్రతినిధి.వుదయం**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా పోలీస్ సిబ్బంది సమక్షంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఏ.ఆర్ డిఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో మహిళా పోలీస్ సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. పోలీస్ శాఖలో మహిళలు ధైర్యం, నిబద్ధతతో సేవలందిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మహిళా సిబ్బంది ఒకరికి ఒకరు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఆర్.ఐలు భాస్కర్, నాగేశ్వర్రావు, ఆర్.ఎస్.ఐ లు, పలువురు మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రజావాణి' దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- **కలెక్టర్ బి.చంద్రశేఖర్**

**నల్లగొండ, మార్చి 09 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఫిర్యాదులు ఎక్కువగా ఉన్న శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూడాలని చెప్పారు. ఒకవేళ ఏదైనా ఫిర్యాదు పరిష్కారం వివిధ కారణాలవల్ల ఆలస్యమవుతున్నట్లయితే అదే విషయాన్ని మధ్యంతర జవాబు ద్వారా ఫిర్యాదుదారుకు తెలియజేయాలని అన్నారు. ప్రజావాణి ఫిర్యాదులన్నీ ఖచ్చితంగా పరిష్కరించాలన్నారు. 30 రోజులకు మించి ఎలాంటి ఫిర్యాదు పెండింగ్‌లో ఉండకూడదని, జిల్లా వ్యాప్తంగా ఈ ఫిర్యాదుల సంఖ్య 150 కి మించకూడదని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పెండింగ్ ఫైళ్ల జాబితా రూపొందించి ఈ నెల 15 లోపు వాటిని పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. వచ్చే వారం లోపు పెండింగ్ ఫైల్స్ తో సహా పరిష్కరించిన వివరాలను సమర్పించాలన్నారు. ఇకపై అన్ని కార్యాలయాల ఫైళ్లు ఈ ఆఫీస్ ద్వారా నిర్వహించాలని కలెక్టర్ వెల్లడించారు .ఇక పై మాన్యువల్ గా కాకుండా ఆన్లైన్లోనే ఫైళ్లు సమర్పించాలని చెప్పారు. కాగా ఈ సోమవారం మొత్తం (125) ఫిర్యాదులు రాగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి (72), జిల్లా అధికారులకు సంబంధించి (53) ఫిర్యాదులు వచ్చాయి. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ వై.అశోక్‌రెడ్డి, దేవరకొండ ,చండూరు ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## ముందస్తు ప్రణాళికతో పుష్కర ఏర్పాట్లు



- **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
- **భూసేకరణ, అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో సమీక్ష**

**ధర్మపురి, మార్చి09 (వుదయం ప్రతినిధి) :**

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహించేందుకు అధికారు లు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. సోమవారం ధర్మపు రిలో జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్‌తో కలిసి పుష్కరాల భూసేకరణ, దేవాల య అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుం డా ఏర్పాట్లు చేయాలన్నారు. భూసే కరణ ప్రక్రియను వేగవంతం చేసి, అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. ధర్మపురి క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం ఘాట్లు, రహదారులు, పార్కింగ్, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయ వంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, ఎఎంసి చైర్మన్ చిలుముల లావణ్య దేవాలయ ఈఓ శ్రీని వాస్, సూపరిండెంట్ కిరణ్, తహసీల్దార్ శ్రీనివాస్, సంఘనబట్ల.దినేష్, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల/రామకృష్ణపూర్, మార్చి 9 (వుదయం ప్రతినిధి ) :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి దృష్ట్యా తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకు, ఇతర నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి

**కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**
**పల్లె ప్రకృతి వనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు పరిశీలన**



**కామారెడ్డి, మార్చి 09 (వుదయం ప్రతినిధి) :**



భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం బిక్నూర్ మండలం అంతంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పల్లె ప్రకృతి వనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కల పెరుగుదల, నిర్వహణ పనులను ఆయన సమీక్షించారు. పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు బాగా పెరిగేలా ప్రతిరోజూ నీరు పోయడం, పిచ్చిమొక్కలను తొలగించడం, చుట్టూ శుభ్రత పాటించడం, క్రమం తప్పకుండా నిర్వహణ (మెయింటెనెన్స్) పనులు చేయడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అవి చెట్లుగా ఎదిగే వరకు నిరంతరంగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై మొక్కలను కాపాడాలని ఆయన కోరారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని కలెక్టర్ ఆరా తీశారు. పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకుని, ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఎల్పివో శ్రీనివాస్, వార్డు మెంబర్లు, సర్పంచ్, ఉప సర్పంచ్, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర స్థాయి క్రీడాకారుడికి సన్మానం...**

మోతె గ్రామానికి చెందిన బుర్రభాస్కర్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో అభినందించారు. బుర్ర భాస్కర్ 2025 సంవత్సరంలో నిర్వహించిన సెకండ్ ఎడిషన్ చీఫ్ మినిస్టర్ ప్యారా గేమ్స్‌లో రాష్ట్ర స్థాయి వీల్‌చైర్ క్రికెట్ పోటీలలో కాంస్య పతకం సాధించి జిల్లాకు గౌరవం తీసుకువచ్చాడు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయన ప్రతిభను ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్ తదితరులు ఉన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**
**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్**

**ఖమ్మం, మార్చి 09 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ప్రజల అర్జీలను స్వీకరించారు. వెలుగుమట్ల భూదాన్ భూములకు చెందిన సిరికొండ కళ్యాణి తన ఇల్లు కూల్చేశారని, తనకు ప్రభుత్వం తరపున అందించే సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం అధికారికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్ మండలంలో సారధి నగర్‌కు చెందిన గాలి నాగేశ్వరమ్మ తాము గత 40 సంవత్సరాలుగా నివసిస్తున్న ఇంటిని రోడ్డు విస్తరణలో తొలగించాలని చూస్తున్నారని, తమకు ఆర్థిక సహాయం చేసి, మరోచోట ఇంటిని మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం అధికారికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామ సర్పంచ్ కొండూరి పరిశుద్ధ రావు గ్రామంలో రైతులు పండించిన మొక్కజొన్న మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరపై కొనుగోలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మార్క్‌ఫెడ్ అధికారికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం పట్టణానికి చెందిన దళిత వర్గీయులు గత ప్రభుత్వంలో 320 మంది లబ్ధిదారులకు దళిత బంధు నిధులు మంజూరి అయి ఉన్నాయని, వాటిని తమకు మంజూరు చేసి యూనిట్లు ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈడి ఎస్సి కార్పొరేషన్‌కు రాస్తూ పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓఏ పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.



## మైనార్టీ ఎంప్లాయిస్ క్యాలెండర్ ను ఆవిష్కరించిన కలెక్టర్

**సిరిసిల్ల, మార్చి 09 (వుదయం ప్రతినిధి) :**

యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ సిరిసిల్ల జిల్లా క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ ఘనంగా ఆవిష్కరించారు .ఈ సందర్భంగా మైనారిటీ ఉద్యోగులు తమ ఉద్యోగ సంబంధిత సమస్యలను ముఖ్యంగా జిల్లా కార్యాలయాలలో ముస్లిం ఉద్యోగులు తమ నమాజ్ ప్రార్థనలు నిర్వహించేందుకు ప్రత్యేక గది స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ షేక్ నిజార్ అహ్మద్ హాజరై మైనారిటీ ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ ఐక్యతపై ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. మైనారిటీ ఉద్యోగుల ఐక్యతను, వారి హక్కుల సాధనకు సంఘం చేస్తున్న కృషిని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అహ్మద్ అబ్దుల్ రసూల్,జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ షఫియుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ సయ్యద్ కరీం సాహెబు, కోశాధికారిమిర్జా సమీ ఉల్లా బేగ్, ఉపాధ్యక్షులు షరీఫ్ మొహియుద్దీన్, నజీర్ అహ్మద్, అయూబ్ ఖాన్, సంయుక్త కార్యదర్శి మొహమ్మద్ ఆజం, మిర్జా ఫసాహత్ అలీ బేగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వాలి మహమ్మద్, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆయేషా తలత్, ప్రెస్ పబ్లిసిటీ సెక్రటరీ,అహ్మద్ పాషా, ఐటి సెక్రటరీ మొహమ్మద్ జకీర్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ,సయ్యద్ సర్వర్, ఈసీ సభ్యులు మైనారిటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాఖల వారీగా ప్రజావాణి దరఖాస్తుల సమీక్ష

- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, మార్చి 09 (వుదయం ప్రతినిధి) :**



ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, శాఖల వారీగా సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వారి పరిధిలో లేని దరఖాస్తులను మరో శాఖకు బదిలీ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి దరఖాస్తుపై విచారించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా దరఖాస్తుల పెండింగ్ అంశాన్ని సమీక్షిస్తానని తెలిపారు. దరఖాస్తులను తమ వద్ద పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం 352 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో వృద్ధులు, దివ్యాంగులు కూర్చున్న చోటకే వెళ్లి జిల్లా కలెక్టర్ వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీఓ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రూపురేఖలు మార్చే ప్రాజెక్టు యూజీడీ

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
**రూ.5257 కోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి పరిపాలన అనుమతి**
**రెండేళ్లలోనే భారీ అభివృద్ధి పనులు పూర్తి చేశాం**
**బాణసంచా పేల్చి సంబరాలు చేసిన కాంగ్రెస్ నేతలు**



**హనుమకొండ, మార్చి 09 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

ఉమ్మడి వరంగల్ జిల్లా రూపురేఖలు మార్చే అతిపెద్ద ప్రాజెక్ట్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, డిసిసి అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని అన్నారు. గతంలో ఎంతోమంది నాయకులు రాజకీయ స్వలాభాల కోసం మాత్రమే పనిచేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్లలోనే అనేక కీలక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. వరంగల్ త్రినగరికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, మామునూరు విమానాశ్రయం ఏర్పాటు, నగర మాస్టర్ ప్లాన్ అమలు వంటి కీలక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.5257.20 కోట్ల నిధులను కేటాయిస్తూ జీఓ నెంబర్ 322 ద్వారా పరిపాలన పరమైన అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టును ఇచ్చిన మాట ప్రకారం నిర్ణీత కాలపట్టికతో అమలు చేసి పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఇప్పటికే సిద్ధమైందని, క్షేత్ర స్థాయిలో ప్రముఖ సంస్థ ద్వారా పూర్తి ప్రణాళికతో తయారు చేయించినట్లు వెల్లడించారు. మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు వేగంగా భూసేకరణ చేపట్టి రూ.309 కోట్లకు పైగా నిధులు కేటాయించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష పార్టీలు అనవసర విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసి భూములను సేకరించి ఫ్యాక్టరీ నిర్మాణానికి కేటాయించినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర విభజన చట్టంలో ఉన్న అనేక హామీలను గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఎందుకు అమలు చేయలేకపోయాయో చెప్పాలని ప్రశ్నించారు.బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ మొద్దు నిద్రలో ఉండి ఇతరులు చేసిన పనులను తామే చేసినట్టు చెప్పుకుంటుందని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వ హయాంలో ఏ టెండర్ ప్రక్రియలోనూ అవకతవకలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కమిషన్ల కోసం పనులను ఆలస్యం చేసే పరిస్థితి తమ పాలనలో లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు జీఓలను పాంప్లెట్‌ల మాదిరిగా జారీ చేశాయని, కానీ తమ ప్రభుత్వం జారీ చేసిన ప్రతి జీఓ అమలు అయ్యేలా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. జిల్లా ప్రజల ఆశీస్సులతో కేవలం రెండేళ్లలోనే ఇంత అభివృద్ధి సాధ్యమైందని పేర్కొంటూ రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రులకు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు అందరూ హనుమకొండ జిల్లా కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్**
**మైనారిటీ మహిళలకు అండ.. గల్ఫ్ కుటుంబాలకు భరోసా**
**మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**
**బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత**



**ధర్మపురి, మార్చి 09 (వుదయం ప్రతినిధి) :**

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని షాధి ఖానాలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి ఆయన మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.అలాగే గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రొసీడింగ్స్‌ను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనారిటీ మహిళలు స్వయం ఉపాధి ద్వారా తమ కాళ్లపై తాము నిలబడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కుట్టు మిషన్ల ద్వారా ఇంటి వద్దే ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. గల్ఫ్ వెళ్ళి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ఈ సహాయం వారికి కొండంత అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ ఆర్థికంగా గౌరవం పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా మైనారిటీ అధికారి చిత్రు, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, ఎఎంసి చైర్మన్ చిలుములలావణ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహశీల్దార్ శ్రీనివాస్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## సూర్యాపేటలో రూ.10 కోట్లతో ఆర్&బీ గెస్ట్ హౌస్‌కు శంకుస్థాపన

**సూర్యాపేట మార్చి 9(వుదయం) సూర్యాపేట, సోమవారం:**

సూర్యాపేట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రహదారులు, భవనముల శాఖ ఆధ్వర్యంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్లు, భవనముల అతిథి గృహం (ఆర్&బీ గెస్ట్ హౌస్) కు రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు మరియు నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత, సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు, తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరతగతిన ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి







◆ **కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మార్చి 09 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇరవేని రాయమల్లు తన భూమికి సంబంధించి పాత పట్టాదారు పాసుపుస్తకం ఉందని, నూతన పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన దుర్గం మల్లేష్ తనకు సమీకృత కూరగాయల మార్కెట్‌లో కేటాయించిన దుకాణాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కన్నేపల్లి మండల కేంద్రానికి చెందిన బోయ పోచం తనకు పూర్వీకుల నుంచి వస్తున్న భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆల్ ఇండియా ఎస్.సి./ఎస్.టి. ఐక్యవేదిక ప్రతినిధి పెరుగు తిరుపతి తన దరఖాస్తులో లక్షెట్టిపేట మండలం ఉత్కూరు చౌరస్తాలో గురువారం జరుగుతున్న వారసంతను వ్యవసాయ మార్కెట్ యార్డు ఏరియాకు మార్చాలని కోరారు. రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధి గుంట నాగరాజు తన దరఖాస్తులో డిఫాల్ట్ మిల్లర్లకు విధించిన 25 శాతం జరిమానా, 12 శాతం వడ్డీ మాఫీ చేసి ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలను ఇప్పించాలని కోరారు. వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామానికి చెందిన పొలంపల్లి మల్లయ్య, పొలంపల్లి మధునయ్యలు తమకు వారసత్వంగా సంక్రమించిన ఆస్తిని పెద్దమనషుల సమక్షంలో పాలి పంపకం చేసుకున్నామని, తమ వాటాకు వచ్చిన భూమిని కొందరు ఒప్పందాన్ని ఉల్లంఘించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటనపై తగు విచారణ జరిపి, ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు పరచి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం రంగపేట గ్రామానికి చెందిన దుర్గం సుమన్ తనతోపాటు మరి కొంతమంది రైతులకు షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ నుంచి బోర్ పాయింట్ గుర్తించి బోర్ వేశామని, ఈ నేపథ్యంలో బోరులకు విద్యుత్తు లైన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామపంచాయతీలలోని సర్పంచ్, ఉపసర్పంచ్, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీలలోని మేయర్/చైర్ పర్సన్, డిప్యూటీ మేయర్/ వైస్ చైర్ పర్సన్ లకు ఈ నెల 12వ తేదీన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతి, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులకు సంబంధించి గ్రామాలు, డివిజన్లు/వార్డుల వారీగా పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. సిఎం కప్ 2025 లో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలను పూర్తి చేసుకుని రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీలలో జిల్లా నుంచి పాల్గొని బ్యాడ్మింటన్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పతకాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ ప్యానల్స్ ఏర్పాటుతో గృహాలకు ఉచిత విద్యుత్ సరఫరా

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన**
**ప్రచార రథం ప్రారంభం**





**పెద్దపల్లి, మార్చి 09 (వుదయం ప్రతినిధి) :**

పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయం ప్రాంగణంలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీ రెడ్కో) ఆధ్వర్యంలో ప్రజలకు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై విశిష్ట ప్రచారం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతి విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్ పై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కార్బన్ ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో ఈ పథకంపై విస్తృత ప్రచారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం 10 మంది లబ్ధిదారులు తమ ఇంటి రూఫ్ పై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. మూడు కిలో వాట్ల సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.78,000 సబ్సిడీ అందిస్తుందని, ప్రతి నెల దాదాపు 2000 రూపాయల వరకు విద్యుత్ బిల్లు ఆదా చేయవచ్చని తెలిపారు. సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి పర్యావరణ హితమని మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇస్తూ అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని సూచించారు. పీఎం సూర్య పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిజిఎన్పిడిసిఎల్ ఎస్ఈ వి.గంగాధర్, డీఈ రాజ బ్రహ్మయ్య చారి, రెడ్ కో జిల్లా మేనేజర్ డి. మనోహర్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణ ప్రభుత్వ భూములు పేదలకు పంచుతాం

**కోటి మంది మహిళలను కోటీశ్వరులుచేయడమే లక్ష్యం**
**మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**





**కరీంనగర్, మార్చి 09 (వుదయం ప్రతినిధి) :**

ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచుతామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం తిమ్మాపూర్‌లో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం,మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు కొందరు తిమ్మాపూర్‌లో పలు చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్టుగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకు వచ్చినప్పుడు ఆయన పైవిధంగా స్పందించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతుంటే చూస్తూ ఉండబోమని ఆయన స్పష్టం చేశారు. తిమ్మాపూర్‌లో సర్వేలు జరిపించి ఆక్రమణలకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. భూమి లేని నిరుపేదలకు ఆ స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. నిర్మాణం పనులు చేపట్టనున్న ఆరోగ్య ఉప కేంద్రం స్థలం వద్ద నీరు నిలవకుండా కాలువ ద్వారా మళ్లించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. వీవో భవన నిర్మాణాన్ని మే మాసాంతానికల్లా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతే కాకుండా నీటి సౌకర్యం కోసం వీవో భవనం వద్ద బోరు వెల్ వేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాల వల్ల ఇప్పటికే ఎంతో మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని ఆయన చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు పర్యాయాలు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని డాక్టర్ కవ్వంపల్లి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని, ఇప్పటి వరకు తిమ్మాపూర్ గ్రామానికి 47 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మలి, తుది విడుతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమాల్లో తిమ్మాపూర్ తహశీల్దార్ కర్ర శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి అధికారి మల్హోత్రా, ఎంపీవో ప్రదీప్, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ పైడిపల్లి అంజిబాబు, మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసిల్లా, డాక్టర్ పుల్లారావు, పశువైద్యాధికారి డాక్టర్ టి.మౌనిక, పంచాయతీరాజ్ ఏఈ స్నేహజ్యోతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాగోని లక్ష్మీనారాయణగౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు శ్రీగిరి రంగారావు, పార్టీ నాయకులు పోలు రాము,రమేశ్, చింతిరెడ్డి లక్ష్మారెడ్డి, ముప్పిడి సంపత్ రెడ్డి, నగునూరి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి చింతకింది చంద్రశేఖర్, వార్డు సభ్యులు చిలుకూరి రాజు, నగునూరి రజిత, బొర్ర వంశీ, పోతరాజుల స్వప్న, దేవేందర్, తమ్మనవేణి నర్సయ్య, మాతంగి అంజయ్య, జక్కని నవ్య, సతీష్ మల్లమ్మ, వీవోఏలు నగునూరి మంజుల, ఓరుగంటి శారద రెడ్డి, ఎండీ బిస్మిల్లా పాల్గొన్నారు.





## చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా 7వ వార్షికోత్సవ సంబరాలు

**సత్తుపల్లి మార్చి 9 (వుదయం ప్రతినిధి) :**

సత్తుపల్లి మున్సిపాలిటీలోని గుడిపాడు రోడ్ నందు గల చైతన్య టెక్నో స్కూల్ సప్తమ వార్షికోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మండల విద్యాధికారి ఎన్. రాజేశ్వరరావు, జాతీయ బి.సి. సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాసరావు, సత్తుపల్లి మున్సిపాలిటీ 15 వ వార్డు కౌన్సిలర్ దూదిపాళ్ళ రాంబాబు హాజరైనారు. ఈ సందర్భంగా యస్.యస్.సి.2025 లో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథి డాక్టర్ దయానంద్ విజయ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించాలని సూచించారు. సత్తుపల్లి మండల విద్యాధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత విద్యా ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థగా గుర్తింపు పొందినందుకు అభినందించారు. వార్షికోత్సవ వేడుకలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. మురళీకృష్ణ, డైరక్టర్లు ఆర్. సుజాత, ఆర్. రాకేష్, యం. రవికుమార్, వై. ఉష మరియు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో అనసూయ గారు చేసిన కృషి మరువలేనిది



◆ **ఎమ్మెల్యే జారె**

**అశ్వరావుపేట మార్చి 9 (వుదయం ప్రతినిధి ):**

అశ్వారావుపేటలో సేవా కార్యక్రమాలతో విశేష గుర్తింపు పొందిన అమ్మ సేవా సదనం వ్యవస్థాపకురాలు కూరపాటి అనసూయ ఇటీవల అకాలమరణం చెందడం ఎంతో దురదృష్టకరమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు

సోమవారం నిర్వహించిన వారి దశదిన కార్యక్రమంలో పాల్గొని అనసూయ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు అనంతరం మాట్లాడుతూ అనసూయ జీవితాంతం సేవా భావంతో పనిచేశారని ముఖ్యంగా అవసరంలో ఉన్న అభాగ్యులను చేరదీసి వారికి అన్ని విధాల సహాయం చేస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు సమాజ సేవలో ఆమె చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని ఆమె చూపిన మార్గాన్ని అందరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు ఈ సందర్భంగా అనసూయ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు



## పైపుల ద్వారా గ్యాస్ సరఫరా ప్రారంభం

**కోదాడ: మార్చి 9(వుదయం):**

కోదాడ పట్టణంలోని గోపిరెడ్డి నగర్‌లో ఇంటింటికి పైపుల ద్వారా గ్యాస్ సరఫరా (PNG) కార్యక్రమాన్ని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు సౌకర్యవంతంగా, సురక్షితంగా గ్యాస్ అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పైపుల ద్వారా గ్యాస్ సరఫరా వల్ల సిలిండర్ల సమస్య తగ్గి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

◆ **కలెక్టర్ కె.హరిత**

**అసిఫాబాద్ మార్చి 9, (వుదయం ప్రతినిధి ):**







నిరుపేదల సంక్షేమంలో భాగంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం బారిగాం గ్రామంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండు పడకగదుల నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పన త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లను త్వరగా పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పూర్తి అయిన ఇండ్లలో విద్యుత్ సౌకర్యం, చిన్న పనులు, వీధి దీపాలు, తాగునీరు, మురుగు కాలువలు, అంతర్గత రహదారుల పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మొత్తం మంజూరైన 480 ఇండ్లకు 192 ఇండ్లు బేస్మెంట్ దశలో ఉండటానికి గల కారణాలను గృహ నిర్మాణ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన 288 ఇండ్లు తుది దశలో ఉన్నందున పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. అనంతరం కాగజ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు సన్నద్ధం అవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సిద్ధం చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు సబ్జెక్టులపై విద్యార్థులకు గల అనుమానాలను నివృత్తి చేస్తూ పరీక్షలు అంటే భయం లేకుండా చేయాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వంటశాల, తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు సులభంగా జీర్ణమయ్యే ఆహారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి ప్రకాష్ రావు, తహసిల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




# ఉత్సాహంగా సాగిన '5 కే రన్'

- **ఆరోగ్యం బాగుంటే అన్ని బాగుంటాయన్న నగర మేయర్ బుర్రి చైతన్ శ్రీనివాస్ రెడ్డి.**

**నల్గొండ. మార్చి 09 (వుదయం ప్రతినిధి)**
: "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం అమలులో భాగంగా సోమవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాల మైదానం నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన 5 కే రన్ ను నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటే అన్నీ ఉన్నట్లేనని, అందువల్ల ప్రతి ఒక్కరూ వారి వారి ఆరోగ్యాలపై దృష్టి సారించాలని కోరారు. ప్రతి ఒక్కరు ప్రతినిత్యం ఇంట్లో కాకుండా, బయటకు వచ్చి వాకింగ్ లేదా వ్యాయామం చేస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారు ఆ పథకాల లబ్ది పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యచరణ ప్రణాళికను చేపట్టిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకుప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ పథకాల్ని ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు."ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదు. ఆరోగ్యం బాగుంటే అన్ని బాగుంటాయి" అని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం చాలామంది లైఫ్ స్టైల్ సమస్యలతో బాధపడుతున్నారని, వాటిని దూరం చేసుకోవడానికి ఫిట్‌నెస్ అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వ్యాయామాన్ని భాగంగా చేసుకోవాలని, ప్రతిరోజూ శక్తి మేరకు నడక లేదా వ్యాయామం చేయాలని సూచించారు. 5 కె రన్ ను ఎన్జీ కాలేజీ నుండి క్లాక్ టవర్ వరకు కొనసాగించారు. అనంతరం మానవహారం నిర్వహించి రన్ లో పాల్గొన్న వారితో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్లు పెరిక స్వాతి , మామిడి కార్తీక్ డాక్టర్ పుల్లారావు, ప్రజాప్రతినిధులు, యువత అధికారులు. మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్నికీలల్లో గ్రేటర్ వరంగల్

## నిద్రపోతున్న అధికార యంత్రాంగం..!?

- తాజాగా గిర్మాజిపేటలో భారీ అగ్నిప్రమాదం.. బూడిదైన ఫర్నిచర్ షోరూమ్..
- ఇలాంటి ఘటనలు సర్వసాధరణంగా మారిన వైనం..
- ఫైర్ సేఫ్టీ గాలికి.. అనుమతులు కాగితాలకే పరిమితమనే ఆరోపణలు
- శాశ్వత పరిష్కారం వెతకడంలో అధికారుల నిర్లక్ష్యం..
- నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మరిన్ని అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం?





**వరంగల్, మార్చి 09 (వుదయం బ్యూరో చీఫ్ అంతడుపుల శ్రీనివాస్)**
చారిత్రక వరంగల్ నగరం అగ్నికీలగా మారుతోంది. నిబంధనల ఉల్లంఘనలు, అధికారుల నిర్లక్ష్యం తోడై అమాయక వ్యాపారులు, ప్రజల ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి. గిర్మాజిపేటలో గత శనివారం సంభవించిన భారీ అగ్నిప్రమాదం నగరంలో నెలకొన్న భద్రతా వైఫల్యాలకు అద్దం పడుతోంది. అగ్నిమాపక యంత్రాలు వచ్చేలోపే మంటలు ఆకాశాన్నంటడం, కనీస రక్షణ చర్యలు లేకపోవడం భయాందోళనకు గురిచేస్తోందని పలువురు స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

***గిర్మాజిపేటలో ఏం జరిగిందంటే..?**
నగరంలోని రద్దీ ప్రాంతమైన గిర్మాజిపేటలోని ఒక ప్రముఖ ఫర్నిచర్ షాపులో శనివారం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, లోపల ఉన్న మండే స్వభావం గల వస్తువుల వల్ల ప్రమాద తీవ్రత పెరిగింది. పక్కనే ఉన్న ఇతర దుకాణాలకు కూడా మంటలు వ్యాపించడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. గతంలో ఏజే మిల్స్ కాలనీ, అండర్ బ్రిడ్జి ప్రాంతాల్లో జరిగిన ఘటనలను మరిచిపోకముందే మరో ప్రమాదం జరగడం గమనార్హం.
అయితే ప్రమాదం జరిగిన ప్రతిసారీ "తనిఖీలు చేస్తాం.. చర్యలు తీసుకుంటాం" అని ప్రకటించే అధికారులు, ఆ తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
ఇక గ్రేటర్ వరంగల్ పరిధిలోని వందలాది వాణిజ్య సముదాయాలకు అసలు అగ్నిమాపక శాఖ అనుమతులే లేవు. ఉన్నా అవి ఏళ్ల క్రితం గడువు ముగిసినవే అనేది కాదనలేని సత్యంగా కనిపిస్తోంది. నిబంధనల ప్రకారం ప్రతి ఆరు నెలలకు ఒకసారి 'ఫైర్ సేఫ్టీ ఆడిట్' నిర్వహించాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో తనిఖీలు శూన్యంగా ఉంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారం. అనేక భవనాలు పార్కింగ్ కోసం కేటాయించాల్సిన సెల్లార్లను గోదాములుగా మార్చి, ప్రమాదకరమైన వస్తువులను నిల్వ చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం సంబంధితశాఖల నిర్లక్ష్యానికి నిదర్శనంగా పలువురు భావిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ లోని హన్మకొండ చౌరస్తా, బట్టల బజార్ వంటి ప్రాంతాల్లో షాపులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైకి విస్తరించాయి. కనీసం ఫైర్ ఇంజన్ వెళ్లడానికి కూడా దారి లేని పరిస్థితి నెలకొంది.
అనుమతులు ఇచ్చే సమయంలో నిబంధనలు పట్టించుకోని అధికారులు, ప్రమాదం జరిగినప్పుడు మాత్రం ఇరుకైన వీధుల సాకుతో కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పటికైనా మేల్కొంటారా...?**
తాజా ఘటన నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అధికారులు మరోసారి 'ప్రత్యేక తనిఖీలు' చేస్తామని ప్రకటిస్తున్నారు. అయితే, ఇది కేవలం తూతూమంత్రంగా సాగకూడదని, నిబంధనలు పాటించని మాల్స్, ఫర్నిచర్ షాపులను సీజ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. "నోటీసులు ఇవ్వడం.. మామూళ్లు తీసుకోవడం అధికారులకు అలవాటుగా మారింది. ప్రమాదం జరిగినప్పుడు వచ్చే హడావుడి మళ్ళీ కనిపించదు. శాశ్వత పరిష్కారం చూపకపోతే నగరం మరిన్ని ప్రమాదాలకు నిలయంగా మారుతుంది.



# నిరంతర అభ్యాసం

## ఆధునిక విద్యా బోధనకు పునాది

- **అధ్యాపకులకు నిరంతర అభ్యాసం అవసరం**
- **– కేయూ వీసీ ప్రొ. ప్రతాపరెడ్డి**

**సుబేదారి, మార్చి 09 (వుదయం ప్రతినిధి):**
ఆధునిక సాంకేతిక పరిణామాలతో ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యా రంగం కూడా విస్తృత మార్పులను అనుభవిస్తున్నదని, అలాంటి పరిస్థితుల్లో అధ్యాపకులు తమ బోధనా, పరిశోధనా విధానాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవడం అవసరమని కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి తెలిపారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక పరిణామాలను అవగాహన చేసుకొని ప్రపంచ స్థాయి పోటీలో నిలవాలంటే ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకునే దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. సోమవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "బోధనా విధానాలు, ప్రయోగశాల నిర్వహణలో గ్రీన్ సస్టైనబుల్ కెమిస్ట్రీ ఆవిష్కరణలు" అనే అంశంపై నిర్వహిస్తున్న 5 రోజుల ఉపాధ్యాయ అభివృద్ధి కార్యక్రమం ప్రారంభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో అమలవుతున్న జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలను సాధించాలంటే అధ్యాపకులు తమ బోధనలో నూతనతను తీసుకురావాల్సిన అవసరం ఉందని వివరించారు.ఈ కార్యక్రమంలో కీలక ఉపన్యాసం చేసిన అకాడమీ ఆఫ్ సైన్స్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్ర రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఉన్నత విద్యా వ్యవస్థలో కొత్త బోధనా పద్ధతులు ప్రవేశిస్తున్నాయని తెలిపారు. డిగ్రీ, పీజీ స్థాయిలో బోధన నిర్వహిస్తున్న అధ్యాపకులకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడంలో దోహదపడతాయని అన్నారు.తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ అధ్యక్షులు డాక్టర్ మోహన్ రావు, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సంజీవరెడ్డి, ట్రెజరర్ ప్రొఫెసర్ ఎస్. ఎం. రెడ్డి కూడా శాస్త్ర విజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అధ్యాపకులు తాజా పరిణామాలను తెలుసుకుంటూ బోధనలో కొత్త పద్ధతులను అనుసరించాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ 5 రోజులపాటు జరిగే ఈ ఉపాధ్యాయ అభివృద్ధి కార్యక్రమంలో ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ సాంకేతిక వినియోగం, పరిశోధనా దృక్పథం అభివృద్ధి వంటి అంశాలపై నిపుణులు ఉపన్యాసాలు ఇస్తారని తెలిపారు.కార్యక్రమంలో ప్రొఫెసర్ హనుమంతు, ప్రొఫెసర్ వాసుదేవ రెడ్డి, రసాయన శాస్త్ర విభాగం పూర్వాచార్యులు శ్రీహరి, జగన్నాథ స్వామి, ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన డిగ్రీ, పీజీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో కలెక్టర్ మెరుపు తనిఖీ

- **రోగులతో ముఖాముఖి.. వైద్య సేవలతో పాటు మందుల లభ్యతపై ఆరా గోదావరి తీరంలో పరిశీలన**
- **జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**ధర్మపురి,మార్చి 09(వుదయం ప్రతినిధి):**
ధర్మపురి పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సి.హెచ్.సి) జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలపై నేరు గా ఆరా తీశారు. ఆసుపత్రిలో ఓ.పి, ఐ.పి రికార్డులతో పాటు ల్యాబ్, ఫార్మసీ రికార్డులను కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.ప్రస్తుత సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, వైరల్ జ్వ



రాలకు సంబం ధించిన మందులు అందుబాటు లో ఉంచాలని సూచించారు. గడువు ముగిసిన మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని హెచ్చరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లతో మాట్లాడి, వారికి అందుతున్న భోజనం, తాగునీటి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వంట సామాగ్రిని వాడుతూ, రుచికరమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు.

**గోదావరి తీరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి**
ఆసుపత్రి తనిఖీ అనంతరం కలెక్టర్ గోదావరి నది తీర ప్రాంతాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించి అధికారు లకు పలు సూచనలు చేశారు.భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే పుణ్యక్షేత్రం కావడంతో గోదావరి తీరంలో ఎక్కడా చెత్త పేరుకుపో కుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ శుభ్రత పనులు నిర్వహిస్తూ, ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు.2027లో జరగను న్న గోదావరి పుష్కరాలను దృష్టి లో ఉంచుకుని స్నాన ఘాట్ల వద్ద పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాల ని, భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డిసిహెచ్ఎస్ సూపరిండెంట్ డా. రామకృష్ణ,సి హెచ్ సి సూపరింటెండెంట్ డా.రవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




# శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్

## భీమా చెక్కును అందజేసిన : మట్టా

**సత్తుపల్లి మార్చ్ 9 (వుదయం ప్రతినిధి)**
సత్తుపల్లి మున్సిపాలిటీలోని చెర్రీస్ మినీ ఫంక్షన్ లో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ భీమా చెక్కును రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ చేతులు మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమం సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు,శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్, భరణి పాడు సొసైటీ మాజీ చైర్మన్ కూరపాటి శ్రీనివాసరావు నాని సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# ఉత్సాహంగా సాగిన '5 కే రన్'

# ఉత్సాహంగా సాగిన '5 కే రన్'

**గద్వాల మార్చి 09 (వుదయం ప్రతినిధి)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వైయస్సార్ చౌరస్తా (పాత బస్టాండ్) నుండి గద్వాల్ పట్టణ పుర ప్రముఖ వీధుల గుండా 5కె రన్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి మాట్లాడుతూ గద్వాల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పట్టణ ప్రజలు ప్రతిరోజు చెత్త సేకరణకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరు చేసి అందజేయా లన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,చెత్తను రోడ్లపై పడేయకూడదని అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. యువత చెడు వ్యసనాలకు గురికాకుండా ప్రతిరోజు శారీరక వ్యాయామం చేస్తూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, డివైయస్ఓ కృష్ణ, మున్సిపల్ సిబ్బంది, వివిధ పాఠశాల కళాశాలల క్రీడాకారులు, క్రీడా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ భూమి.. అత్యధిక ఆదాయం

## 'సమగ్ర సాగు'తోనే రైతులకు లాభాల పంట!

- **తక్కువ భూమిలో పంట సాగు చేస్తే ఎక్కువ ఆదాయం పొందే అవకాశం**
- **రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన**
- **జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్ కుమార్**



**జయశంకర్ భూపాలపల్లి మార్చి 09(వుదయం జిల్లా ప్రతినిధి):**
తక్కువ భూమిలో రైతులు ఉద్యాన పంట సాగు చేస్తే ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉంటుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని రామచంద్రాపూర్ మరియు కైలాపూర్ గ్రామ శివారులో సోమవారం జిల్లా ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఏ.సునీల్ కుమార్ రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. అలాగే డ్రిప్ పరికరాల పనితీరుపై జైన్ డ్రిప్ కంపెనీ ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉద్యాన పంటల సాగులో రైతులు అనుసరించాల్సిన మెలకువలు మరియు పంటల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు అదేవిధంగా ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు.ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులు తక్కువ భూమిలో ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్ పామ్ వంటి ఉద్యాన పంటల సాగు ద్వారా మార్కెట్‌లో మంచి ధర లభించి రైతుల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే డ్రిప్ సాగు విధానాన్ని అనుసరించడం ద్వారా నీటి పొదుపు జరిగి పంటల ఉత్పత్తి పెరుగుతుందని వివరించారు.ఈ సందర్భంగా సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం ఎం ఐ డి హెచ్, తెలంగాణ సూక్ష్మ నీటి పారుదల పథకం, నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ పామ్ వంటి పథకాల ప్రాముఖ్యత మరియు వాటి ద్వారా రైతులకు లభించే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అదేవిధంగా రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని సూచించారు.కార్యక్రమం అనంతరం జైన్ డ్రిప్ కంపెనీ జోనల్ మేనేజర్ భవాని ప్రసాద్ రైతులకు డ్రిప్ వ్యవస్థ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వహణ పద్ధతులు మరియు నీటి పొదుపు ద్వారా పంటల ఉత్పత్తి పెంపు గురించి వివరించారు.అలాగే కార్యక్రమం అనంతరం తెలంగాణ ఉద్యాన మిషన్ పథకం కింద రైతులకు కూరగాయల మినీ కిట్లను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి రామాచారి, రామచంద్రాపూర్ సర్పంచ్, ఆయిల్ పామ్ ఇన్‌చార్జ్ వాసు, ఫినోలెక్స్ కంపెనీ ప్రతినిధి శ్యాం కుమార్, రైతులు వల్లకొండ లింగారెడ్డి, సమ్మిరెడ్డి, గంపల రమేష్, మధుకర్, సతీష్, ఆయిల్ పామ్ మండల ప్రతినిధులు సాయి, ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**సర్పంచ్ పగడాల రమాదేవి**



**దమ్మపేట మార్చి 9 (వుదయం ప్రతినిధి ):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా సోమవారం దమ్మపేటలో గల పశువుల ఆసుపత్రి నుంచి ఎన్టీఆర్ విగ్రహము వరకు గల ప్రధాన మెయిన్ రోడ్డు వెంబడి డ్రైనేజ్ కాల్వలో మన్ను మేటలు వేసి మురుగు నీరు రోడ్డు లెవెల్ కి పారుతున్న పరిస్థితి పై, దమ్మపేట గ్రామపంచాయతీ సర్పంచ్ పగడాల రమాదేవి మరియు పంచాయతీ పాలక వర్గం దృష్టి సారించి జేసిబి తో కాల్వలో ఉన్న మన్ను మేటలను తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్ కి తరలించారు. ఈ సందర్భంగా సర్పంచి రమాదేవి రాంబాబు పాలక వర్గ సభ్యులు మాట్లాడుతూ రోడ్డు వెంబడి షాపులు నిర్వహిస్తున్న వ్యాపారస్తులు డ్రైన్ పై ఉన్న బిల్లలను తీసి, అడ్డుగా ఉన్న సముదాయాలను తొలగిస్తే డ్రైన్లను శుభ్రం చేయడానికి సులువు అవుతది అని,
తీవ్రమైన కంపు, దోమల వలన వచ్చే మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, క్యాన్సర్ కారక వాతావరణం నుండి మనలను మనము కాపాడ కలుగుతామని అని తెలియజేశారు. గ్రామాభివృద్ధి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, చాట్ల శ్రీను, రూపా రాంబాబు, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, గ్రామస్తులు పండూరి వీరబాబు, తోట మల్లేశ్వరరావు, చిన్నశెట్టి గోపి, పంచాయతీ సిబ్బంది బసవయ్య, విజయ్, సింగ్,
గణేష్ తదితరులు ఉన్నారు.

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

## వినూత్న కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష

- **విద్యారంగంలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు వివరిస్తున్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల మార్చి 09 (వుదయం ప్రతినిధి)**
గట్టు బ్లాక్ ను సమగ్రంగా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా జోగులాంబ గద్వాల జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.నీతి అయోగ్ ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్ర ప్రదేశ్ లోని విశాఖపట్నంలో ఏ వన్ గ్రాండ్ కన్వెన్షన్ హాల్ లో రీజినల్ బెస్ట్ ప్రాక్టీస్ సెమినార్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కు ఎంపికైన గట్టు మండలంలో విద్యా రంగంలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను సెమినార్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గట్టు మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండేదని, విద్యా ప్రమాణాల లోపం వంటి సవాళ్లను జిల్లా పరిపాలన యంత్రాంగం గుర్తించి, వాటిని అధిగమించేందుకు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు తీసుకుంటున్న పలు వినూత్న కార్యక్రమాలను సెమినార్‌లో ప్రస్తావించారు. విద్యా రంగంలో చేపట్టిన చర్యలలో భాగంగా విద్యా వాలంటీర్ల నియామకం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, విద్యార్థుల కోసం ప్రేరణాత్మక, అవగాహన కార్యక్రమాలు, తల్లిదండ్రులతో నిరంతర సమన్వయం సమావేశాలు, బడి మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్చేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు, అలాగే విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయం కూడా పోషకాహారం అందించడం వంటి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.
ఈ చర్యల ఫలితంగా గట్టు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగడమే కాక పరీక్షలలో మంచి ఫలితాలను సాధించడం జరిగిందన్నారు. గట్టు మండలంలో రెండేళ్ల కిందట పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు 76 శాతం ఉండగా ప్రస్తుతం 10 శాతం ఫలితాలు అదనంగా సాధిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో 95 శాతానికి పైగా ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.ఈ సందర్భంగా జిల్లా పరిపాలన యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధుల సమిష్టి కృషి ఫలితంగా ఈ




విజయాన్ని సాధించగలిగినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా పరిపాలన యంత్రాంగం గట్టు బ్లాక్లో చేపట్టిన ఉత్తమ కార్యాచరణను అభినందిస్తూ నీతి అయోగ్ అదనపు కార్యదర్శి రోహిత్ కుమార్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కు మెమెంటో అందజేశారు. అనంతరం నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి రోహిత్ కుమార్ మాట్లాడుతూ గట్టు బ్లాక్ ను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి జోగులాంబ గద్వాల జిల్లా పరిపాలన యంత్రాంగం తీసుకుంటున్న సమగ్ర చర్యలు ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. సెమినార్ లో పాల్గొన్న ఆరు రాష్ట్రాల బృందాల నుంచి విద్యారంగంలో ఐదు రాష్ట్రాల ప్రతినిధులు ఉత్తమ ప్రదర్శన కనబరచగా అందులో తెలంగాణ రాష్ట్రం, జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన గట్టు బ్లాక్ కూడా ఉండడం గర్వకారణమని కొనియాడారు. అనంతరం దక్షిణ జోన్‌కు చెందిన పలు రాష్ట్రాల అధికారులు పాల్గొని తమ జిల్లాలలో అమలు చేస్తున్న ఉత్తమ కార్యాచరణలను పరస్పరం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నీతి అయోగ్ అదనపు కార్యదర్శి రోహిత్ కుమార్, డిప్యూటీ సీక్రెటరీ గౌరవ్ కటీయార్, ఆంధ్ర ప్రదేశ్ ప్లానింగ్ డిపార్ట్మెంట్ అనంత్ శేఖర్, వివిధ రాష్ట్రాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబును కలిసిన భీమ్ భరత్

## నవాబ్‌పేట్ మండల గ్రామాల అభివృద్ధికి నిధుల విజ్ఞప్తి

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పామేనా బీమ్ భారత్**



**చేవెళ్ల మార్చ్ 9 (వుదయం)**
చేవెళ్ల నియోజకవర్గం నవాబ్‌పేట్ మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ పామేన భీమ్ భరత్ తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నవాబ్‌పేట్ మండలంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి కి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ వినతిపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్‌కు సూచించినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటయ్య, నవాబ్‌పేట్ సర్పంచ్ నరసింహ రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పెంట రెడ్డి, పులుమామిడి సర్పంచ్ నర్సింలు, నరేగూడ సర్పంచ్ దశరథ్, చించల్‌పేట్ సర్పంచ్ అనంతరాములు, యావాపూర్ సర్పంచ్ లక్ష్మణ్, తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ ప్రభాకర్ గంగ్యాడ సర్పంచ్ మల్లేష్ పూలపల్లి శ్రీనివాస్ రెడ్డి మహేందర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి శ్రీనివాస్ అమీర్ ఖాన్, మిరాజ్, పాండు రంగారెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు విద్యా– క్రీడా సామగ్రి పంపిణీ

**సంగారెడ్డి , వుదయం**




సంగారెడ్డి జిల్లాలోని పటాన్చెరు మండలంలోని ఎంపీ యూపీఎస్ చిన్న కంజర్ల, ఎంపీపీ ఎస్, జెడ్పిహెచ్ఎస్ పెద్ద కంజర్ల మరియు యూపీఎస్ ఇంద్రేశం పాఠశాలల్లో పార్కర్ హనీ ఫిన్ ఇండియా సంస్థ సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు మరియు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, బెల్ట్, టై, షూస్, కంపాస్ బాక్స్, పెన్, పెన్సిల్, లైబ్రరీ పుస్తకాలు తదితర విద్యా సామగ్రిని అందజేశారు.మెడ్వాన్ డైరెక్టర్ హెచ్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలోని పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని తమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, తాము ఎంపిక చేసిన పాఠశాలల్లో గణనీయమైన మార్పు వచ్చిందని అన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.మూడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు ఎంతో మంచి సహకారం అందిస్తోందని తెలిపారు. ఈ సేవల వల్ల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచుకుంటున్నారని చెప్పారు. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల తరపున మెడ్వాన్ డైరెక్టర్ హెచ్. మధుసూదన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. పిల్లలను తప్పకుండా పాఠశాలకు పంపడం తల్లిదండ్రుల బాధ్యత అని, ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్. మధుసూదన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే పార్కర్ కోఆర్డినేటర్ హఫీజ్, ఆమదాయ్య కోఆర్డినేటర్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖేడ్ లో పిడిఎఫ్ బియ్యం అక్రమ దందా

**నారాయణఖేడ్, వుదయం**



పేదలుకడుపునిండా తినాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత బియ్యాన్ని ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సరఫరా చేస్తున్నారు. మండల నియోజక వర్గం లో పిడిఎఫ్ అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. ప్రతి నెల రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని పలు దుకాణా ద్వారాలు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు విక్రయిస్తున్నరని ఆరోపణలు ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. గ్రామాలలో ద్విచక్ర వాహనాల తరలించి గ్రామాలలో లబ్ధిదారుల వద్ద తక్కువ రేటుకు కొను గోలు చేసి నారాయణఖేడును అడ్డగా మార్చుకొని ఈ పిడిఎఫ్ బియ్యం దందా జోరుగా సాగిస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలను అరికట్టే అధికారులు నిమ్మకు నీరు ఎత్తనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలలో వినిపిస్తున్న మాట. ఈ దందాను అరికట్ట లేకపోతున్నా అధికారులు తమ కుర్చీ లకే పరిమితం అవుతున్నారు. ఎక్కడ తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఎవరైనా సమాచారం ఇస్తే తప్ప తనిఖీలు చేయరు. వచ్చే నెల నుండి మూడు నెలల బియ్యం ఒకే సరి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారు. మూడు నెలల బియ్యం లబ్ధిదారులు ఒకే సరి అమ్ముకునే అవకాశాలున్నాయని అధికారులు దీనిపై ప్రత్యేకదృష్టిపెట్టి పిడిఎఫ్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థులకు పరీక్ష కిట్స్ అందించిన ఎచ్ ఎచ్ 4పూర్ సంస్థ

**జహీరాబాద్, వుదయం**




హెల్పింగ్ హ్యాండ్స్ 4 పూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో న్యాల్కల్ మండలలోని జడ్పీ ఎచ్ ఎస్ మీర్జాపుర(బి) మరియు జహీరాబాద్ మండలం లోని అల్గోల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 98 మంది విద్యార్థులకు రూ.15వేల విలువచేసే ఎగ్జామ్ పాడ్, జామెంట్రీ బాక్స్, పెన్స్ ను విద్యార్థులకు అందజేయడం జరిగింది.విద్యార్థులకు అందజేసినటువంటి వస్తువులు ఎంతో ఉపయోగకరంగా ప్రోత్సాహకరంగా ఉంటాయని ప్రాజెక్ట్ డైరెక్టర్ భరత్ కుమార్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.రాజ్ కుమార్ ఎచ్ ఎం.ఉమారాణి సంస్థ సభ్యులు వెంకట్ రాంరెడ్డి, సందీప్ ముదిరాజ్, చేతన్ చించోలి, ధన్నారం కార్తీక్, రవి కుమార్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం

## సర్పంచ్ గారే విజయ లక్ష్మి శంకర్ జయశంకర్

**భూపాలపల్లి, వుదయం:**



ముఖ్యమంత్రి సహాయనిధి పేద కుటుంబాలకు ఒక వరం అని పలుగుల గ్రామ సర్పంచ్ గారే విజయ లక్ష్మి శంకర్ అన్నారు మహాదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో సర్పంచ్ గారే విజయ లక్ష్మి శంకర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు దానిలో భాగంగా గ్రామానికి చెందిన లబ్ధిదారులైన మంద రమేష్, నిట్టూరి అరవింద్, ఒద్ది చంద్రయ్య, లకు చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఒక వరం అని, పేద కుటుంబాలు వైద్యకోసం దరఖాస్తు చేసిన వెంటనే రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు అవుతున్నాయని అన్నారు అన్ని రంగాలను మంథని నియోజకవర్గని అభివృద్ధి చేయడంలో మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీను బాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఒద్ది చంద్రయ్య, మాజీ సర్పంచ్ మచ్చ రాజయ్య,కాంగ్రెస్ పార్టీ పలుగుల గ్రామ శాఖ అధ్యక్షుడు మాజీ ఉపసర్పంచ్ మానేం మహేష్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి నిట్టూరి సంతోష్ లతోపాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 96 దరఖాస్తుల స్వీకరణ



**గద్వాల, వుదయం**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయములోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 96 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్లలో బీసీ హక్కుల సాధన కమిటీ ధర్నా

## 50% రిజర్వేషన్లకు డిమాండ్

### పీటీసీ జెడ్పిటిసి ఎన్నికల్లో 50% రిజర్వేషన్ కల్పించాలి

**చేవెళ్ల, వుదయం**




చేవెళ్ల మున్సిపాలిటీ లోని బీసీ హక్కుల సాధన కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బీసీ సంఘం నాయకులు సోమవారం ధర్నా చేసి శాంతియుతంగా నిరసన తెలిపి ఎమ్మార్వో బి.కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు పడమటి వెంకటయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి బీసీ సంఘం రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు ఎం. ప్రభులింగం, సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు బానోదు సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీసీ వర్గాల హక్కుల సాధన కోసం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్చేశారు.చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జెడ్పిటిసి మరియు ఎంపీటీసీ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా బీసీ సంక్షేమ శాఖను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో బీసీనాయకులు పాపయ్య, మాధవి, జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, ఇతర బీసీ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# పల్లె ప్రకృతి వనాలను వినియోగంలోకి తీసుకురావాలి..

## మండల అభివృద్ధి అధికారి జి. కిషన్..

**రాయపర్తి, వుదయం:**



మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను త్వరితగతిన పూర్తిచేసి,ప్రజలకుఅందుబాటులోకి తీసుకురావాలని రాయపర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. కిషన్ ఆదేశించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, బుధవారం ఆయన రాయపర్తి గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ, పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ వనాలను ఏర్పాటు చేసిందని, ప్రతి గ్రామంలోనూ వీటిని ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేసి, ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ముఖ్య అంశాలు:పచ్చదనం – పరిశుభ్రత: మొక్కల పెంపకం, సంరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదు.నిరంతర పర్యవేక్షణ: 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రోజూ పనుల పురోగతిని సమీక్షించాలి. ప్రజా భాగస్వామ్యం: పల్లె ప్రకృతి వనాలను గ్రామస్థులు ఆహ్లాదకరంగా మార్చుకునేలా చూడాలి. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాష్, రాయపర్తి సర్పంచ్ సహేంద్ర బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్, వార్డ్ మెంబర్ పిరని రాజబాబు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి..

## మహదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మహదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు అన్నారు, సోమవారం మహాదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చుట్టూ ఉన్న వారిని కూడా విద్యార్థులు జాగృతం చేయాలన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఎక్కువ శాతానికి పైగా సైబర్ నేరాలు జరుగుతున్నట్లు తెలిపారు ముఖ్యంగా సోషల్ మీడియాలో వెంబడించడం (సైబర్ స్టాకింగ్), నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించడం, అలాగే వివాహ సంబంధాల పేరుతో జరిగే మోసాలు వంటి నేరాల గురించి విద్యార్థులకు వివరించారు.సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, అనుమానాస్పద సందేశాలు, ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు వస్తే వెంటనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే ఎవరి పేరుతోనైనా నకిలీ సోషల్ మీడియా అకౌంట్లు సృష్టించి వేధిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అదే క్రమంలో మహాదేవపూర్ ఎస్సై 2 సాయి శశాంక్ మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడినప్పుడు వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ కు ఫోన్ చేయడం లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులు అయిన వేల

**నారాయణఖేడ్, వుదయం**



నారాయణఖేడ్ మండల పరిధిలోని పిప్రి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ తోటి విద్యార్థులకు విద్య బోధన చేశారు. ప్రతిరోజు పుస్తకాలతో కుస్తీ పట్టి చదువుకునే విద్యార్థులు సోమవారం పిప్రి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా కొలువుదీరారు. నిత్యం పాఠశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు పోటీ తత్వంతో చదువులు చెప్పారు. తమలో ఉన్న నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు స్వయం పాలన దినోత్సవని వేదికగా చేసుకొని చదువులు చెప్పారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించిన ఉపాధ్యాయులకు గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదనన్నారు.

# పల్లె ప్రకృతి వనంలో పరిసరాల పరిశుభ్రత



**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం సర్పంచ్ హసీనాబానో అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి తడి చెత్త పొడి చెత్త మరియు ప్లాస్టిక్ వ్యర్థాలు పాడుబడ్డ కూలర్లు మరియు ప్లాస్టిక్ వస్తువులు సేకరించడం జరిగింది. అదేక్రమంలో పల్లె ప్రకృతి వనంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు.

# గ్రామపంచాయతీ ఆబాది భూములను గుర్తించి హద్దులు చూపించాలని ప్రజావాణిలో వినతి

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అన్నారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఆబాది భూములను గుర్తించి సర్వే చేసి హద్దులు చూపించాలని అన్నారం గ్రామ సర్పంచ్ ప్రభాకర్ సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఆబాది భూములపై స్పష్టత లేకపోవడంతో భవిష్యత్తులో వివాదాలు తలెత్తే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ముఖ్యంగా మహిళా సంఘం భవనం మంజూరైనప్పటికీ భూమి గుర్తింపు లేకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభించలేకపోతున్నామని వివరించారు ఈ సమస్యపై అదనపు కలెక్టర్‌ను కలిసి వివరించగా ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ నీర్ల ప్రభాకర్ తెలిపారు.

# నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలి

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా పనులు చేపట్టాలని రాపల్లి కోట గ్రామ సర్పంచ్ కళ్ళగట్టయ్య అన్నారు సోమవారం రాపల్లికోట గ్రామంలో గ్రామ సర్పంచ్ కళ్ళగట్టయ్య ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణం కొరకు మార్కౌట్ ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణం నిబంధనలకు లోబడి పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు, ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ చైర్మన్ రాజయ్య,ఉప సర్పంచ్ మహేష్, గ్రామ కార్యదర్శి ప్రసాద్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు సింహస్వప్నంగా మరిన జెన్-జీ యువత



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతున్న పేరు 'జెన్–జీ' అసలు ఎవరీ జెన్–జీ..? వీరు ఏం కోరుకుంటున్నారు..? అగ్రరాజ్యాల అండతో సామాన్యులను పీడిస్తున్న ప్రభుత్వాలకు వీరి పేరు వింటేనే ఎందుకు వణుకు పుడుతోంది..? ఈ అంశాలను పరిశీలిస్తే, గత రెండేళ్లుగా వివిధ దేశాల్లో వచ్చిన రాజకీయ విప్లవాల వెనుక ఉన్న యువశక్తి మనకు అర్థమవుతుంది. సాధారణంగా 1995 నుండి 2005 మధ్య జన్మించిన వారిని 'జెన్–జీ' తరం అని పిలుస్తారు. ప్రస్తుతం వీరు 20 నుండి 30 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు. వీరి ఆలోచనా విధానం గత తరాల కంటే భిన్నంగా ఉంది. తమ దేశాల్లో పేదరికం ఎందుకు ఉంది..? కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం సామాన్యుడికి ఎందుకు అందడం లేదు..? చదువుకున్న వారికి ఉపాధి ఎందుకు లేదు..? పేదవాడు ఇంకా పేదవాడిగా, ధనవంతుడు మరింత ధనవంతుడిగా ఎలా మారుతున్నాడు..? వంటి ప్రశ్నలను వీరు సంధించడం మొదలుపెట్టారు. దానికి కారకులైన పాలకులను తమ తమ దేశాల నుండి పారిపోయేలాగా తిరుగుబాటు చేశారు. వీరందరినీ జెన్ జి జనరేషన్ గా పిలువబడ్డారు. వీరు ఈ మధ్య కాలంలో మూడు దేశాలలో చరిత్ర తిరగరాసినారు. అందుకే జెన్ జి జెనరరేషన్ అంటే సామ్రాజ్య వాద దేశాలకు కొమ్ము కాస్తూ ఆ దేశం సంపద మొత్తం కొంత ధనవంతులకు చేతిలోనే పోగు చేసే ప్రభుత్వాలకు వణుకుపడుతుంది.శ్రీలంక, బంగ్లాదేశ్, నేడు జపాన్ వంటి దేశాల పరిణామాలను చూస్తే, అక్కడి పాలకులు అవినీతితో దేశ సంపదను కొద్దిమంది ధనవంతుల చేతుల్లో పెట్టడాన్ని జెన్–జీ సహించ లేక పోయింది. ఈ యువత కోరుకునేది కేవలం అధికారం కాదు, ఒక పారదర్శకమైన వ్యవస్థ. వారి అవినీతి రహిత పాలన కోరుకుంటున్నారు. దేశ వనరులపై కొద్దిమంది ఆధిపత్యం నశించాలని, సమాన హక్కులు, ప్రకృతి వనరులు అందరికీ సమానంగా అందాలని కోరుకుంటున్నారు. మౌలిక సదుపాయాలైన ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని, కులం, మతం, ప్రాంతం అనే తేడాలు లేని సమానత్వం కావాలని భావిస్తున్నారు. మానవ వనరులను వృథా చేయకుండా, దేశాన్ని చైనా వంటి అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టే నాయకత్వం కావాలననేది వారి సంకల్పంగా కనిపిస్తుంది. బంగ్లాదేశ్, జపాన్ లలో జెన్–జీ యువత సాయుధ పోరాటాలు చేయలేదు. కానీ ప్రజలను చైతన్యపరచడంలో అద్భుత విజయం సాధించారు. శతాబ్దాల కాలంగా పాతుకుపోయిన రాజకీయ పార్టీలను సైతం మట్టికరిపించారు.ఈ ప్రకృతి వనరులమీద ఆధిపత్యం ఉంది కొంత మందికి మంత్రమే ఇలా విలాస వంతమైన జీవితం ఉంది మాకెందుకు లేదు..? అందరికీ ఈ దేశ పకృతి వనరుల మీద హక్కు కావాలి అని అడుగుతున్నారు. మానవ వనరులు వృధా చేయకుండా మా దేశం అభివృధి కోసం మా దేశ యువకుల మానవ వనరులు ఉపయోగించి మా దేశాన్ని అభివృధి చెందిన చైనా లాంటి దేశాల సరసన నిలబెట్టే ప్రభుత్వాలు కావాలని కొరుకుతున్నారు. నేడు జఫాన్ లో ఎన్నికల వివరాలు చూస్తే అర్థం అవుతుంది మొత్తం జపాన్ దేశం 275 పార్లమెంట్ స్థానాలు ఉంటే 165 స్థనాలకు ఎన్నికలు జరుగుతాయి మిగతావి నామినేట్ స్థానాలుగా ఉంటాయి. 165 స్థానాల్లో ఎన్నికలు జరిగితే 110 స్థానాల్లో గెలిపించి, 35 సంవత్సరాలు వయసు కలిగిన ఒక యువ గాయకున్ని నేడు ప్రధానమంత్రి కుర్చీలో కూర్చోబెట్టారు జెన్ జి యువత . జెపాన్ దేశంలో 67 రాజకీయ పార్టీలు ఎన్నికల బరిలో ఉండగా 30 సంవత్సరాల పరిపాలన అనుభవం కలిగిన కాంగ్రెస్ పార్టీకి 10 సీట్లు గెలిచింది.ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. మిగతా అన్ని పార్టీలు 5,6 7, సీట్లకు పరిమితం ఐనావి ప్రజల్ని చైతన్యం చేసి ఓట్లు వేపియటం మే కాదు . పోరాటాల్లో కూడా జెన్– జి వెనకడుకు వేయటం ఒక్క నేపాల్ దేశం లోనే గత ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న నిరసన కారుపై ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో 70 మంది అమరులు అయ్యారు. ఐన పట్టు విడవకుండా మొక్క మాంక్ ధైర్యం తో మన దేశం లో భగత్ సింగ్ లాగా దేశంలో పేద ప్రజల ను పట్టి పీడిస్తున్న సామ్రాజ్యం వాదం రంగు పులుము కొని ఉన్న పెట్టుబడి దారి ప్రభుత్వలను గద్దె దింపటం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా జెన్ – జి యువత ప్రాణాలు ప్రాణంగా పెట్టి పోరాడుతుంది. కాబట్టి జెన్ జి అంటే ప్రపంచంలో ఉన్న పెట్టుబడి దారి దేశాలకు వణుకుపడుతుంది. నేడు భారతదేశంలో ఉన్న జెన్ – జి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది ఈ దేశంలో ఉన్న ప్రభుత్వాలు ఎవరి కోసం పనిచేస్తున్నాయి. రోజురోజుకి ఎవ్వరు ఆస్తులు పెరిగిపోతున్నాయి. కొట్లాదిమందికి తినటం కోసం తిండీ లేదు. కానీ ఒక్కరు ఉండటం కోసం 25 అంతస్తుల భవనం ఎలా ఉంది..? అనే అనేక ప్రశ్నలకు సమాధానం వెతికే పని నేడు భారతదేశంలో ఉన్న జెన్–జి యువత ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది.

# చక్కని ఆరోగ్యం

## అల్లం, నిమ్మరసాన్ని తాగితే జరిగేది ఇదే



అల్లాన్ని వేల సంవత్సరాలుగా వంటల్లో, ఔషధాల్లో వినియోగిస్తున్నారు. ఇది యాంటీఆక్సిడెంట్, రక్త శుద్ధికి తోడ్పడుతుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. సిడ్నీ విశ్వవిద్యాలయం పరిశోధనల ప్రకారం, అల్లం షుగర్ నియంత్రణకు తోడ్పడుతుంది. నిమ్మరసంతో కలిపి అల్లం పానీయం తీసుకుంటే.. బరువు తగ్గించడంతో పాటు చర్మ సౌందర్యాన్ని పెంచి, అనేక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ప్రకృతి ప్రసాదించిన అత్యంత శక్తివంతమైన వనమూలికలలో అల్లం ఒకటి. భారతీయులు దాదాపు వేల సంవత్సరాలుగా అల్లాన్ని తమ సంప్రదాయ వైద్యంలో, వంటకాల్లో భాగంగా చేసుకున్నారు. అల్లంలో అనేక విలువైన పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అల్లంలో జింజెరోల్ అనే ముఖ్యమైన బయోయాక్టివ్ సమ్మేళనం ఉంటుంది. దీంతోపాటు.. విటమిన్ సి, బి6, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్.. తోపాటు.. యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి శరీర ఆరోగ్యానికి ఎంతో కీలకం. అందుకే.. అల్లంతో అద్భుతమైన వైద్యం చేయవచ్చని చెబుతారు ఆయుర్వేద వైద్యులు.. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడం నుంచి.. వికారం, కీళ్ల నొప్పులు, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అల్లం ఒక మంచి ఔషధంగా పనిచేయడమే కాకుండా, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ గా కూడా ప్రసిద్ధి చెందింది. ఇది రక్త శుద్ధికి తోడ్పడుతుంది, రక్తనాళాలలో రక్తం గడ్డకట్టకుండా సహాయపడుతుంది. క్రమం తప్పకుండా అల్లం వాడటం వలన కొన్ని వారాల్లో కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. అల్లం కడుపులో పూత ఏర్పడకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. అలాగే, ఇది నోటి దుర్వాసనను సమర్థవంతంగా పోగొట్టి, నోటిలో చేరిన ప్రమాదకర బ్యాక్టీరియాను సంహరించి దంతాలను ఆరోగ్యముగా ఉండేలా చేస్తుంది. సిడ్నీ విశ్వవిద్యాలయం పరిశోధనల్లో అల్లం షుగర్ జబ్బు నియంత్రణ చేయగలిగిన శక్తివంతమైన ఔషధంగా వెల్లడైంది. అల్లం రక్తములోని చక్కెరలు కండరాలకు చేరే ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా మధుమేహ నిర్వహణలో సహాయపడుతుంది. అజీర్తితో బాధపడుతున్న వారికి అల్లం సేవించడం వల్ల ఉపశమనం కలుగుతుంది. ఉదరంలో గ్యాస్ ఏర్పడినప్పుడు అల్లం దివ్యౌషధంలా పనిచేస్తుంది. దగ్గు, జలుబు, కఫం వంటి శ్వాసకోశ సమస్యలకు అల్లం అమృతంలా పనిచేస్తుందని అనడంలో సందేహం లేదు. ఇది జీర్ణక్రియ సాఫీగా జరిగేలా ఉపయోగపడుతుంది. నిమ్మకాయ, మంచి సువాసన మరియు రుచి కలిగిన సిట్రస్ జాతికి చెందిన పండు. దీనికి ఉన్న యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు, అధిక విటమిన్ సి కంటెంట్ ఆరోగ్యానికి చాలా ఉపయోగపడుతుంది. నిమ్మలో పుష్కలంగా ఉండే విటమిన్ సి, అనేక అనారోగ్య సమస్యలకు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. నిమ్మ వలన జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. అజీర్ణం వలన ఏర్పడిన గ్యాస్, ఎసిడిటీ లాంటి సమస్యలకు నిమ్మరసం ఎంతో మేలు చేస్తుంది. నిమ్మ, అల్లం కలిపిన పానీయం రోజువారీ తీసుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఈ పానీయాన్ని తయారుచేయడానికి, అల్లాన్ని శుభ్రంగా కడిగి, దంచి ఒక గ్లాసు నీళ్ళల్లో మరిగించి, దానికి ఒక నిమ్మకాయ రసం కలిపి రోజూ తీసుకోవాలి. నిమ్మలో ఉన్న విటమిన్ సి కొవ్వును కరిగించి బరువు తగ్గించేందుకు సహాయపడుతుంది. అల్లం కూడా శరీరంలోని ఫ్యాట్‌ను కరిగిస్తుంది.

## మూత్రం వస్తున్నా ఆపుకుంటున్నారా..?

నేటి వేగవంతమైన జీవితంలో.. చాలా మంది పని, ప్రయాణం లేదా బిజీ షెడ్యూల్ కారణంగా ఎక్కువసేపు మూత్రాన్ని బిగపట్టి ఉంచుకుంటారు.. ఈ అలవాటు అలా కొనసాగుతూనే ఉంటుంది.. అయితే.. ప్రజలు దీనిని సాధారణమని భావించి తరచుగా దీనిని విస్మరిస్తుంటారని.. కానీ, ఈ అలవాటు చాలా ప్రమాదమని, ఇది క్రమంగా అనారోగ్యం బారిన పడేలా చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేటి వేగవంతమైన జీవితంలో.. చాలా మంది పని, ప్రయాణం లేదా బిజీ షెడ్యూల్ కారణంగా ఎక్కువసేపు మూత్రాన్ని బిగ పట్టి ఉంచుకుంటారు.. ఈ అలవాటు అలా కొనసాగుతూనే ఉంటుంది.. అయితే.. ప్రజలు దీనిని సాధారణమని భావించి తరచుగా దీనిని విస్మరిస్తుంటారని.. కానీ, ఈ అలవాటు చాలా ప్రమాదమని, ఇది క్రమంగా అనారోగ్యం బారిన పడేలా చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



మూత్రవిసర్జన శరీరం నుండి అదనపు నీటిని, వివిధ విషాలను తొలగిస్తుంది. సమతుల్యతను కాపాడుకోవడానికి ఈ ప్రక్రియ చాలా అవసరం. ఎక్కువసేపు మూత్రాన్ని పట్టి ఉంచడం వల్ల శరీర సహజ ప్రక్రియలు దెబ్బతింటాయి. కొంతమంది దీనిని తేలికగా తీసుకుంటారు.. కానీ పదే పదే మూత్రం ఆపుకోవడం లేదా బిగపట్టుకోవడం వల్ల క్రమంగా ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. శరీరం ఇచ్చే సంకేతాలను విస్మరించడం మంచిది కాదు. సమయానికి బాత్రూమ్‌కు వెళ్లడం వల్ల శారీరక సాధారణ పనితీరు కొనసాగుతుంది. అందువల్ల, భవిష్యత్తులో సమస్యలను నివారించడానికి మూత్రం ఆపడం లేదా బిగపట్టడం వల్ల కలిగే హానిని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఎక్కువసేపు మూత్రాన్ని పట్టి ఉంచడం వల్ల శరీరంపై అనేక ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. మూత్రాశయంలో మూత్రం ఎక్కువసేపు నిలిచి ఉన్నప్పుడు, ఒత్తిడి పెరిగి, మూత్రాశయ కండరాలు ఒత్తిడికి గురవుతాయి. కొన్ని సందర్భాల్లో, ఈ అలవాటు మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని పెంచుతుంది. ఎక్కువసేపు మూత్రా న్ని పట్టి ఉంచడం వల్ల బ్యాక్టీరియా పెరుగుదల కూడా పెరుగుతుంది. అదనంగా, పదే పదే మూత్ర విసర్జన చేయడం వల్ల మూత్రాశయం సరిగ్గా ఖాళీ అయ్యే సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. కొంతమందికి పొత్తి కడుపులో నొప్పి లేదా అసౌకర్యం కలగవచ్చు. ఈ అలవాటు ఎక్కువ కాలం కొనసాగితే, అది మూత్రపిండాల సమస్యల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందువల్ల, ఎక్కువసేపు మూత్రాన్ని ఆపడం మంచిది కాదు.. శరీరం సంకేతాలు ఇచ్చిన సమయానికి బాత్రూమ్‌కు వెళ్లడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. కొన్నిసార్లు, వెంటనే బాత్రూమ్‌కి వెళ్లడం సాధ్యం కాని పరిస్థితి తలెత్తవచ్చు.. రు మూత్రాన్ని కొంతసేపు ఆపవలసి రావచ్చు. అలాంటి సందర్భాలలో, శరీరాన్ని విశ్రాంతి తీసుకోవడానికి, ఒత్తిడిని నివారించడానికి ప్రయత్నించండి. వీలైతే, నిశ్శబ్దంగా కూర్చోవడానికి ప్రయత్నించండి. ఎందుకంటే అధిక కదలిక మూత్రా శయంపై ఒత్తిడిని పెంచుతుంది.

## ఉదయాన్నే ఇలా చేస్తున్నారా?

చర్మం ఆరోగ్యంగా ఉండాలి, మెరిసిపోవాలి అనే కదా ఏ అమ్మాయైనా కోరుకునేది? అది సాధ్యమవ్వాలంటే తగిన జాగ్రత్తలూ తీసుకోవాలి.



ముఖ్యంగా ఉదయం కొన్నింటిపై దృష్టిపెట్టాలి. మీ డే రొటీన్‌లో అవి ఉన్నాయేమో చూసుకోండి మరి! ఉదయాన్నే చల్లని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. నీళ్లు కొంచెం ఎక్కువ చల్లగా ఉండేలా చూసుకోవడం తప్పనిసరి. ఇది చర్మకణాలకు ఆక్సిజన్ సరఫరా, రక్తప్రసరణ మెరుగ్గా జరిగేలా చేస్తుంది. లేచిన పావుగంటలోపు ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తాగండి. గంటలపాటు నిద్రలో గడిపేస్తాం. ఈ క్రమంలో శరీరం డీహైడ్రేషన్‌కి గురవుతుంది. నీళ్లు తాగితే తిరిగి హైడ్రేట్ అవ్వడమే కాదు, మలినాలూ బయటికి పోతాయి. నిమ్మకాయ, కాస్త ఉప్పు చేర్చుకుంటే కోల్పోయిన ఎలక్ట్రోలైట్లని తిరిగి పొందొచ్చు. ఇది చర్మాన్నీ తేమగా కనిపించేలానూ చేస్తుంది. 3–5 నిమిషాలు ముఖాన్ని మసాజ్ చేయండి. ఏదైనా నచ్చిన నూనె తీసుకుని, ముఖమంతా వృత్తాకారంలో మర్దనా చేసుకున్నా మంచిదే. మాయిశ్చరైజర్ తప్పక రాయండి. విటమిన్ సి ఉన్నవి వాడితే మేలు. ఇది చర్మాన్ని మెరిపించడమే కాదు, ఎండతోనూ పోరాడుతుంది. అలాగని సన్‌స్క్రీన్‌ని మాత్రం నిర్లక్ష్యం చేయొద్దు. చర్మ ఆరోగ్యమ్మీద వ్యాయామాలు చూపే ప్రభావమూ ఎక్కువే. కాబట్టి, అల్పాహారానికి ముందు 10–15 నిమిషాలు తప్పక వ్యాయామం చేయాలి. ఇదీ చర్మానికి ఆక్సిజన్, పోషకాలు అందేలా చూడగలదు. సెల్ రిపేరింగ్‌కీ సాయపడుతుంది. చెమట ద్వారా విషపదార్థాలు బయటకు వచ్చేలానూ చేస్తుంది. చర్మంలో కొలాజెన్ ఏర్పడటానికి అమైనో యాసిడ్లు ప్రధానం. అది అందాలంటే ప్రొటీన్ ఆధారిత ఆహారం అంటే గ్రీక్ యోగర్ట్, చేప, ప్రొటీన్ స్మూతీలు, గుడ్లు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటారుగా మరి.

## అన్నం తిన్నాక పండ్లు తింటే ఏమవుతుంది..?

పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అందరికీ తెలుసు. కానీ రు వాటిని తినే సమయం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని కు తెలుసా? చాలామంది భోజనం ముగిశాక డెజర్ట్‌గా పండ్లను తింటుంటారు. అయితే ఇది అమృతమా లేక జీర్ణవ్యవస్థకు శాపమా? భోజనం తర్వాత వెంటనే పండ్లు తింటే కడుపులో ఏం జరుగుతుంది? పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నది కాదనలేని సత్యం. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే పండ్లు మనల్ని రోగాల నుండి రక్షిస్తాయి.



అయితే చాలామంది భోజనం ముగిసిన తర్వాత డెజర్ట్ లాగా పండ్లను తింటుంటారు. మరి ఇలా భోజనం తర్వాత వెంటనే పండ్లు తినడం సరైనదేనా? దీనివల్ల జీర్ణవ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుంది? సాధారణంగా పండ్లలో ఉండే సహజ చక్కెరలు, ఫైబర్ చాలా త్వరగా జీర్ణమవుతాయి. కానీ మనం తినే భారీ భోజనంలోని ప్రోటీన్లు, కొవ్వులు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. భోజనం తర్వాత వెంటనే పండ్లు తింటే, అవి జీర్ణకోశంలో భోజనంతో కలిసిపోయి జీర్ణ ప్రక్రియను మందగింపజేస్తాయి. దీనివల్ల కొంతమందిలో గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా ఐబీఎస్ లేదా ఫ్రక్టోజ్ అసహనం ఉన్నవారు భోజనం తర్వాత పండ్లు తింటే అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉంది. భోజనంతో పాటు పండ్లు తింటే పోషకాలు అందవని చాలామంది నమ్ముతుంటారు. కానీ ఇందులో నిజం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మానవ జీర్ణవ్యవస్థ ఆహారం నుండి గరిష్ట పోషకాలను గ్రహించేలా రూపొందించబడింది. చిన్న ప్రేగు చాలా పొడవుగా ఉండి, పోషకాలను నెమ్మదిగా, సమర్థవంతంగా గ్రహిస్తుంది. కాబట్టి భోజనం తర్వాత పండ్లు తిన్నా పోషకాల లోపం ఏర్పడదు. అన్ని పండ్లు భోజనం తర్వాత ఇబ్బంది కలిగించవు. కొన్ని పండ్లు జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. బొప్పాయి, పైనాపిల్‌లో ఉండే ఎంజైమ్‌లు మనం తిన్న ఆహారంలోని ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడతాయి. కివి, బెర్రీలు కూడా భోజనం తర్వాత సులభంగా జీర్ణమై, శరీరానికి మేలు చేస్తాయి. కు జీర్ణ సంబంధిత సమస్యలు ఏవీ లేకపోతే భోజనం తర్వాత పండ్లు తీసుకోవచ్చు. అయితే పండ్ల నుండి పూర్తి ప్రయోజనం పొందాలనుకుంటే, భోజనానికి గంట ముందు లేదా రెండు గంటల తర్వాత తీసుకోవడం ఉత్తమ వ్యూహమని నిపుణులు సూచిస్తున్నారు.

## బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవి తింటే రోజంతా ఎనర్జీ?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఉదయాన్నే ఆరోగ్యకరమైన, శక్తి నిచ్చే అల్పాహా రం తీసుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యం గా రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయాలనుకునే వారికి, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సమస్య ఉన్న వారికి ప్రోటీన్ అధికంగా ఉండే అల్పాహారం ఎంతో మేలు చేస్తుంది. తక్కువ కేలరీలు, తక్కువ సోడియం, అధిక ప్రోటీన్ కలిగిన కొన్ని అద్భుతమైన బ్రేక్‌ఫాస్ట్ రెసిపీలు ఏంటో తెలుసుకుందాం.. చాలామంది బరువు తగ్గాలని లేదా ఆరోగ్యం కోసమని ఉదయం పూట ఏదో ఒకటి అరకొరగా తింటుంటారు. కానీ, సరైన పోషకాలు లేని అల్పాహారం వల్ల మధ్యాహ్నం లోపే నీరసం వచ్చేస్తుంది. ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే కడుపు నిండుగా అనిపించడమే కాకుండా, కండరాల పుష్టిని ఇస్తుంది. ఈ రెసిపీలు కేవలం ఆరోగ్యకరమైనవే కాదు, చాలా రుచికరమైనవి కూడా! సేవరీ ఓట్మీల్ గ్రెయిన్ బౌల్– ఓట్స్‌ను సోయా పాలతో ఉడికించి, దానిపై పోచ్డ్ ఎగ్ (ఉడికించిన గుడ్డు), అవకాడో ముక్కలు, కాల్చిన ఎర్ర మిరపకాయల మిశ్రమంతో తీసుకుంటే అద్భుతంగా ఉంటుంది. చాక్లెట్–స్ట్రాబెర్రీ బేక్డ్ ఓట్స్– కోటేజ్ చీజ్, ఓట్స్, ప్రోటీన్ పౌడర్ కలిపి బేక్ చేసి, స్ట్రాబెర్రీలతో తీసుకునే ఈ వంటకం తీపిగా, రుచిగా ఉంటుంది. వనిల్లా–క్రాన్బెర్రీ ఓవర్ నైట్ ఓట్స్– రాత్రే నానబెట్టిన ఓట్స్‌లో వనిల్లా, క్రాన్బెర్రీలు కలిపి ఉదయం తింటే సమయం ఆదా అవుతుంది. స్ట్రాబెర్రీ పీనట్ బటర్ ఓవర్ నైట్ ఓట్స్– సోయా పాలు, గ్రీక్ పెరుగు, పీనట్ బటర్ కలయికతో ఇందులో 17 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది.2. ఎగ్, ప్రోటీన్ బౌల్స్:హై–ప్రోటీన్ కోటేజ్ చీజ్ బౌల్– సాఫ్ట్ కుక్డ్ ఎగ్, డిల్ ఆకులు మరియు కోటేజ్ చీజ్‌తో చేసే ఈ బౌల్ ఉదయం పూట మంచి శక్తినిస్తుంది.స్పినాచ్ ఫ్రైడ్ ఎగ్ గ్రెయిన్ బౌల్– నట్టి ఫ్లేవర్ ఇచ్చే వీట్ బెర్రీస్ బేస్‌గా, దానిపై పాలకూర, వేరుశనగలు, గుడ్డు వేసి చేసే పోషకాల గని ఇది. సౌత్ వెస్ట్ బ్రేక్‌ఫాస్ట్ స్కిల్లెట్– పుట్టగొడుగులు, బెల్ పెప్పర్స్, బేకన్, ఎగ్స్‌తో ఒకే పెనంలో చేసే ఈ వంటకం వెజిటేబుల్ కౌంట్‌ను పెంచుతుంది. స్టోవ్‌టాప్ వెజ్జీ ఫ్రిటాటా– తక్కువ ధరలో దొరికే గుడ్లు, ఫ్రోజెన్ కూరగాయలతో త్వరగా చేసుకునే ప్రోటీన్ రిచ్ బ్రేక్‌ఫాస్ట్. 3. రిఫ్రెషింగ్ స్మూతీస్, షేక్స్: ఆరెంజ్–మాంగో ఫ్లాక్స్ సీడ్ షేక్– పెరుగు, మామిడి పండు, అవిసె గింజల కలయికతో చేసే ఈ షేక్ వర్కవుట్ తర్వాత తీసుకుంటే చాలా మంచిది.చాక్లెట్–స్ట్రాబెర్రీ ప్రోటీన్ షేక్– సోయా పాలు, పెరుగు, కోకో పౌడర్‌తో షుగర్ లేకుండానే తీపిగా ఉండేలా చేసుకోవచ్చు.వాటర్ మిలన్–పీచ్ స్మూతీ– పుచ్చకాయ, పీచ్ పండ్లతో చేసే ఈ స్మూతీ వేసవి ఉదయాలకు పర్ఫెక్ట్. మిక్సడ్ బెర్రీ బ్రేక్‌ఫాస్ట్ స్మూతీ– ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫ్యాట్స్ సమానంగా ఉండి, పూర్తి భోజనం చేసిన అనుభూతినిస్తుంది. 4. పుడ్డింగ్స్, పార్‌ఫైట్స్: బ్లూబెర్రీ పీనట్ బటర్ చియా పుడ్డింగ్– చియా గింజలు, బాదం పాలు, బ్లూబెర్రీల మిశ్రమం. రాత్రంతా నానిన ఈ పుడ్డింగ్ చాలా క్రీగా ఉంటుంది. రాస్ప్ బెర్రీ–బనానా యోగర్ట్ పార్‌ఫైట్– గ్రీక్ పెరుగు, పీచు పదార్థం ఎక్కువగా ఉండే పండ్లు, పెకాన్ నట్స్‌తో పొరలు పొరలుగా చేసుకునే పోర్టబుల్ బ్రేక్‌ఫాస్ట్.

## బరువు తగ్గడం ఎందుకంత కష్టం?

బరువు తగ్గడం అనేది కేవలం ''తక్కువ తినడం, ఎక్కువ కదలడం'' అనే సరళమైన సకరణం కాదు. చాలా మంది పట్టుదలతో డైటింగ్ మొదలుపెట్టినా, కొద్ది రోజులకే ఆగిపోతుంటారు లేదా తగ్గిన బరువు మళ్ళీ పెరుగుతుంటారు. దీనికి కారణం క్రమశిక్షణ లేకపోవడం కాదు. మన శరీరంలోని సంక్లిష్టమైన 'బయోలజీ' అని వైద్య నిపుణులు చెబుతున్నారు. మన శరీరం బరువు తగ్గడానికి ఎందుకు సహకరించదు? ప్రపంచ ఆరోగ్య సంస్థప్రకారం 1975 నుండి ఊబకాయం సమస్య మూడు రెట్లు పెరిగింది. మన దేశంలో కూడా పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. అందరూ బరువు తగ్గాలని ప్రయత్నిస్తారు, కానీ కొద్దిమంది మాత్రమే సక్సెస్ అవుతారు. ఎందుకు? ఎందుకంటే మనం బరువు తగ్గాలని డైటింగ్ మొదలుపెట్టినప్పుడు, మన మెదడు అది మన ఆరోగ్యానికి మంచిదని అనుకోదు. బదులుగా, మనం ఏదో ప్రమాదంలో ఉన్నామని, ఆహారం దొరకక 'ఆకలితో అలమటిస్తున్నామని' భావిస్తుంది. అక్కడే అసలు సమస్య మొదలవుతుంది.

మనం తక్కువ కేలరీలు తీసుకోవడం ప్రారంభించగానే, శరీరం తన శక్తిని ఆదా చేసుకోవడానికి 'మెటబాలిజం' (జీవక్రియ) వేగాన్ని తగ్గించేస్తుంది. అంటే, రు తక్కువ తిన్నా సరే, శరీరం చాలా తక్కువ కేలరీలను ఖర్చు చేస్తుంది. దీనినే 'మెటబాలిక్ అడాప్టేషన్' అంటారు. దీనివల్ల బరువు తగ్గడం ఒకానొక దశలో ఆగిపోతుంది.మనం డైటింగ్ చేస్తున్నప్పుడు, గ్రెలిన్ స్థాయిలు పెరిగి, లెప్టిన్ స్థాయిలు పడిపోతాయి. ఫలితంగా విపరీతమైన ఆకలి, ఆహారంపై కోరికలు పెరుగుతాయి. ఈ హార్మోన్ల మార్పులు డైటింగ్ ఆపేసిన తర్వాత కూడా ఏళ్ల తరబడి కొనసాగుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. మన శరీరంలోని కొవ్వు కణాలకు ఒక రకమైన 'జ్ఞాపకశక్తి' ఉంటుంది. శరీరం గతంలో ఏ బరువు వద్ద ఎక్కువ కాలం ఉందో, మళ్ళీ ఆ బరువుకు చేరుకోవడానికి ప్రయత్నిస్తుంది. అందుకే బరువు తగ్గిన వారు మళ్ళీ కిలోలు పెరగడం చూస్తుంటాం. దీనికి తోడు నిద్రలేమి, ఒత్తిడి తోడైతే పరిస్థితి మరింత జటిలమవుతుంది. ఒక్కసారిగా ఆహారం మానేయడం లేదా 'క్రాష్ డైట్స్' చేయడం వల్ల శరీరం వెంటనే 'సర్వైవల్ మోడ్' లోకి వెళ్తుంది. ఇది మెదడులో హై–కేలరీ ఆహారం తినాలనే కోరికను పెంచుతుంది. అందుకే బరువు తగ్గడం అనేది క్రమంగా, సహజంగా జరగాలి తప్ప బలవంతంగా కాదు. తీవ్రమైన ఊబకాయం ఉన్నవారికి కేవలం డైట్, వ్యాయామం సరిపోకపోవచ్చు. అటువంటప్పుడు 'బేరియాట్రిక్ సర్జరీ' వంటి వైద్య చికిత్సలు అవసరమవుతాయని డాక్టర్లు సూచిస్తున్నారు. ఇవి కేవలం కడుపు పరిమాణాన్ని తగ్గించడమే కాకుండా, మెదడుకు వెళ్లే హార్మోన్ల సంకేతాలను మారుస్తాయి. బరువు పెరగడం అనేది కేవలం క్రమశిక్షణ లోపం కాదు, అది ఒక వైద్యపరమైన సమస్య. మన శరీరంతో పోరాడటం కంటే, దాని పనితీరును అర్థం చేసుకుని సహకరించడం ముఖ్యం. సరైన నిద్ర, ఒత్తిడి లేని జీవితం మరియు క్రమబద్ధమైన ఆహారపు అలవాట్లతో మాత్రమే శాశ్వత బరువు తగ్గడం సాధ్యమవుతుంది.



## బియ్యం నీళ్లే పోషకాలు..!

బియ్యం కడిగిన నీళ్లలో స్టార్చ్, ఫాస్ఫరస్, పొటాషియం, ఇతర సూక్ష్మ పోషకాలు మెండుగా ఉంటాయి. వీటిలో ఉండే పిండి పదార్థాలు మట్టిలో పోషకాలను పెంచి, మొక్క వేర్లకు బలాన్ని అందిస్తాయి. ఆకుకూరలకు ఈ నీటిని ఇవ్వడం వల్ల గుబురుగా, పచ్చగా పెరుగుతాయి. ఇంట్లో పెంచుకునే టొమాటో మొక్కలకి ఈ నీటిని పోయడం వల్ల వాటి పూత, కాయలు రెండూ బాగుంటాయి. మిరప మొక్కలు బలంగా పెరుగుతాయి. మొక్క ఆకులపై బూజు తెగులు వస్తుంటే ఈ రైస్ వాటర్‌ని ఆకులపై నేరుగా స్ప్రే చేయొచ్చు. అంతేకాదు, రెండు వారాలకోసారి ఇలా చేయడం వల్ల మొక్కలకి ఫంగల్ ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. 3–9రోజులు ఈ నీటిని పులియబెట్టడం వల్ల దీనిలో పోషకాలు మరింత పెరుగుతాయి. కేవలం బియ్యం నీళ్లే కాదు, గంజిని కూడా ఇంట్లో పెంచుకునే మొక్కలకి పోయొచ్చు. అయితే 1:2 నిష్పత్తిలో నీటిని కలిపి మొక్కలకి ఇవ్వాలి. హైడ్రోపోనిక్ మొక్కలకు మాత్రం దీన్ని ఇవ్వకూడదు. దీంట్లో ఉండే స్టార్చ్ బ్యాక్టీరియా, శిలీంధ్రాల వృద్ధికి కారణమవుతుంది.



## పాలిచ్చే తల్లులూ ఇవి తినండి!

మాతృత్వం ప్రతి మహిళకూ ఓ గొప్పవరం. తల్లిపాలు... పిల్లలకు అమృతం. కానీ, చాలామంది అమ్మలకు అవి సరిపడినంతగా ఉండకపోవచ్చు. ప్రసవమయ్యాక పథ్యం పేరుతో పోషకాలను తీసుకోకుండా ఉంటే... పిల్లలకూ అందవు. అందుకే, సమతులాహారాన్ని ఎంచుకోవాలి. పాలు పడటానికీ, పోషకాలు అందడానికీ కీలకమైన విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలి. ముఖ్యంగా పాలకూరలో ఎక్కువ మోతాదు లో ఐరన్ దొరుకుతుంది. దీన్ని ఉడికించి తినడం మంచిది. లాక్టేషన్‌కి సాయపడే వాటిల్లో క్యారెట్ ఒకటి. దీనిలో ఎక్కువ మొత్తంలో లభించే విటమిన్ ఎ పాపాయి ఎదుగుదలలోనూ కీలంగా పనిచేస్తుంది. సొరకాయ, బీరకాయ వంటివాటిల్లో 90–95శాతం నీరు ఉంటుంది. ఇవి సహజంగా తేమనందించే ఆహారం. పాలు పడటానికి శరీరంలో నీటి స్థాయి కూడా చాలా కీలకం. నీరు తక్కువగా ఉంటే పాల ఉత్పత్తి తగ్గుతుంది. బీరకాయ, సొరకాయ వంటివి తినడం వల్ల నీటితో పాటు ఎలక్ట్రోలైట్స్ కూడా లభిస్తాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పైగా వీటిల్లో తక్కువ కెలోరీలు ఉంటాయి. బరువు నియంత్రణలో సాయపడతాయి. ఎ, సి విటమిన్లు, పొటాషియం, మెగ్నీషియం వంటి మినరల్లు కూడా తగినంతగా లభించడం వల్ల రోగనిరోధకత మెరుగుపడుతుంది. వీటితోపాటు చిలగడదుంపలు, గుమ్మడి, టొమాటోలు, తృణధాన్యాలు, ఓట్స్, వెల్లుల్లి, పచ్చిబొప్పాయి వంటివీ మేలు చేస్తాయట.



## పతనమైన బంగారం.. స్థిరంగానే వెండి



గతవారంలో శుక్రవారం వరకూ పతనమవుతూ వచ్చిన బంగారం ధర.. శనివారం భారీగా పెరిగింది. తాజాగా బంగారం రేటు మళ్లీ తగ్గింది. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1960 తగ్గగా..రూ.1,61,680కి దిగొచ్చింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1800 తగ్గగా.. రూ.1,48,200కి పతనమైంది. దీంతో కొనుగోలు దారులు బంగారం కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు. కిలో వెండి ధర రూ.2,90,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో లాభాల స్వీకరణ, డాలర్ బలపడటం వంటి కారణాల వల్ల ధరలు తగ్గుతున్నాయి.




# మరోసారి పెరిగిన క్రూడ్ ఆయిల్ ధర



మిడిల్ ఈస్ట్ దేశాల్లో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ ఇంధన మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటి 101.19 డాలర్లకు చేరుకుంది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక పెద్ద హెచ్చరిక అని ఆర్థిక రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. గత నాలుగేళ్ల కాలంలో చమురు ధరలు ఈ స్థాయికి చేరుకోవడం ఇదే మొదటిసారి. ముఖ్యంగా ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తీబా ఖమేనీ బాధ్యతలు చేపట్టడంతో ఇరాన్ ప్రయోజనాల కోసం ఆయన మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటారనే నేపథ్యంలో ఈ పెరుగుదల నమోదైనట్టు తెలుస్తోంది. అలాగే ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి గుండా రవాణా నిలిచిపోతుందేమోనన్న భయం పెట్టుబడిదారులను వెంటాడుతోంది. చమురుధరలు 100డాలర్లు దాటడం వల్ల భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85% దిగుమతుల ద్వారానే తీర్చుకుంటుంది.

# భారత దేశంలో 308కి చేరిన అపర కుబేరులు

దేశంలో అధిక ధరలతో ప్రజల ఆదాయాలు సన్నగిల్లుతుండగా, కుబేరుల సంఖ్య భారీగా పెరుగుతోంది. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2026 నివేదిక ప్రకారం.. భారత్ ఇప్పుడు 308 మంది బిలియనీర్లతో ప్రపంచంలోనే మూడవ స్థానంలో నిలిచింది. గడిచిన ఏడాదిలో భారత్‌లో 57 మంది కొత్త బిలియనీర్లు పుట్టుకొచ్చారు. మొత్తం 308 అపర కుబేరుల సగటు సంపద సుమారు రూ.36,570 కోట్లుగా నమోదయ్యింది. వీరందరి మొత్తం సంపద 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు చేరింది. ఇందులో 199 మంది సంపద పెరగ్గా, 109 మంది సంపదలో మార్పు లేకుండా ఉంది. భారతీయ బిలియనీర్లలో 7 శాతం మంది మహిళలు ఉన్నారు. ఇక హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా రూ.3.2 లక్షల కోట్లతో మూడో స్థానంలో నిలవడమే కాకుండా.. టాప్ 10 జాబితాలో ఉన్న ఏకైక మహిళగా గుర్తింపు పొందారు. రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీ రూ.9.8 లక్షల కోట్ల సంపదతో ఆసియాలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా ఉన్నారు. గౌతమ్ అదానీ రూ.7.5 లక్షల కోట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు. హెల్త్‌కేర్ రంగంలో అత్యధికంగా 53 మంది కొత్త బిలియనీర్లు నమోదయ్యారు. ఇంధన రంగంలో ఎనిమిదిమంది బిలియనీర్లు ఉన్నప్పటికీ, అత్యధికంగా రూ.18.3 ట్రిలియన్ల సంపదను ఈ రంగం కలిగి ఉంది. 95 మంది బిలియనీర్లతో ముంబయి భారత్‌లో అగ్ర స్థానంలో కొనసాగుతోంది. హెల్త్‌కేర్, ఎనర్జీ వంటి కీలక రంగాలు ఈ అపర కుబేరులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సామాన్యుడి పరిస్థితి మాత్రం దయనీయంగా మారుతోంది. బిలియనీర్ల సంపద 10 శాతం పెరిగినప్పటికీ.. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుడి కొనుగోలు శక్తిని హరిస్తున్నాయి. ముఖ్యంగా హెల్త్‌కేర్, ఆటో విడిభాగాలు, ఎనర్జీ రంగాల్లో కొత్త కుబేరులు పుట్టుకొస్తున్న తరుణంలోనే అదే



ఆరోగ్య సేవలు సామాన్యుడికి అత్యంత ఖరీదైనవిగా మారుతుండటం గమనార్హం. ముంబయి వంటి మెట్రో నగరాలు సంపదకు కేంద్రాలుగా మారుతుండగా, గ్రాణ భారతం ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాల కోసం పోరాటం చేస్తూనే ఉంది. బిలియనీర్ల సంఖ్య పెరగడం మున్ముందు రాబోయే ఆర్థిక అసమానతలకు హెచ్చరికలా అనేది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 308 మంది కుబేరులు ఉండటం కన్నా, కోట్లాది మంది పేదరికం నుండి బయటపడటమే నిజమైన అభివృద్ధి అని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## దేశీయ స్టాక్ మార్కెట్లు క్రాష్..



పశ్చిమాసియా యుద్ధం, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల ఎఫెక్ట్ దేశీయ స్టాక్ మార్కెట్లపై భారీగా పడింది. స్టాక్ మార్కెట్లు కుప్పకూలడంతో మదుపరులు ఆందోళన చెందుతున్నారు.నిఫ్టీ ట్రేడింగ్ 700 పాయింట్లకు పైగా నష్టాలతో ప్రారంభమవ్వగా.. 2300 పాయింట్లకు పైగా నష్టాల్లో సెన్సెక్స్ ట్రేడింగ్ మొదలైంది. ట్రేడింగ్ స్టార్టింగ్ సెషన్స్ లోనే భారీ నష్టాలు కనిపించడంతో బ్యాంకింగ్ రంగంపై తీవ్ర ప్రభావం పడింది. ఫార్మా, ఆటోమొబైల్ రంగాలు కూడా నష్టాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి. సెన్సెక్స్ టాప్ 30 ఇండెక్స్ సూచీలో షేర్లన్నీ నష్టాల్లోనే ఉండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లలో బ్లడ్ బాత్ కనిపిస్తోంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భగ్గుమన్న నేపథ్యంలో స్టాక్ సూచీలు కుప్పకూలాయి. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు, ముడి చమురు ధరల పెరుగుదల భారత స్టాక్ మార్కెట్లపై పెను ప్రభావాన్ని చూపాయి. సోమవారం ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు భారీగా కుప్పకూలాయి. ముడి చమురు ధరలు పెరగడం వల్ల షేర్లు.. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్ల లాభాల మార్జిన్లు తగ్గుతాయన్న భయంతో పతనమయ్యాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గేవరకు వోలటాలిటీ ఇలాగే కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు.

# ఎండలతో పాటే మండనున్న ఏసీల ధరలు



కొన్ని విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నందున, రూపాయి విలువ తగ్గే కొద్దీ కంపెనీలకు భారం పెరుగుతోంది. కొత్త ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించేందుకు, తయారీ వ్యయాలు అధికమవుతున్నాయన్నది కంపెనీల వాదన. ఫలితంగా ఏసీల ధరలు 5-15% పెరిగే అవకాశం ఉంది. డైకిన్, వోల్టాస్, బ్లూస్టార్, ఎల్‌జీ, హయర్, మిత్సుబిషి కంపెనీలు తమ అన్ని మోడళ్ల ఏసీల ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. దేశీయంగా ఏడాదికి 1.35 కోట్ల ఏసీలు అమ్ముడవుతున్నాయని అంచనా. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ నూతన నిబంధనలు ఈ ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి.

ఎండలు అప్పుడే మండుతున్నాయి.. ఎయిర్ కండీషనర్ (ఏసీ) కొనుక్కుని ఉపశమనం పొందుదామనుకుంటే, కంపెనీలు ధరలు పెంచేస్తున్నాయి. ఏసీ తయారీలో కీలకమైన రాగి వంటి ముడి పదార్థాల ధరలు పెరగడం, డాలరుతో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ఇంధన వినియోగానికి సంబంధించి ఏసీ స్టార్‌రేటింగ్ ప్రమాణాలు మారడం ఇందుకు కారణమని కంపెనీలు చెబుతున్నాయి.

# ఏఐతో ఆదాయం ఆర్జిస్తున్నారు..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాధారణ వినియోగంలోకి వస్తున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు పోతాయని, ముఖ్యంగా గణనీయమైన సంఖ్యలో వైట్-కాలర్ ఉద్యోగాలు ఉండవంటూ రకరకాల ఆందోళనలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉన్నాయి. అయితే, ఏఐ మానవ జీవితంతో ఎంత విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందో, దానికి అనుగుణంగా కొన్ని ఉద్యోగాలు పోతాయి, కొత్తవి పుట్టుకొస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రముఖ బ్యాంక్ బజార్ ఆస్పిరేషన్ ఇండెక్స్ నిర్వహించిన ఓ అధ్యయనంలో ఏఐ ఇప్పటికే చాలామంది ఉద్యోగుల ఆర్థిక జీవితాలను మెరుగుపరిచిందని తేల్చింది. ఈ నివేదిక ప్రకారం, 22 నుంచి 45 ఏళ్ల వయస్సున్న ఉద్యోగుల్లో 40 శాతం కంటే ఎక్కువ మంది ఇప్పటికే ఏఐ కారణంగా తమ ఆదాయం, ఉత్పాదకత పెరిగిందని స్పష్టం చేస్తున్నారు. ఏఐ సాధనాలు ఎక్కువ ఆదాయం ఆర్జించేందుకు, మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయ పడుతున్నాయని 42 శాతం మంది చెప్పారు. ఇదే సమయంలో ఏఐ సంబంధిత మార్పుల వల్ల తమ ఆదాయంపై ప్రభావం పడిందని 12 శాతం మంది చెప్పగా, 8 శాతం మంది ఏఐ టూల్స్‌పై ఎక్కువ ఆధారపడటం వల్ల ఆర్థికంగా నష్టపోయినట్టు తెలిపారు. అయితే, ఏఐతో కలిసి పనిచేసేందుకు తమ స్కిల్స్ పెంచుకున్న వారు ఎక్కువ ప్రయోజనాలు పొందినట్టు నివేదిక స్పష్టం చేసింది. చాలా




మంది కెరీర్ మధ్యలో ఉన్న ప్రొఫెషనల్స్ తమ ఉద్యోగాల్లో ఏఐని ఉపయోగించడం వల్ల పని తీరు గతంలో కంటే బాగుందని ఎక్కువ మంది ఉద్యోగులు అంగీకరిస్తున్నారు. మరోవైపు, ఏఐ-సంబంధిత స్కిల్స్ లేదా అందుకు తగిన ప్రణాళిక లేనివారు తమ ఆదాయంపై ఆశలు సన్నగిల్లుతున్నట్టు చెబుతున్నారు. ఉద్యోగులతో పాటు కంపెనీలు కూడా క్రమంగా ఏఐ వినియోగాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయని మరో నివేదికలో తేలింది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా సంస్థలు ఏఐ ఉపయోగించి, కార్యకలాపాలను విస్తరించి ఆదాయం ఆర్జిస్తున్నాయి. సేల్స్‌ఫోర్స్ రూపొందించిన ఈ నివేదిక ప్రకారం, ఆటోమేటెడ్ సర్వీస్ చాట్‌బాట్స్, మార్కెటింగ్, కంటెంట్ కోసం కంపెనీలు ఎక్కువ ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఏఐ కోసం చేసిన ఈ ఖర్చు ద్వారా తమ ఆదాయం గణనీయంగా పెరిగిందని 90 శాతానికి పైగా కంపెనీలు స్పష్టం చేశాయి.




## ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్‌లకు ఈ కప్ అంకితం



అహ్మదాబాద్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో గెలిచి భారత్ మూడోసారి టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.అనంతరం గంభీర్ డియాతో మాట్లాడారు. మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్, ఎన్‌సీఏ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌లకు ఈ కప్‌ను అంకితం చేస్తున్నట్లు ప్రకటించాడు. ''భారత జట్టును పటిష్టమైన స్థితిలో ఉంచినందుకు రాహుల్ భాయ్‌కు, భవిష్యత్ తారలను తీర్చిదిద్దుతున్న లక్ష్మణ్‌కు ఈ ట్రోఫీని అంకితం చేస్తున్నా'' అని ఆయన పేర్కొన్నాడు. ఈ సందర్భంగా నిజాయితీతో పనిచేసిన చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌ను కూడా ప్రశంసించాడు. తన కోచింగ్ కెరీర్‌లో అత్యంత క్లిష్ట దశ ఎదురైనప్పుడు జై షా తనకు ఎలా ధైర్యం చెప్పారో గంభీర్ గుర్తుచేసుకున్నారు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా చేతిలో టెస్ట్ సిరీస్‌లు ఓడిపోయినప్పుడు తానెంతో కుంగిపోయానని, ఆ సమయంలో జై షా ఫోన్ చేసి తనపై నమ్మకం ఉంచారని గంభీర్ తెలిపాడు. ఆ నమ్మకమే ఈ విజయానికి కారణమని ఆయన పరోక్షంగా వెల్లడించాడు.

# టీ20 వరల్డ్ కప్ ఫైనల్ హీరో అభిషేక్ శర్మ భావోద్వేగం



భారత్ మూడోసారి టీ20 ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మ టోర్నీలో తాను ఎదుర్కొన్న కఠిన పరిస్థితుల గురించి పంచుకున్నాడు. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్ అనంతరం అభిషేక్ మాట్లాడాడు. టోర్నమెంట్‌లో వరుసగా విఫలమవుతున్నప్పుడు తనపై తనకే అనుమానం కలిగిందని, కానీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్తో కోచ్ గౌతమ్ గంభీర్ తనపై ఉంచిన అచంచలమైన విశ్వాసమేతనను గెలిపించిందని భావోద్వేగంగా చెప్పాడు. టోర్నీ మధ్యలో నా ప్రదర్శనపై నాకే సందేహాలు వచ్చాయి. నా కెరీర్‌లో ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ ఎదుర్కోలేదు. కానీ కోచ్ కెప్టెన్ నాపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. నువ్వు ఏదో ఒక పెద్ద మ్యాచ్ గెలిపిస్తావు అని వారు పదేపదే చెబుతూ ఉండేవారు. ఒక యువ ఆటగాడిగా ఇలాంటి దశను దాటడం అంత సులభం కాదు అని అభిషేక్ బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడుతూ తెలిపాడు.ఈ జట్టు నాకు ఎంతో ప్రేమను పంచింది. నేను సరిగా ఆడలేకపోయిన రోజుల్లో వారు నన్ను చూసుకున్న విధానం అద్భుతం. టోర్నీకి ముందు ఏడాది పొడవునా బాగా ఆడి, కీలకమైన ప్రపంచకప్‌లో విఫలమవడంతో ఒత్తిడికి గురయ్యాను. కొన్నిసార్లు భావోద్వేగానికి కూడా లోనయ్యాను. నేను కెప్టెన్ లేదా కోచ్‌తో మాట్లాడదాం అనుకునేలోపే వారే నా దగ్గరికి వచ్చి ధైర్యం చెప్పేవారు అని వివరించాడు.నువ్వు మాకు పెద్ద మ్యాచ్ గెలిపిస్తావు అని వారు చెప్పిన మాటలు నా మదిలో నిలిచిపోయాయి. ఆ రోజు కోసం ఎదురుచూశాను. ఫైనల్ కంటే గొప్ప రోజు మరొకటి ఉండదు. ఆ నమ్మకాన్ని నిలబెట్టినందుకు సంతోషంగా ఉంది అని అభిషేక్ పేర్కొన్నాడు.

# శివమ్ దూబే మెరుపు దాడి

అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగుతున్న టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ముఖ్యంగా ఇన్నింగ్స్ చివర్లో, ఆఖరి ఓవర్లలో భారత బ్యాటర్ శివమ్ దూబే సృష్టించిన విధ్వంసం టీమిండియా అభిమానులను అలరించింది. స్లాగ్ ఓవర్లలో పరుగుల వేగం తగ్గిందనుకున్న దశలో కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డ దూబే, భారత స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కేవలం 8 బంతులు మాత్రమే ఎదుర్కొన్న దూబే 3 ఫోర్లు, 2 భారీ సిక్సర్లతో ఏకంగా 26 పరుగులు రాబట్టి నాటౌట్‌గా నిలిచాడు. అతనికి తోడుగా తిలక్ వర్మ (8 నాటౌట్) నిలవడంతో, నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. చివరి ఓవర్లో దూబే చేసిన హిట్టింగ్ భారత శిబిరంలో ఫైనల్ జోష్‌ను నింపింది.జిమ్మీ నీషామ్ విసిరిన ఆ ఓవర్లో దూబే 2 సిక్సులు, 3 ఫోర్లతో 24 పరుగులు సాధించాడు.అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్‌కు ఓపెనర్లు కళ్ళు చెదిరే ఆరంభాన్ని ఇచ్చారు. అభిషేక్ శర్మ, సంజు శాంసన్ కివీస్ బౌలర్లను ఆడుకున్నారు. అభిషేక్ శర్మ కేవలం 21 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 52 పరుగులు చేసి మెరుపు వేగంతో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. పవర్ ప్లేలో వీరిద్దరూ పోటీపడి పరుగులు చేయడంతో స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. మరోవైపు వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ క్లాస్, మాస్ ఇన్నింగ్స్ ఆడాడు. 46 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 89 పరుగులు చేసి సెంచరీకి చేరువలో ఔటయ్యాడు. అభిషేక్ ఔటయ్యాక వచ్చిన ఇషాన్ కిషన్ (54 పరుగులు, 25 బంతుల్లో) కూడా దూకుడుగా ఆడటంతో భారత్ భారీ స్కోరు దిశగా సాగింది.అయితే, ఇన్నింగ్స్ 15, 16 ఓవర్ల మధ్యలో న్యూజిలాండ్ బౌలర్ జేమ్స్ నీషమ్ మ్యాచ్‌ను మలుపు తిప్పే ప్రయత్నం చేశాడు. వరుస విరామాల్లో కుదురుకున్న సంజు శాంసన్, ఇషాన్ కిషన్‌లను పెవిలియన్ చేర్చడమే కాకుండా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను డకౌట్ చేసి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు.



# పుట్టెడు దుఃఖంలోనూ పట్టువదలని ఇషాన్ కిషన్..!

ఇషాన్ కిషన్.. పుట్టెడు దుఃఖంలోనూ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్లో ఆడాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ అతడు భావోద్వేగానికి గురయ్యాడు. తాను ఈ విజయాన్ని రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కజిన్ సిస్టర్‌కి అంకితమిస్తున్నట్లు తెలిపాడు. 'ఫైనల్ మ్యాచ్‌కు ముందు మా కజిన్ సిస్టర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె కోసమే నేను బాగా ఆడాను. హార్దిక్ పాండ్యతో ఈ విషయం చెప్పాను. అతడి ప్రోత్సాహంతో జట్టుకు ప్రాధాన్యమిచ్చాను. మహిళా దినోత్సవం రోజున వచ్చిన ఈ విజయాన్ని ఆమెకు అంకితమిస్తున్నా' అని ఇషాన్ కిషన్ అన్నాడు. అలాగే వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు సూర్యకుమార్ యాదవ్, తనకు మధ్య జరిగిన ఫోన్ సంభాషణ గురించి కూడా ఇషాన్ మాట్లాడాడు. ''సూర్య భాయ్ నాకు కాల్ చేసి 'వరల్డ్ కప్ గెలిపిస్తున్నావా లేదా?' అని అడిగాడు. దానికి నేను 'మీరు నమ్ముతున్నారా, లేదా?' అని అడిగా. 'నమ్ముతున్నా' అని సూర్య సమాధానమిచ్చాడు' అని ఇషాన్ కిషన్ పేర్కొన్నాడు.



ఇషాన్ కిషన్ కజిన్ సిస్టర్, ఆమె భర్త మార్చి 6న కారు ప్రమాదంలో మరణించారు. ఈ విషాద ఘటనతో ఫైనల్ మ్యాచ్‌కు రావాల్సిన ఇషాన్ కుటుంబసభ్యులు అక్కడే ఉండిపోయారు. ఫైనల్లో హాఫ్ సెంచరీ పూర్తయిన అనంతరం ఇషాన్ కిషన్ బ్యాట్‌ను ఆకాశం వైపు చూపిస్తూ తన సోదరికి నివాళులర్పించాడు. ఇషాన్ కిషన్ ఈ వరల్డ్‌కప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు.

# భారత ఆటగాళ్లపై సచిన్, కోహ్లీ ప్రశంసల జల్లు

టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్‌లో టీమిండియా ఘన విజయం సాధించడంపై సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ ప్రశంసలు కురిపించారు. ఈ విజయంపై విరాట్ కోహ్లీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఉఛాంపియన్స్! అహ్మదాబాద్‌లో టీమిండియాకు ఇది అద్భుత విజయం. టోర్నమెంట్ ఆసాంతం మనవాళ్ళు ఎక్స్‌ప్లోజివ్ క్రికెట్ ఆడారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ పోరాడి మళ్లీ వరల్డ్ చాంపియన్లుగా నిలిచిన తీరు అద్భుతం'' అని పేర్కొన్నాడు. టీ20 ఫార్మాట్‌లో వరుసగా రెండుసార్లు కప్పు గెలిచిన ఘనత భారత్‌కే దక్కుతుంది. కివీస్ బౌలర్లతో పోలిస్తే మన బౌలర్లు స్లోయర్, షార్ట్ పిచ్ బంతులను తెలివిగా విసిరారు. ఇక్కడి బౌండరీ కొలతలకు తగ్గట్టుగా లెంగ్త్స్ మార్చడం వల్లే విజయం సాధ్యమైంది'' అని సచిన్ కొనియాడారు. కాగా సొంతగడ్డపై టీ20 కప్పు గెలిచిన తొలి జట్టుగా, మూడుసార్లు టైటిల్ నెగ్గిన జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. భారత జట్టు సాధించిన ఈ అద్భుత విజయంపై ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. ''ఛాంపియన్స్.. టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు'' అంటూ ప్రధాని ప్రశంసించారు. ఈ గెలుపు జట్టు అద్భుతమైన నైపుణ్యాలు, దృఢ సంకల్పం, టీమ్ వర్క్‌కు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. టోర్నమెంట్ ఆసాంతం భారత ఆటగాళ్లు చూపిన పోరాట పటిమ అమోఘమని మోదీ కొనియాడారు. ఈ విజయం ప్రతి భారతీయుడి గుండెను గర్వంతో, ఆనందంతో నింపిందని తెలిపారు. ''వెల్ డన్ టీమ్ ఇండియా'' అంటూ ప్రధాని తన సందేశంలో భారత ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా టోర్నీలో భారత జట్టు కప్ గెలవడం క్రీడా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది.



# టీ20 వరల్డ్ కప్ ట్రోఫీతో హనుమాన్ గుడికి గంభీర్, సూర్యకుమార్

టీ20 మెన్స్ వరల్డ్ కప్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై భారత్ సూపర్ విక్టరీ సాధించిన సంగతి తెలిసిందే. వరల్డ్ కప్‌ను కైవసం చేసుకున్న కొద్ది గంటల్లోనే ఓ ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ కార్యదర్శి జై షా కలిసి అహ్మదాబాద్ లోని ప్రముఖ హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. సూర్యకుమార్ యాదవ్ తన చేతులతో టీ20 వరల్డ్ కప్ ట్రోఫీని పట్టుకుని ఆలయంలోని హనుమంతుడి విగ్రహం ముందుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# వుదయం సినిమా

## R చిత్రం ప్రారంభం



GMAA ఎంటర్టైన్మెంట్స్ అనే బ్యానర్లో శిరీష గారి సమర్పణలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం "R". గోలి రామకృష్ణ దర్శక నిర్మానంలో వస్తున్న ఈ చిత్రానికి గాలి బాల కిరణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో రానున్న ఈ చిత్రం నేడు శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పూజ కార్యక్రమాలతో ఘనంగా మొదలు కావడం జరిగింది. సంతోష్ కృష్ణన్, భాగ్య రెడ్డి, బ్రహ్మానందం రెడ్డి, దుర్గమ నాయుడు, పవన్, సిరి, సంధ్య, భాను చందర్, స్వాతి తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ గా అశోక రెడ్డి కంకల్ల, ఎడిటర్ గా మునీష్, కొరియోగ్రాఫర్ గా శివాజీ, చీఫ్ అసోసియేట్ డైరెక్టర్ గా కడవకల్లు గణేష్, అసిస్టెంట్ డైరెక్టర్గా వేదాంత్ రాజ్ అందే వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఈనెల 20వ తేదీ నుండి ప్రారంభం కానుంది. ఈ సంవత్సరంలోనే అక్టోబర్ 17వ తేదీన "R" చిత్రం విడుదల కానుందని మేకర్స్ తెలిపారు.

## ఘనంగా రోకా వేడుక

### హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ - కావ్య రెడ్డి నిశ్చితార్థం









*హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలో కావ్య రెడ్డిని వివాహం చేసుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో వీరి రోకా వేడుక ఇరు కుటుంబాల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రోకా వేడుక కావ్య రెడ్డి నివాసంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో దర్శకులు బోయపాటి శ్రీను, అనిల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, నిర్మాతలు శిరీష్, సాహు గారపాటి, రామ్ ఆచంట, మిర్యాల రవీందర్ రెడ్డి, నాగ వంశీ, కేకే రాధామోహన్, ధీరజ్ మొగిలినేని, హీరోయిన్ సంయుక్త తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ – కావ్య రెడ్డి నిశ్చితార్థం, వివాహ తేదీలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. సినిమాల విషయానికి వస్తే, ఇటీవలే 'కిష్కింధపురి' తో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రస్తుతం 'టైసన్ నాయుడు', 'హైందవ' చిత్రాల్లో నటిస్తున్నారు.*

## అవార్డులు రావడం ఆనందంగా ఉంది

### దర్శకుడు అనిల్ రావిపూడి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025లో విడుదలైన చిత్రాలకు ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డులను ప్రకటించింది. విక్టరీ వెంకటేష్ హీరోగా హిట్ మిషన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి బెస్ట్ ఎంటర్ టైనర్, బెస్ట్ స్క్రీన్ ప్లే విభాగాల్లో అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి విలేకరుల సమావేశంలో ముచ్చటించారు.

**ఈ ఫీలింగ్ ఎలా అనిపిస్తుంది?**

చాలా చాలా హ్యాపీగా ఉంది. డైరెక్టర్ నందిని రెడ్డి గారితో పాటు చాలామంది ఫ్రెండ్స్ ఇదే విషయం చెబుతూ మెసేజులు పెట్టారు. కమర్షియల్ గా బాక్సాఫీస్ దగ్గర విక్టరీ, అలాగే అవార్డ్స్ కూడా రావడం ఒక దర్శకుడికి అంతకంటే హ్యాపీనెస్ మరొకటి ఉండదు.

సంక్రాంతి వస్తున్నాం నా కెరియర్లో చాలా స్పెషల్ ఫిలిం. ఎంటర్టైన్మెంట్ తో పాటు ఒక చిన్న డిఫరెంట్ జానర్ ని ట్రై చేసిన సినిమా అది. నాకు మంచి బూస్ట్ ఇచ్చిన సినిమా. భగవంత్ కేసరి లాంటి సీరియస్ డ్రామా తర్వాత ఒక ఎంటర్టైన్మెంట్ సినిమా చేశాను. అది బాక్సాఫీస్ వద్ద రికార్డులు క్రియేట్ చేసింది. ఇప్పుడు బెస్ట్ ఎంటర్టైనర్, బెస్ట్ స్క్రీన్ ప్లే విభాగాల్లో గద్దర్ గారి పేరు మీద ఇస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాత్మక అవార్డు రావడం అనేది చాలా హ్యాపీగా అనిపించింది.

**ఈ విషయంలో మీపై ఏదైనా ఒత్తిడి ఉంటుందా?**

ఆడియన్స్ ప్రతి సినిమాకి ఇస్తున్న సక్సెస్ కి ఒక తెలియని ఎనర్జీ వస్తుంది. భయం అనేది కచ్చితంగా ఉంటుంది. లేకపోతే ప్రతి సినిమాకి అంత నిజాయితీగా పని చేయలేం. అయితే ఆడియన్స్ ఇచ్చే ఎనర్జీ మనల్ని ముందుకు తీసుకు వెళుతుంది. ఈ క్రెడిట్ మొత్తం ఆడియన్స్ కి ఇస్తాను

**భగవంత్ కేసరికి నేషనల్ అవార్డు, సంక్రాంతికి వస్తున్నాం కి స్టేట్ అవార్డ్ రావడం ఎలా అనిపించింది?**

భగవంత్ కేసరికి నేషనల్ అవార్డుతో పాటు గద్దర్ అవార్డు కూడా వచ్చింది. చాలా హ్యాపీగా అనిపించింది. ఆడియన్స్ సినిమాని హిట్ చేయడం ఒక ఆనందం అయితే ఈ అవార్డులు రావడం అనేది కూడా ఒక గుర్తింపుని తీసుకొచ్చింది. అది ఇంకా కిక్ ఇస్తుంది.

**వెంకటేష్ గారితో చేసిన సినిమాకి అవార్డు రావడం ఎలా అనిపించింది?**

వెంకటేష్ గారు నేను కలిసి చేసిన సినిమాలన్నీ బ్లాక్ బస్టర్ విజయాలు సాధించాయి. ఇప్పుడు కలిసి మరో సినిమా చేస్తున్నాం. ఇలాంటి సమయంలో ఈ అవార్డు రావడం అనేది మంచి పాజిటివ్ వైబ్ లా అనిపించింది.

సంక్రాంతికి వస్తున్నాం స్క్రీన్ ప్లే క్యారెక్టర్స్ కి సీన్స్ కి మధ్య చాలా చక్కగా డిజైన్ చేయడం జరిగింది. స్క్రీన్ ప్లే కి అవార్డు రావడం అనేది నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది.

## ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్ సంచారమే విడుదల

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' సినిమా నుంచి తొలి గీతంగా 'సంచారమే'ను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. ఈ మనోహరమైన పాట ప్రధాన పాత్రల భావోద్వేగ ప్రయాణాన్ని ఎంతో అందంగా ఆవిష్కరించింది. ప్రఖ్యాత గీత రచయిత గోరేటి వెంకన్న రచించిన ఈ పాట స్వచ్ఛమైన తెలుగు కవిత్వంతో పాటు హృదయాన్ని తాకే భావాలతో ప్రత్యేకంగా నిలుస్తోంది. దేశీ మూలాలు, విదేశీ జీవితానికి మధ్య ఉన్న విరుద్ధ భావాలను సున్నితంగా ప్రతిబింబిస్తూ సినిమా కథనానికి అనుగుణంగా ఈ పాట సాగుతుంది. ఈ గీతానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ అద్భుతమైన సంగీతాన్ని సమకూర్చారు. ఆ కూర్పుకు మరింత గాఢతను జోడిస్తూ హేషమ్ అబ్దుల్ వహాబ్, గోరేటి వెంకన్న కలిసి శ్రావ్యంగా పాటను ఆలపించారు. దృశ్యపరంగా ఈ పాట లండన్ యొక్క అద్భుతమైన దృశ్యాలను ప్రదర్శిస్తుంది. అంతర్జాతీయ ప్రకృతి దృశ్యాలను, తెలుగు స్వరాల మాధుర్యాన్ని మిళితం చేస్తూ ఎంతో ఆకర్షణీయంగా ఈ గీతముంది. బ్లాక్‌బస్టర్ "బేబీ" తర్వాత మళ్లీ కలిసి నటిస్తున్న ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జోడి తెరపై ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. '90s' వెబ్ సిరీస్ తో అందరి మనసులు దోచుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా అద్భుతమైన తారాగణం, ప్రతిభగల సాంకేతిక బృందాన్ని ఒకచోట చేర్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. వెంకట్ ఉప్పుటూరి, వి.ఎం.ఆర్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.



## ఫిల్మ్ డైరెక్టర్స్ విజేతలకు అభినందనలు!



అధ్యక్షులుగా విజయం సాధించిన దర్శకుడు వి. ఎన్. ఆదిత్య ఉపాధ్యక్షులుగా గెలుపొందిన దర్శకులు సముద్ర, జర్నలిస్ట్ ప్రభు, ఏస్.వి. భాస్కర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించిన పి. వి. రామారావు, కోశాధికారి గా గెలుపొందిన. సాయి రాజేష్ నీలం, ఉప కార్యదర్శులుగా విజయం సాధించిన చెరుకూరి బాలాజీ, ఎ.కృష్ణమోహన్, కార్యనిర్వహక కార్యదర్శులుగా గెలిచిన రాజా వన్నెంరెడ్డి, ఎ సునీల్ మరియు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా విజయం సాధించిన ఆళ్ల ఆకాష్ , కొలను శైలేష్ , గుంటూరు అంజిబాబు , తలాటం మల్లిక, సాగర్ చంద్ర టి, శ్రీరామ్ ఆదిత్య , ఎం. సాయి సురేంద్రబాబు, రమణ మొగిలి , కొండా విజయ్ కుమార్ తదితరుల అందరికి జయాభినందనలు!!

## సినిమా చూసిన వాళ్లంతా ప్రశంసిస్తున్నారు

### సక్సెస్ మీట్‌లో హీరో శ్రీ విష్ణు



కంటెంట్ కింగ్ శ్రీ విష్ణు హీరోగా హుస్సేన్ షా కిరణ్ తెరకెక్కించిన చిత్రం 'మృత్యుంజయ్'. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ని లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్ఫెక్ట్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. 'సామజవరగమన'తో బ్లాక్ బస్టర్ హిట్ పెయిర్‌గా నిలిచిన శ్రీ విష్ణు, రెబా మోనికా జాన్ ఈ చిత్రంతో మరోసారి అలరించారు. మార్చి 6న ఈ మూవీ విడుదలైన ఈ మూవీ బ్లాక్ బస్టర్‌గా దూసుకుపోతోంది. ఈ క్రమంలోనే శనివారం నాడు చిత్రయూనిట్ థ్రిల్లింగ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. శ్రీ విష్ణు మాట్లాడుతూ ..'సందీప్ గారు, పవన్ గారు, నేను కలిసి ఓ సినిమా చేయాలని అనుకున్నాం. ఆ టైంలో నాకు హుస్సేన్ షాని సందీప్ గారు పరిచయం చేశారు. కేవలం కంటెంట్ తోనే సినిమాని తీయాలని సందీప్ గారు అనుకున్నారు. సెట్‌లో రమ్య గారే ఎక్కువగా ఉండేవారు. ఆమె మా అందరినీ చక్కగా చూసుకున్నారు. చిన్నా గారు, సుదర్శన్, రచ్చ రవి, అయ్యప్పశర్మ గారు, రెబా గారు, పాప ఊహా ఇలా అందరూ అద్భుతంగా నటించారు. ఈ మూవీని ఆడియెన్స్ చాలా ఫ్రెష్‌గా ఫీల్ అవుతున్నారు. సాగర్ గారు మా అందరినీ చాలా కొత్తగా చూపించారు. హుస్సేన్ రైటింగ్, ట్విస్ట్‌లు అద్భుతంగా అనిపించాయి. కాళ భైరవ ఆర్ఆర్ చూసి నేను కూడా షాక్ అయ్యాను. ఆయన ఆర్ఆర్ వల్లే సినిమా స్థాయి పెరిగింది. ఈ చిత్రానికి ఆయనే నిజమైన హీరో. సినిమా చూసిన వాళ్లంతా గొప్పగా ఉందని ప్రశంసిస్తున్నారు. ఇంకా చూడని వాళ్లుంటే వెంటనే మా మూవీని చూడండి. తెలుగులో చాలా అరుదుగా వచ్చే థ్రిల్లర్‌లో ఇదొక మంచి సినిమా అవుతుంది. ఈ మంచి థ్రిల్లర్ అందరికీ నచ్చుతుంది తప్పకుండా చూడండి. ఇంకా మా మూవీని ఇలానే చూసి పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

## మిరాకిల్ నా కెరీర్ బెస్ట్ ఫిల్మ్

### హెబ్బా పటేల్

"కుమారి 21ఎఫ్, ఈడో రకం ఆడో రకం, ఓదెల రైల్వే స్టేషన్" వంటి బ్లాక్ బస్టర్స్ నా కెరీర్ లో ఎన్నో ఉన్నప్పటికీ... తాజాగా నేను చేస్తున్న "మిరాకిల్" నా కెరీర్ లో మోస్ట్ మెమరబుల్ మూవీ అవుతుంది. థాంక్స్ టు డైరెక్టర్ ప్రభాస్ నిమ్మల" అని అన్నారు క్రేజీ హీరోయిన్ హెబ్బా పటేల్. సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై రమేష్ ఎగ్గిడి శ్రీకాంత్ మొగదాసు చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న వినూత్న కథాచిత్రం "మిరాకిల్"లో హెబ్బా పటేల్ హీరోయిన్ గా నటిస్తోంది.. సీనియర్ హీరోలు సురేష్, శ్రీరామ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో రణధీర్ బీసు హీరో. "సత్య గ్యాంగ్, ఫైటర్ శివ" చిత్రాల దర్శకుడు ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం మూడో షెడ్యూల్ హైదరాబాద్ పరిసర గ్రామమైన "కొండమడుగు"లో పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు, యూనిట్ సభ్యులందరి సమక్షంలో ప్రెస్ మీట్ నిర్వహించింది "మిరాకిల్" చిత్ర బృందం. తన కెరీర్ బెస్ట్ ఫిల్మ్ గా "మిరాకిల్" నిలిచిపోతుందని ప్రకటించడం ద్వారా ఈ చిత్రంపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది హీరోయిన్ హెబ్బా పటేల్.



## దర్శక సంఘం అధ్యక్షుడిగా వీఎన్ ఆదిత్య



ఆదివారం తెలుగు సినీ దర్శకుల సంఘం ఎన్నికలు కోలాహలంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో వీఎన్ ఆదిత్య ప్యానెల్ ఘన విజయం సాధించింది. దర్శకుల సంఘ అధ్యక్షుడిగా వీఎన్ ఆదిత్య విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా వి. సముద్ర, ప్రధాన కార్యదర్శిగా రామారావు, ట్రెజరర్ గా సాయి రాజేశ్ ఎన్నికయ్యారు. ఇప్పటివరకు జరిగిన దర్శకుల సంఘం ఎన్నికల్లో ఇదే హైయెస్ట్ మెజారిటీ కావడం విశేషం. ఈ సందర్భంగా ఫిలింఛాంబర్ వద్ద ఉన్న స్వర్గీయ దర్శకరత్న దాసరి నారాయణరావు విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం జరిగిన ప్రెస్ మీట్ లో తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ ఒకప్పుడు దర్శకుల సంఘం ఇండస్ట్రీని లీడ్ చేసేది. మధ్యలో కొన్ని ఒడిదొడుకులు వచ్చాయి. ఇప్పుడు మళ్లీ వీఎన్ ఆదిత్య సారథ్యంలోని కమిటీ దర్శకుల సంఘం సంక్షేమానికి కృషి చేస్తుందని ఆశిస్తున్నాం. గెలిచిన వాళ్లే కాదు ఓడిన వాళ్లు కూడా మనవాళ్లే. అందరినీ కలుపుకుపోయి పనిచేయాలని కోరుతున్నా. అన్నారు.

## లేచింది మహిళాలోకం

### ట్రైలర్ లాంచ్



బ్రిహస్పతి ఎంటర్‌టైన్‌మెంట్స్, అప్పారెంట్లీ సినిమా, స్టోరీ ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై హైమ రాజ శేఖర్, శ్వేత మహి, నిరోష నవీన్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'లేచింది మహిళాలోకం'. దర్శకద్వయం అర్జున్‌కార్తిక్ రూపొందించిన ఈ చిత్రంలో మంచు లక్ష్మి, శ్రీరామ చంద్ర, అనన్య నాగళ్ల, హరితేజ, హేమ, సుప్రిత, శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రలు పోషించారు. కొత్తగా పెళ్లయిన ఒక జంట మధ్య చిన్న చిన్న విషయాలకే విబేధాలు రావడం.. వాటికి ఆజ్యం పోసేలా పక్కింటివాళ్లు తమ మాటలతో పొల్యూట్ చేయడం.. ఈ క్రమంలో జరిగే పరిణామాలు ఒకవైపు థ్రిల్‌కు గురి చేస్తూనే మరోవైపు కడుపుబ్బా నవ్వించేలా ఈ సినిమాను తీర్చిదిద్దారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం మార్చి 26న థియేటర్లల్లో విడుదలకు సిద్ధమవుతోంది. సన్‌స్టూడియో యూఎఫ్‌ఓతో కలిసి ఈ సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా మూవీ టీమ్ సోమవారం ప్రసాద్ ల్యాబ్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించింది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.